# శుభోదయం!

ప్రతీ అక్షరం..ప్రజా సమరం......!

WWW.SUBHODAYAMDAILY.COM

అమరావతి,హైదరాబాద్, సంపుటి : 02, సంచిక : 07, పేజీలు : 08, ఎడిటర్ : వి. శ్రీనివాసరావు (6281773157) బుధవారం - 26 - మార్చి - 2025


## వెనెజులా నుంచి ఆయిల్ కొనే దేశాలకు ట్రంప్ వార్నింగ్



25 శాతం పన్నులు విధిస్తామని తేల్చిచెప్పిన అమెరికా అధ్యక్షుడు

ప్రత్యక్షంగా, పరోక్షంగా.. ఎలా కొన్నా సరే టారిఫ్ లు తప్పవని వెల్లడి

2లో

# చిత్తశుద్ధితో పనిచేయాలి

### జిల్లా కలెక్టర్లకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం

**ప్రజలే ఫస్ట్... ఇదే మన విధానం**

- జిల్లా కలెక్టర్లతో సీఎం చంద్రబాబు రెండ్రోజుల సమావేశాలు
- తొలి రోజు సమావేశం
- కలెక్టర్ల పనితీరు ప్రజలపై శాశ్వత ప్రభావం చూపుతుందని వెల్లడి
- కలెక్టర్ల పనితీరును నిరంతరం సమీక్షిస్తామని స్పష్టీకరణ





అమరావతి: రాష్ట్ర పునర్నిర్మాణానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు, గత తొమ్మిది నెలలుగా రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు అవిశ్రాంతంగా కృషి చేస్తున్నామని అన్నారు. గత ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని తీవ్రంగా నష్టపరిచిందని, ఆ నష్టాన్ని అధిగమించి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు చిత్తశుద్ధితో పనిచేయాలని కలెక్టర్లకు సూచించారు. సచివాలయంలో జరిగిన తొలిరోజు కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, రానున్న రోజుల్లో ప్రజల కోసం, జిల్లాల కోసం



చేపట్టాల్సిన కార్యక్రమాలపై ఒక ప్రణాళికను రూపొందించుకోవాలని ఆదేశించారు. కలెక్టర్ల పనితీరు ప్రజలపై శాశ్వతమైన ప్రభావం చూపుతుందని, వారి పనితీరును నిరంతరం సమీక్షిస్తామని అన్నారు. ప్రజా సంక్షేమం, ప్రభుత్వ కార్యక్రమాల అమలులో అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి నొక్కి చెప్పారు. సంక్షేమ పథకాలను ప్రజలకు గౌరవంగా అందించాలని, ప్రతి అధికారి 'ప్రజలే ఫస్ట్' అనే విధానంతో పనిచేయాలని మిగతా 2లో

## ఐటీ, అడ్వాన్స్ కోర్సుల్లో నైపుణ్యాభివృద్ధికి సిస్కోతో ఒప్పందం



- మంత్రి నారా లోకేశ్ సమక్షంలో సిస్కో-ఏపీఎస్ఎస్ డీసీ ఎంఓయూ
- ఈ ఒప్పందం ద్వారా 50వేల మంది యువతకు డిజిటల్, ఐటీ నైపుణ్యాభివృద్ధి శిక్షణ
- విద్యార్థుల్లో డిజిటల్ నైపుణ్యాలను విస్తరించడానికి నెట్‌వర్కింగ్, సైబర్ సెక్యూరిటీ, ఏఐ వంటి రంగాలలో కోర్సులు

హైదరాబాద్: రాష్ట్రంలోని వివిధ విద్యాసంస్థల్లో ఉన్నత విద్య (డిగ్రీ, ఇంజనీరింగ్), వృత్తివిద్య అభ్యసిస్తున్న విద్యార్థుల్లో ఐటీ, అడ్వాన్స్ టెక్నాలజీ నైపుణ్యాలను పెంపొందించేందుకు ప్రఖ్యాత ఐటీ సంస్థ సిస్కో, ఏపీ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ నడుమ ఒప్పందం కుదిరింది. రాష్ట్ర విద్య, ఐటీ, మిగతా 2లో



## జమిలి ఎన్నికలపై ఏర్పాటైన జేపీసీ గడువు పొడిగింపు

- రాజ్యాంగ సవరణ బిల్లుపై అధ్యయనం చేసేందుకు జేపీసీ ఏర్పాటు
- ఏప్రిల్ 4వ తేదీతో ముగియనున్న జేపీసీ కాలపరిమితి
- గడువు పొడిగిస్తూ తీర్మానం ప్రతిపాదించిన బీజేపీ ఎంపీ పీపీ చౌదరి

2లో



## ప్రసాదంపై జీఎస్టీ మినహాయింపు: ప్రకటించిన నిర్మలా సీతారామన్

- రెండో విడత బడ్జెట్ సమావేశాల్లో భాగంగా ఆర్థిక బిల్లు 2025పై చర్చ
- ఆలయాలు, ప్రార్థనా మందిరాల్లో విక్రయించే ప్రసాదాలకు జీఎస్టీ వర్తించబోదని వెల్లడి

### నీరా కేఫ్‌ను కల్లుగీత పారిశ్రామిక కార్పొరేషన్‌కు

# అప్పగిస్తూ జీఓ జారీ

- ట్యాంక్‌బండ్ నీరా కేఫ్ విషయంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం
- పర్యాటక శాఖ నుంచి రాష్ట్ర కల్లుగీత పారిశ్రామిక కార్పొరేషన్‌కు బదిలీ




హైదరాబాద్: ట్యాంక్‌బండ్ పీపుల్స్ ప్లాజాలో నెలకొల్పిన నీరా కేఫ్ విషయంలో తెలంగాణ ప్రభుత్వం తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది. నీరా కేఫ్‌ను కల్లుగీత పారిశ్రామిక కార్పొరేషన్‌కు అప్పగిస్తూ జీఓ జారీ చేసింది. ప్రభుత్వం ఎక్సైజ్, పర్యాటక శాఖలతో సంప్రదింపులు జరిపిన తర్వాత నీరా కేఫ్‌ను పర్యాటక శాఖ నుంచి రాష్ట్ర కల్లుగీత పారిశ్రామిక కార్పొరేషన్‌కు బదిలీ చేసింది. దీంతో ఈ నిర్ణయం తీసుకున్న సీఎం రేవంత్ రెడ్డికి, మంత్రి పొన్నం ప్రభాకర్ కు ఎమ్మెల్సీ, టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, టీపీసీసీ కల్లుగీత విభాగం అధ్యక్షుడు నాగరాజు గౌడ్ ధన్యవాదాలు తెలిపారు. ఇదిలా ఉంటే... సుమారు మిగతా 2లో



## హైదరాబాద్‌లో అగ్ని ప్రమాదాలు, ట్రాఫిక్ జామ్ లు...

### హైడ్రా, జీహెచ్‌ఎంసీ కీలక నిర్ణయం


2లో

- సంయుక్తంగా రెండు కమిటీలు వేయాలని హైడ్రా, జీహెచ్‌ఎంసీ నిర్ణయం
- అగ్నిమాపక శాఖతో కలిసి అగ్ని ప్రమాదాలపై ఒక కమిటీని వేయాలని నిర్ణయం

## కశ్మీర్ లో ఆక్రమించిన ప్రాంతాన్ని ఖాళీ చేయాల్సిందే

- పాకిస్థాన్ కు భారత్ వార్నింగ్
- ఐరాసలో కశ్మీర్ అంశాన్ని ప్రస్తావించిన పాకిస్థాన్
- పాక్ ఆక్రమించుకున్న ప్రాంతం భారత్ లో అంతర్భాగమేనన్న భారత్
- కశ్మీర్ పై అనవసర వ్యాఖ్యలు చేశారని మండిపాటు








ఢిల్లీ: అంతర్జాతీయ వేదికలపై భారత్ ను నిందించాలని ప్రయత్నించిన ప్రతిసారీ పాకిస్థాన్ కు భంగపాటు తప్పడం లేదు. తాజాగా పాక్ పై భారత్ మరోసారి తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. పాక్ ఆక్రమించుకున్న ప్రాంతం ఎప్పటికీ భారత్ లో అంతర్భాగమేనని... చట్టవిరుద్ధంగా పాకిస్థాన్ ఆక్రమించిన మిగతా 2లో

## ఏప్రిల్ మొదటివారంలో మెగా డీఎస్సీ నోటిఫికేషన్

కలెక్టర్ల సదస్సును ఉద్దేశించి సీఎం చంద్రబాబు ప్రసంగం

జూన్‌లో పాఠశాలలు తెరిచేలోపు నియామకాలు పూర్తి చేస్తామని ప్రకటన



## ఏప్రిల్ 3న తెలంగాణ కొత్త

# మంత్రుల ప్రమాణం..?

### తెలంగాణలో మంత్రివర్గ విస్తరణకు కాంగ్రెస్ అధిష్ఠానం గ్రీన్ సిగ్నల్



హైదరాబాద్ : తెలంగాణలో మంత్రివర్గ విస్తరణకు కాంగ్రెస్ అధిష్ఠానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన విషయం తెలిసిందే. నలుగురు కొత్త మంత్రులు ప్రమాణం స్వీకారం చేయనున్నారు. ఏప్రిల్ 3న వీరి ప్రమాణ స్వీకారోత్సవం ఉంటుందని తెలుస్తోంది. ఇక నలుగురు మంత్రుల్లో ఇద్దరు బీసీలు, రెడ్డి, ఎస్సీ సామాజిక వర్గాలకు చెందిన వారికి మంత్రివర్గంలో చోటు దక్కనున్నట్లు సమాచారం. ఈ మేరకు రాష్ట్ర కోర్ కమిటీ నుంచి ఏఐసీసీ వివరాలు తీసుకుందని తెలుస్తోంది. రెడ్డి సామాజిక వర్గంలో రాజగోపాల్ రెజగోడ్డి, సుదర్శన్ రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డిలో ఒకరికి

వివరాలు 2లో..



- తెలంగాణ క్యాబినెట్ విస్తరణ.. కొత్తగా నలుగురికి ఛాన్స్.. రేసులో వీరు..!
- నలుగురు కొత్త మంత్రులు ప్రమాణం స్వీకారం చేసే అవకాశం
- ఇద్దరు బీసీలు, రెడ్డి, ఎస్సీ సామాజిక వర్గాలకు చెందిన వారికి మంత్రివర్గంలో చోటు

### కొత్త కేబినెట్‌లో వీరికి ఛాన్స్..

కొత్త మంత్రివర్గంలో రెండు బీసీ, ఒక రెడ్డి, ఒక ముస్లిం, ఒక ఎస్సీ సామాజిక వర్గాలకు అవకాశం దక్కే సూచనలు కనిపిస్తున్నాయి. బీసీ కోటా లో మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్లు వినిపిస్తుండగా, ఎస్సీ కోటాలో చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకట్ స్వామి పేరు ప్రముఖంగా ఉంది. రెడ్డి కోటాలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి మధ్య పోటీ నెలకొంది. మైనారిటీ కోటా లో ఎమ్మెల్సీ మీర్ అమీర్ అలీఖాన్‌కు అవకాశం ఉండగా, ఇటీవల ఎమ్మెల్సీగా ఎన్నికైన విజయశాంతి పేరు కూడా చర్చలో ఉంది.

### తెలంగాణ క్యాబినెట్ విస్తరణ.. కొత్తగా నలుగురికి ఛాన్స్.. రేసులో వీరు..!

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు పూర్తయిన నేపథ్యంలో మంత్రివర్గ విస్తరణకు సమయం ఆసన్నమైంది. ఉగాది సందర్భంగా ఈ విస్తరణ జరిగే అవకాశం ఉందని ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో సోమవారం ఢిల్లీ లో కాంగ్రెస్ నేత కేసీ వేణుగోపాల్ నివాసంలో కీలక సమావేశం జరిగింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌తో పాటు పలువురు నేతలు హాజరైన ఈ భేటీలో మంత్రివర్గ విస్తరణ పై చర్చలు జరిగాయి. పార్టీ అధిష్ఠానం ఈ విషయంలో నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. ప్రస్తుతం రాష్ట్రంలో ఆరు మంత్రి పదవులు ఖాళీగా ఉన్నాయి. వీటిని ఎవరికి కట్టబెట్టాలనే దానిపైనా అధిష్ఠానం ఓ అభిప్రాయానికి వచ్చినట్టు తెలుస్తోంది.

## వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో అధికారమే లక్ష్యంగా ఎన్డీయే పార్టీలు ప్లాన్...?





- ఆపరేషన్ తెలంగాణ...బిజెపి కొత్త ప్లాన్
- బీజేపీ నాయకులకు కొత్త టెన్షన్.. అప్పుడే ఎందుకు ఈ హైరానా..?
- తెలంగాణలో ఎన్డీయే యాక్టివ్ కాబోతున్నట్టు ప్రచారం...?

హైదరాబాద్: తెలంగాణలో ఎన్డీయే యాక్టివ్ కాబోతున్నట్టు ప్రచారం జరుగుతోంది. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో అధికారమే లక్ష్యంగా ఎన్డీయే పార్టీలు ప్లాన్ చేస్తున్నట్టు టాక్ వినిపిస్తోంది. 2028 అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావాలంటే.. ఎన్డీయే మిత్రపక్షాలైన జనసేన- టీడీపీ పార్టీల సేవలను వాడుకోవాలని కాషాయ పార్టీ పెద్దలు ఆలోచిస్తున్నారట. ఇప్పటికే ఈ ఫార్ములా ఏపీలో సక్సెస్ కావడంతో.. తెలంగాణలోనూ అమలు చేయాలని లెక్కలు వేసుకుంటున్నారట. ప్రస్తుతం ఉత్తర తెలంగాణలో కాషాయ పార్టీ బలంగా ఉంది. కానీ దక్షిణ తెలంగాణలో మాత్రం పార్టీ కాస్త బలహీనంగా ఉంది. ఈ నేపథ్యంలో టీడీపీ, జనసేనను బరిలో దింపాలని అనుకుంటున్నట్లుగా చెబుతున్నారు. కానీ రాష్ట్ర బీజేపీ నేతలు మాత్రం ఈ కలయికను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు తెలుస్తోంది. గతంలోనూ ఈ ప్రయోగం విఫలమైందని కాషాయ పెద్దలకు చెప్పినట్టు సమాచారం. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో కూటమి మిగతా 2లో

## బయట ప్రశ్నిస్తే కేసులు.. అసెంబ్లీలో నిలదీస్తే సస్పెన్షన్లు హరీష్ రావు

2లో



## టీడీపీ, వైసీపీ పార్టీలవి నీచ రాజకీయాలు

- పెట్రో ధరలపై భగ్గుమన్న షర్మిల
- పొరుగు రాష్ట్రాల్లో కంటే ఏపీలో పెట్రో ధరలు ఎక్కువగా ఉన్నాయి
- గతంలో 17 రూపాయలు తగ్గించాలని చంద్రబాబు డిమాండ్ చేశారు
- ఇప్పుడు అధికారంలో ఉన్నందున మాట నిలబెట్టుకోవాలి

## ప్రసాదంపై జీఎస్టీ మినహాయింపు ప్రకటించిన నిర్మలా సీతారామన్

ఢిల్లీ: జీఎస్టీ నుండి ఆలయ ప్రసాదాలను మినహాయిస్తున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. పార్లమెంటు బడ్జెట్ సమావేశాల సందర్భంగా లోక్‌సభలో ఆర్థిక బిల్లు 2025పై జరిగిన చర్చలో ఆమె ఈ ప్రకటన చేశారు. ఈ సందర్భంగా ఆమె పలు కీలక విషయాలను వెల్లడించారు. దేవాలయాలు, ప్రార్థనా మందిరాల్లో విక్రయించే ప్రసాదాలపై జీఎస్టీ వర్తించదని ఆమె స్పష్టం చేశారు. అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులలో నెలకొన్న అనిశ్చితిని తొలగించే క్రమంలో ఆన్‌లైన్ ప్రకటనలపై విధిస్తున్న ఈక్వలైజేషన్ లెవీ/డిజిటల్ పన్నును రద్దు చేయనున్నట్లు ఆర్థిక మంత్రి తెలిపారు. లోక్‌సభలో ఆర్థిక బిల్లు 2025కి ప్రతిపాదించిన 59 సవరణల్లో ఇది కూడా ఒకటి.

## జమిలి ఎన్నికలపై ఏర్పాటైన జేపీసీ గడువు పొడిగింపు

ఢిల్లీ: జమిలి ఎన్నికల కోసం ఏర్పాటు చేసిన సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) కాలపరిమితిని పెంచేందుకు లోక్‌సభ అంగీకరించింది. జమిలి ఎన్నికల కోసం లోక్‌సభలో ప్రవేశపెట్టిన రాజ్యాంగ సవరణ బిల్లుపై అధ్యయనం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం జేపీసీని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. తాజాగా, బీజేపీ ఎంపీ పీపీ చౌదరి ప్రతిపాదించిన గడువు పెంపు తీర్మానానికి సభ ఆమోదం తెలిపింది. రాబోయే వర్షాకాల సమావేశాల చివరి వారంలో తొలి రోజు వరకు గడువును పొడిగించింది. 39 మంది ఎంపీలతో ఏర్పాటు చేసిన జేపీసీ కమిటీ ఈ బిల్లును అధ్యయనం చేస్తోంది. ఇందులో లోక్‌సభ నుంచి 27, రాజ్యసభ నుంచి 12 మంది సభ్యులు ఉన్నారు. వాస్తవానికి ఈ కమిటీ కాలపరిమితి ఏప్రిల్ 4న ముగియనుంది. ఈ బిల్లుపై చేయాల్సిన పని ఇంకా మిగిలి ఉందని అధికార వర్గాలు వెల్లడించిన నేపథ్యంలో జేపీసీ గడువు పొడిగించే తీర్మానానికి లోక్ సభ ఆమోదం తెలిపింది.

## 72 గంటల్లో వాళ్లంతా క్షమాపణ చెప్పాలి

హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల్లో బెట్టింగ్ యాప్స్ కలకలం రేపుతున్నాయి. పలువురు సెలబ్రిటీలపై ఇప్పటికే కేసులు నమోదయ్యాయి. తాజాగా ఈ అంశంపై ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ స్పందిస్తూ... బెట్టింగ్ యాప్స్ పై సుప్రీంకోర్టులో పిల్ దాఖలు చేశానని తెలిపారు. బెట్టింగ్ యాప్స్ డ్రగ్స్ కంటే ప్రమాదకరమైనవని... ఈ విషయాన్ని గతంలో తాను ఎన్నోసార్లు చెప్పానని అన్నారు. అప్పుడు తన మాటలను ఎవరూ పట్టించుకోలేదని అసహనం వ్యక్తం చేశారు. తెలంగాణలో బెట్టింగ్ యాప్స్ పై బ్యాన్ ఉన్నప్పటికీ 978 మంది చనిపోయినట్టు అధికారిక గణాంకాలు చెపుతున్నాయని పాల్ తెలిపారు. ఈ యాప్స్ ను ప్రమోట్ చేసిన సెలబ్రిటీలు 72 గంటల్లో క్షమాపణ చెప్పాలని, నష్టపోయిన వారికి పరిహారం ఇప్పించాలని అన్నారు. ఇది బెదిరింపు కాదని... ఈడ్చుకెళ్తానని హెచ్చరించారు. సినీ నటులు, క్రీడాకారులు, సెలబ్రిటీలను యువత రోల్ మెడల్ గా తీసుకుంటుందని... కానీ, వారంతా సైతాన్లుగా మారారని... ఎంతో మంది చావులకు కారణమయ్యారని మండిపడ్డారు.

## వెనెజులా నుంచి ఆయిల్ కొనే దేశాలకు ట్రంప్ వార్నింగ్

అమెరికా: వెనెజులా నుంచి చమురు కొనుగోలు చేసే దేశాలకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా హెచ్చరికలు జారీ చేశారు. ఆ దేశం నుంచి చమురు కానీ, గ్యాస్ కానీ కొనుగోలు చేసే దేశాలపై తాము 25 శాతం పన్నులు విధిస్తామని స్పష్టం చేశారు. వెనెజులా నుంచి చివరిసారిగా జరిపిన కొనుగోలు నుంచి ఏడాది వరకు ఈ ఆంక్షలు అమలవుతాయని తెలిపారు. ట్రంప్ తాజా నిర్ణయంతో భారత్ తో పాటు చైనాపైనా ప్రభావం పడనుంది. వెనెజులా నుంచి భారత్ చమురు కొనుగోలు చేస్తోంది. 2024 జనవరిలో ఆ దేశం ఎగుమతి చేసిన చమురు ఉత్పత్తుల్లో మెజారిటీ వాటా భారతదేశానిదే. రోజుకు దాదాపు 2.5 లక్షల బ్యారెళ్ల ముడి చమురును వెనెజులా నుంచి భారత్ దిగుమతి చేసుకుంటోంది. గతేడాది విదేశాల నుంచి కొనుగోలు చేసిన మొత్తం ముడి చమురులో 1.5 శాతం వెనెజులా నుంచే దిగుమతి చేసుకుంది. అలాగే చైనాకు కూడా రోజుకు 5 లక్షల బ్యారెళ్ల ముడి చమురును వెనెజులా ఎగుమతి చేస్తోంది. ఈ నేపథ్యంలో ట్రంప్ టారిఫ్ ల ప్రభావం భారత్, చైనాలపై పడనుంది.

ఎందుకీ నిర్ణయం..

ట్రంప్ ఇటీవల అక్రమంగా అమెరికాలో ఉంటున్నవారిని యుద్ధ విమానాలలో వారి వారి స్వదేశాలకు పంపిస్తున్న విషయం విదితమే. ఇందులో భాగంగా వెనెజులా పౌరులు 200 ల మందిని ప్రత్యేక విమానాల్లో ట్రంప్ వాపస్ పంపించారు. దీనిపై మండిపడ్డ వెనెజులా.. ఇకపై అమెరికా విమానాలను తమ దేశంలోకి అనుమతించబోమని స్పష్టం చేసింది. అదేసమయంలో అమెరికాకు చమురు ఎగుమతులపైనా ఆంక్షలు విధించింది. వెనెజులా నిర్ణయంపై మండిపడ్డ ట్రంప్.. తాజాగా ఆ దేశం నుంచి చమురు, గ్యాస్ కొనుగోలు చేయొద్దని ప్రపంచ దేశాలకు పిలుపునిచ్చారు. అలా కొనుగోలు చేస్తే ఆయా దేశాలు అమెరికాకు చేసే ఎగుమతులపై 25 శాతం పన్నులు విధిస్తామని ట్రంప్ స్పష్టం చేశారు.

## టీడీపీ, వైసీపీ పార్టీలవి నీచ రాజకీయాలు


అమరావతి: తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో పెట్రోల్, డీజిల్ ధరలు అధికంగా ఉన్నాయని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ధ్వజమెత్తారు. పెట్రోల్, డీజిల్ మీద పన్నులు తగ్గింపుపై టీడీపీ, వైసీపీ పార్టీలవి నీచ రాజకీయాలు అని విమర్శించారు. ప్రతిపక్షంలో ఒక మాట... అధికారపక్షంలో మరో మాట... గత 10 ఏళ్లుగా ఈ రెండు పార్టీల ప్రభుత్వాలు చేసింది దారి దోపిడీ తప్ప మరొకటి కాదని మండిపడ్డారు. వ్యాట్ పేరుతో ఏ రాష్ట్రంలో లేనంతగా ప్రజలపై పన్ను పోటు విధించారని ఆరోపించారు. దేశంలోనే అత్యధిక పన్నులు వేసిన రాష్ట్రంగా ముందువరసలో పెట్టి... రాష్ట్ర ప్రజానీకాన్ని లూటీ చేశారని షర్మిల మండిపడ్డారు. "ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో లీటరు పెట్రోల్ ధర రూ. 109.60, డీజిల్ ధర రూ. 97.47గా ఉంది. పొరుగు రాష్ట్రాలైన తమిళనాడులో పెట్రోల్ రూ. 100.86, డీజిల్ రూ. 92.39బీ కర్ణాటకలో పెట్రోల్ రూ. 102.90, డీజిల్ రూ. 88.99బీ తెలంగాణలో పెట్రోల్ రూ. 107.46, డీజిల్ రూ. 95.70గా ఉన్నాయి. ఈ లెక్కల ప్రకారం, ఏపీలో పెట్రోల్, డీజిల్ ధరలు ఇతర రాష్ట్రాల కంటే ఎక్కువగా ఉన్నాయని స్పష్టమవుతోంది" అని షర్మిల వివరించారు. చంద్రబాబు విపక్ష నేతగా ఉన్నప్పుడు లీటరుకు రూ. 17 తగ్గించాలని డిమాండ్ చేశారని, ఇప్పుడు ఆ హామీని నిలబెట్టుకోవాలని షర్మిల డిమాండ్ చేశారు. గతంలో జగన్ కూడా పెట్రోల్, డీజిల్ ధరలపై విమర్శలు చేసి, అధికారంలోకి వచ్చాక వాటిని పెంచారని గుర్తు చేసింది. రెండు పార్టీలు కలిసి ప్రజల నుంచి రూ. 50 వేల కోట్లు వసూలు చేశాయని ఆరోపించారు. "కూటమి ప్రభుత్వాన్ని గెలిపిస్తే ఇంధనం ధరలు తగ్గిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఇప్పుడు మీరు అధికారంలో ఉన్నారు. ఇచ్చిన హామీ ప్రకారం ఎప్పటి నుంచి ధరలు తగ్గిస్తారో సమాధానం చెప్పాలి. 17 రూపాయలు ధర తగ్గించి ఇచ్చిన హామీ వెంటనే నిలబెట్టుకోవాలని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నాం" అని షర్మిల స్పష్టం చేశారు.

## హైదరాబాద్‌లో అగ్ని ప్రమాదాలు, ట్రాఫిక్ జామ్ లు... హైడ్రా, జీహెచ్‌ఎంసీ కీలక నిర్ణయం




హైదరాబాద్: హైడ్రా, జీహెచ్‌ఎంసీ సంయుక్తంగా హైదరాబాద్ నగరంలో రెండు కమిటీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించాయి. నగరంలో వరుసగా జరుగుతున్న అగ్ని ప్రమాదాలు, వర్షాకాలంలో ఎదురయ్యే వరద ముంపు నివారణకు పరిష్కారం కనుగొనేందుకు జీహెచ్‌ఎంసీ, హైడ్రా కలిసి ఈ కమిటీలను వేయాలని నిర్ణయించాయి. వరద ముంపుతో పాటు అగ్ని ప్రమాదాలకు ఆస్కారం లేకుండా తీసుకోవాల్సిన చర్యలపై కలిసి పనిచేయాలని నిర్ణయించాయి. ఈ మేరకు జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో హైడ్రా కమిషనర్ రంగనాథ్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి సమావేశమయ్యారు. వర్షాకాలంలో తీసుకోవాల్సిన చర్యలు, అగ్నిప్రమాదాల నివారణపై సమీక్ష జరిపారు. అగ్ని ప్రమాదాల నివారణకు అగ్నిమాపక శాఖతో పాటు హైడ్రా, జీహెచ్‌ఎంసీ విభాగాలతో కలిసి ఒక కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. వర్షాకాలంలో వరద ముంపు నివారణతో పాటు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూసేందుకు ట్రాఫిక్, హైడ్రా, జీహెచ్‌ఎంసీ అధికారులతో మరో కమిటీని వేయాలని నిర్ణయించారు.

## ఏప్రిల్ మొదటివారంలో మెగా డీఎస్సీ నోటిఫికేషన్: సీఎం చంద్రబాబు



అమరావతి: ఏపీలోని నిరుద్యోగులకు సీఎం చంద్రబాబు నాయుడు గుడ్‌న్యూస్ చెప్పారు. ఏప్రిల్ మొదటివారంలో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. స్కూళ్ల ప్రారంభం నాటికే నియామక ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు. సచివాలయంలో జరుగుతున్న కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు మాట్లాడారు. "గత ఐదేళ్లలో ఒక వ్యక్తి రాష్ట్రాన్ని విధ్వంసం చేశారు. రాష్ట్ర ప్రజలు గత పాలనతో విసిగి మాకు మద్దతు ఇచ్చారు. ప్రజలకు సుపరిపాలన, సంక్షేమం, అభివృద్ధి అందాలి. వచ్చే నెల మొదటి వారంలో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తాం. ఎస్సీ వర్గీకరణతోనే డీఎస్సీ భర్తీ చేస్తాం. జూన్‌లో పాఠశాలలు తెరిచేలోపు నియామకాలు పూర్తి కావాలి. 2027 నాటికి పోలవరం పూర్తి చేసి తీరుతాం. అమరావతి ఓ సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్ట్. ప్రపంచంలోనే బెస్ట్ మోడల్‌తో అమరావతిని అభివృద్ధి చేస్తాం"అని చంద్రబాబు పేర్కొన్నారు.

# చిత్తశుద్ధితో పనిచేయాలి

మొదటి పేజీ తరువాయి




ప్రతి అధికారి 'ప్రజలే ఫస్ట్' అనే విధానంతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న 22 రకాల సేవలకు సంబంధించి ప్రజల నుంచి అభిప్రాయాలు తీసుకుంటున్నామని, ఈ ప్రభుత్వం తమ కోసమే పనిచేస్తోందనే నమ్మకం ప్రజల్లో కలిగించాలని అన్నారు. రాష్ట్ర అభివృద్ధికి విజన్ 2047 ఒక దిక్సూచిలాంటిదని ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్రం, జిల్లా, నియోజకవర్గం, మండలం, గ్రామ సచివాలయం వరకు ప్రణాళికలు ఉండాలని, జిల్లాల్లో కలెక్టర్ విజన్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా వ్యవహరిస్తారని తెలిపారు. రాష్ట్రంలో రూ.55 వేల కోట్ల విలువైన జాతీయ రహదారుల పనులు జరుగుతున్నాయని, వాటిని రెండేళ్లలో పూర్తి చేయాలని, పర్యావరణ అనుమతుల కోసం కలెక్టర్లు చొరవ తీసుకోవాలని సూచించారు. ప్రజల ఆమోదం పొందేలా పాలన ఉండాలని, గత ఐదేళ్లలో జరిగిన విధ్వంసం కారణంగా ప్రజల్లో అసహనం పెరిగిందని ముఖ్యమంత్రి అన్నారు. కూటమికి 93 శాతం స్ట్రైక్‌రేట్ రావడానికి ఇదే కారణమని, ప్రజలు కూటమి ప్రభుత్వంపై ఎక్కువ ఆశలు పెట్టుకున్నారని ఆయన అన్నారు. సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయాలంటే తగినంత ఆదాయం ఉండాలని, అప్పులతో చేస్తే అవి స్థిరంగా ఉండవని ఆయన అన్నారు. గత ప్రభుత్వం రూ.9.74 లక్షల కోట్లు అప్పులు చేసిందని, వాటిని తీర్చడానికి వడ్డీలు కట్టాల్సి వస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాల్లో వ్యవసాయం, దాని అనుబంధ రంగాలపై దృష్టి పెట్టాలని, మారిన ఆహారపు అలవాట్లకు అనుగుణంగా ఉత్పత్తులు రావాలని ముఖ్యమంత్రి అన్నారు. రాబోయే 5 ఏళ్లలో గ్రీన్ ఎనర్జీలో రూ.10 లక్షల కోట్లు పెట్టుబడులు, 7.5 లక్షల ఉద్యోగాలు సాధించేలా ముందుకెళుతున్నామని, పర్యాటకంలో 20 శాతం గ్రోత్ రేట్ లక్ష్యంగా పెట్టుకున్నామని ఆయన తెలిపారు. జీఎస్టీపై సమీక్షలు చేసి బకాయిలు వసూలు చేయాలని, పన్ను ఎగవేతదారుల పట్ల కఠినంగా ఉండాలని నిర్దేశించారు. స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖను కూడా ప్రక్షాళన చేస్తామని ముఖ్యమంత్రి అన్నారు. మున్సిపల్ శాఖలో ఫిర్యాదులు రాకుండా ఉన్నప్పుడే బాగా పనిచేసినట్లు భావిస్తామని, శాంతి భద్రతల విషయంలో రాజీపడొద్దని, గంజాయి సరఫరా చేసి, రౌడీయిజం చేసేవారి పట్ల ఉక్కుపాదం మోపాలని, శాంతిభద్రతల పరిరక్షణకు కలెక్టర్లు జిల్లా ఎస్పీలతో కలిసి పనిచేయాలని చంద్రబాబు ఆదేశించారు.

## నీరా కేఫ్‌ను కల్లుగీత పారిశ్రామిక కార్పొరేషన్‌కు అప్పగిస్తూ జీఓ జారీ

మొదటి పేజి తరువాయి




ఇదిలా ఉంటే... సుమారు రూ.12 కోట్ల వ్యయంతో అత్యాధునిక వసతులతో నీరా కేఫ్‌ను కేసీఆర్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈత మొద్దులు, తాటిమొద్దులపై కూర్చోడానికి వీలుగా సీట్లను డిజైన్ చేశారు. వాటిపై కూర్చుని ముచ్చట్లు చెప్పుకుంటూ నీరా తాగడానికి ఇక్కడికి జనాలు వస్తుంటారు. ఇక్కడి ఫుడ్ స్టాల్‌లో తెలంగాణ వంటకాలను సైతం వడ్డిస్తారు. గీతకార్మికుల అస్తిత్వానికి ప్రతీకగా ఈ నీరాకేఫ్ ఉంది. ఇతర పానీయాలతో పోల్చితే నీరా ఆరోగ్యానికి ఎంతో మంచిదనేది వైద్య నిపుణుల మాట.

## కశ్మీర్ లో ఆక్రమించిన ప్రాంతాన్ని ఖాళీ చేయాల్సిందే

మొదటి పేజి తరువాయి




చట్టవిరుద్ధంగా పాకిస్థాన్ ఆక్రమించిన కశ్మీర్ భూభాగాలను ఖాళీ చేయాల్సిందేనని తేల్చి చెప్పింది. శాంతి పరిరక్షణ సంస్కరణలపై ఐక్యరాజ్యసమితిలో చర్చ సందర్భంగా పాకిస్థాన్ ప్రతినిధి మాట్లాడుతూ... కశ్మీర్ అంశాన్ని లేవనెత్తారు. దీంతో ఐక్యరాజ్యసమితిలో భారత శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీశ్ మాట్లాడుతూ... పాకిస్థాన్ అనవసర అంశాలను లేవనెత్తుతోందని మండిపడ్డారు. కశ్మీర్ పై మరోసారి అనవసర వ్యాఖ్యలు చేశారని అన్నారు. పదేపదే ఈ అంశాన్ని లేవనెత్తడం వల్ల వారు చేసే చట్టవిరుద్ధ వాదనలు నిజమైపోవని అన్నారు. ఇలాంటి ప్రయత్నాలతో సీమాంతర ఉగ్రవాదాన్ని సమర్థించుకోలేరని చెప్పారు. కశ్మీర్ లోని కొంత ప్రాంతం ఇప్పటికీ పాక్ ఆక్రమణలోనే ఉందని... దాన్ని పాకిస్థాన్ ఖాళీ చేయాల్సిందేనని అన్నారు. పాకిస్థాన్ కుతంత్రాలు చేయడం మానుకుంటే మంచిదని హితవు పలికారు.

## ఐటీ, అడ్వాన్స్‌డ్ కోర్సుల్లో నైపుణ్యాభివృద్ధికి సిస్కోతో ఒప్పందం

మొదటి పేజి తరువాయి



రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్ శాఖల మంత్రి నారా లోకేశ్ సమక్షంలో ఉండవల్లి నివాసంలో ఇరుపక్షాల ప్రతినిధులు ఎంఓయూపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ప్రకారం సిస్కో విద్యార్థుల్లో డిజిటల్ నైపుణ్యాలను విస్తరించడానికి నెట్‌వర్కింగ్, సైబర్ సెక్యూరిటీ, ఏఐ వంటి రంగాలలో అత్యాధునిక కంటెంట్‌ను అందిస్తుంది. అధికారుల్లోనూ డిజిటల్ నైపుణ్యాలను పెంపొందించనుంది. ఆంధ్రప్రదేశ్ అంతటా విద్యార్థులకు వర్చువల్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌లను అందిస్తుంది. ఏ కోర్సుల్లో శిక్షణ అందించాలో ఉన్నత విద్యాశాఖ నుంచి ప్రాధాన్యతల ఆధారంగా కోర్సుల జాబితాను ఖరారు చేస్తారు. ఉన్నత విద్యాసంస్థల్లో విద్యనభ్యసించే విద్యార్థులలో నైపుణ్యాభివృద్ధి, వృత్తి విద్యను ప్రోత్సహించడమే ఈ ఒప్పందం ముఖ్యోద్దేశం. ఈ ఒప్పందం ద్వారా 50వేల మంది యువతకు డిజిటల్, ఐటీ నైపుణ్యాభివృద్ధికి సిస్కో శిక్షణ అందించనుంది. నైపుణ్యం కలిగిన మానవ వనరుల కోసం పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా నైపుణ్యాల అంతరాన్ని తగ్గించడం, ఉపాధిని పెంపొందించడమే ఈ సహకారం లక్ష్యం. ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థుల్లో డిజిటల్ నైపుణ్య సామర్థ్యాన్ని పెంపొందించేలా సిస్కో వర్చువల్ విధానంలో NetAcad పోర్టల్ ద్వారా స్వీయ-అభ్యసన, బోధకుల నేతృత్వంలో ఇండస్ట్రీ ఎక్స్‌పోజర్ ప్రాక్టికల్ ఎక్స్‌పీరియన్స్ కోర్సుల్లో శిక్షణ ఇస్తుంది. విద్యార్థులకు ఆయా సంస్థల డిమాండ్ ఆధారిత కోర్సుల్లో శిక్షణా కార్యక్రమాలను డిజైన్ చేస్తారు. మారుతున్న సాంకేతికలకు అనుగుణంగా ముందస్తు అవసరాలకు సరిపడా సైబర్ సెక్యూరిటీ, డిజిటల్ నైపుణ్యాలను అభివృద్ధి చేయాలన్న ఏపీ ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ఈ శిక్షణ కార్యక్రమాలు ఉంటాయి. స్వీయ-అభ్యసన (సెల్ఫ్ లెర్నింగ్) కోర్సుల్లో అవగాహన పెంచడం, విద్యార్థులను ప్రోత్సహించడం ముఖ్య ఉద్దేశం. వివిధ ప్రభుత్వ విభాగాల్లో అవసరాలకు అనుగుణంగా లెర్నర్ పార్టిసిపేషన్, కాంపిటీషన్స్, ఫ్యాకల్టీ ట్రైనింగ్, వర్క్ షాప్స్ నిర్వహణ వంటివి ఏపీఎస్ఎస్ డీసీ చేపడుతుంది. ఆయా కోర్సుల్లో విజయవంతంగా శిక్షణ పూర్తిచేసిన విద్యార్థులు, ఉద్యోగులకు సిస్కో సర్టిఫికెట్లను జారీచేస్తుంది. ఏపీఎస్ఎస్ డీసీ ద్వారా విద్యార్థులకు వర్చువల్ ఇంటర్న్ షిప్ ప్రోగ్రామ్ లను అందిస్తారు. ఐటీ కెరీర్ లో యువతులకు మద్దతు నిచ్చే ఉమెన్ రాక్ ఐటీ (డబ్ల్యూఆర్ఐటీ), అధునాతన టెక్నాలజీలో యువత, విద్యార్థులకు మద్ధతునిచ్చే ఫైండ్ యువర్ సెల్ఫ్ ఇన్ ద ఫీచర్(ఎఫ్‌వైఐఎఫ్) వంటి ప్రోగ్రామ్ లను సిస్కో సీఎస్ఆర్ నిధుల ద్వారా అందిస్తుంది. ఈ కార్యక్రమంలో నైపుణ్యాభివృద్ధి, శిక్షణ విభాగం కార్యదర్శి కోన శశిధర్, ఏపీ స్కిల్ డెవలప్ మెంట్ కార్పోరేషన్ ఎండీ, సీఈవో జి.గణేష్ కుమార్, ఏపీఎస్ఎస్ డీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.దినేష్ కుమార్, సిస్కో సీనియర్ వైస్ ప్రెసిడెంట్, గ్లోబల్ ఇన్నోవేషన్ ఆఫీసర్ డాక్టర్ దేడ్రిచ్, గవర్నమెంట్ అఫైర్స్ డైరెక్టర్ హరీశ్ కృష్ణన్, సేల్స్ బిజినెస్ డెవలప్ మెంట్ డైరెక్టర్ కె. వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో అధికారమే లక్ష్యంగా ఎన్డీయే పార్టీలు ప్లాన్...?





ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో కూటమి పార్టీలన్నీ జట్టుకట్టాయి. టీడీపీ- బీజేపీ- జనసేన పార్టీలు కలిపి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలోనూ ఇదే ఫార్ములాను అమలు చేసే ఆలోచనలో పార్టీ పెద్దలు ఉన్నారట. ఇదే విషయమై రాష్ట్ర బీజేపీ నేతలు తెగ టెన్షన్ పడుతున్నట్టు తెలుస్తోంది. తెలంగాణ లో కూటమి అనే ఆలోచనే సరైంది కాదని అంటున్నారట. ఇది జరిగితే మాత్రం మరోసారి బీఆర్ఎస్‌కు అవకాశం ఇచ్చినట్లవుతుందని అంటున్నారట. గతంలోనూ ఇదే మిస్టేక్ చేశామని పార్టీ పెద్దలతో చెప్పారట. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఒంటరిగా ఎన్నికల్లో పోటీ చేయకుండా మహాకూటమిగా బరిలో దిగింది. బీజేపీ కూటమిగా పోటీ చేయడం వలన హైదరాబాద్‌లో బాగా ప్లస్ అవుతుందని నేతలంతా లెక్కలు వేసుకున్నారు. కానీ ఆ ఎన్నికల్లో హైదరాబాద్‌లో రాజాసింగ్ ఒక్కరు మాత్రమే గెలిచారు.. మిగతా నేతలంతా ఓటమి పాలయ్యారు. అటు జిల్లాల్లోనూ బీజేపీకి కనీసం డిపాజిట్ కూడా దక్కలేదు.. అప్పటివరకు కేసీఆర్ మీద కొంత వ్యతిరేకంగా ఉన్న తెలంగాణ సమాజం.. ఏపీ నుంచి చంద్రబాబు వచ్చేసరికి.. ఓటర్లంతా కేసీఆరే బెటరని ఆలోచనకు వచ్చారు. అందుకే గంపగుత్తగా మరోసారి కేసీఆర్‌కే పట్టం కట్టారని చెబుతారు.. ఆ ఎన్నికల్లో చంద్రబాబును ఓ అస్త్రంలా వాడుకున్నారు గులాబీ బాస్ కేసీఆర్. చంద్రబాబు మరోసారి తెలంగాణపై కుట్రలు చేస్తున్నారంటూ ఎన్నికల ప్రచారాన్ని హోరెత్తించారు. అయితే అప్పటివరకు బీజేపీపై కాస్తా సానుకూలంగా ఉన్న ఓటర్లు.. చంద్రబాబు రావడంతో.. కేసీఆర్ వైపు మొగ్గుచూపారు. దాంతో కేసీఆర్ రెండోసారి ముఖ్యమంత్రి పీఠంపై కూర్చున్నారు. అప్పట్లో అధికారం చేతుల్లోకి వస్తుందని భావించినా బీజేపీకి చంద్రబాబు రూపంలో గట్టి షాక్ తగిలిందనే చెప్పాలి.. ఈ అనుభవం నుంచి తెలంగాణ బీజేపీ నేతలు గుణపాఠం నేర్చుకున్నారు. ఆ తర్వాత తాము ఒంటరిగానే పోటీ చేస్తున్నట్టు ప్రకటించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లోనూ కమలం పార్టీ ఒంటిరిగా పోటీ చేసి ఎనిమిది చోట్ల ఘన విజయం సాధించింది. ఆ తర్వాత జరిగిన పార్లమెంటు ఎన్నికల్లోనూ ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు గ్రాండ్ విక్టరీ కొట్టారు. కానీ ఇప్పుడు మళ్లీ కూటమి అని పార్టీ పెద్దలు ప్రతిపాదన తేవడంతో నేతలంతా ఉలిక్కిపడ్డట్టు తెలుస్తోంది. ప్రస్తుతం బీజేపీకి ఉన్న ఎనిమిది మంది ఎమ్మెల్యేల్లో ఏడుగురు ఉత్తర తెలంగాణ వారే. కేవలం గ్రేటర్ హైదరాబాద్ నుంచి రాజాసింగ్ ఒక్కరు మాత్రమే ఎమ్మెల్యేగా గెలిచారు. మిగతా లీడర్లంతా ఓటమి పాలయ్యారు. గత ఎన్నికల్లో ఉత్తర తెలంగాణలో చూపించిన ప్రభావం దక్షిణ తెలంగాణలో కమలం పార్టీ చూపించలేకపోయింది. అయితే దక్షిణ తెలంగాణలో టీడీపీకి ఇంకా బలమైన కేడర్ ఉంది. అటు పవన్ కల్యాణ్‌కు బలమైన ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. గ్రేటర్ హైదరాబాద్‌లోనూ సెటిలర్ ఓట్లు లక్షల్లో ఉన్నాయి. ఇవన్నీ గంపగుత్తగా బీజేపీకి పడుతాయని పార్టీ పెద్దలు భావిస్తున్నారట. అందుకే ఎన్డీయే పార్టీల పోటీ అనే ప్రతిపాదన తెచ్చినట్టు తెలుస్తోంది. మొత్తంగా ఎన్నికలకు మరో మూడున్నరేళ్లు సమయం ఉందని.. అప్పటి పరిస్థితుల దృష్ట్యా నిర్ణయాలు తీసుకుందామని తెలంగాణ బీజేపీ నేతలతో చెప్పినట్టు తెలుస్తోంది. చూడాలి మరి.. వచ్చే ఎన్నికల్లో ఎన్డీయే పార్టీలు బరిలో దిగితే.. తెలంగాణ ఓటర్లు ఎలాంటి తీర్పునిస్తారో..!

## బయట ప్రశ్నిస్తే కేసులు.. అసెంబ్లీలో నిలదీస్తే సస్పెన్షన్లు : హరీష్ రావు

హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు తొమ్మిదో రోజు కొనసాగుతున్నాయి. ఇవాళ్టి సమావేశాల్లో రుణమాఫీపై బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతల మధ్య వాడివేడిగా చర్చ జరిగింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. దేవుళ్లపై ఒట్టేసి మరీ ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. అసెంబ్లీలో అడిగితే ప్రతిదాడులు చేస్తున్నారని హరీష్ రావు ఆరోపించారు. ప్రభుత్వాన్ని బయట ప్రశ్నిస్తే పోలీస్ కేసులు పెడుతున్నారని తెలిపారు. అసెంబ్లీలో ప్రశ్నిస్తే సస్పెండ్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రుణమాఫీపై దేవుళ్ల మీద ఒట్టేసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మోసం చేశారని మండిపడ్డారు. రైతులు ఎక్కడికక్కడ కాంగ్రెస్ నేతలను నిలదీయాలని పిలుపునిచ్చారు. రైతుబంధు ఇచ్చేందుకు డబ్బులు లేకపోతే.. HMDAలో రూ.20వేల కోట్లతో టెండర్లు ఎలా పిలుస్తున్నారని నిలదీశారు. రేవంత్ అత్తగారిల్లు, ఆయన భూములున్న ఆమన్‌గల్‌కు రూ.5వేల కోట్లతో రోడ్డు ఎలా వేస్తున్నారని హరీష్ రావు ప్రశ్నించారు.

## వర్షాకాల సమావేశాల్లో కొత్త ఇన్కమ్ టాక్స్ బిల్లు..



హైదరాబాద్: పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో కొత్త ఆదాయపు పన్ను బిల్లును చర్చకు తీసుకుంటామని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం తెలిపారు. ఆమె లోక్సభలో ఆర్థిక బిల్లు 2025పై చర్చలపై సమాధానమిస్తూ ఈ విషయాన్ని వెల్లడించారు. ఫిబ్రవరి 13న సభలో ప్రవేశపెట్టిన కొత్త ఇన్కమ్ టాక్స్ బిల్లు ప్రస్తుతం సెలెక్ట్ కమిటీ పరిశీలిస్తుందని ఆమె చెప్పారు. పార్లమెంట్ తదుపరి సమావేశాల మొదటిరోజు సెలక్ట్ కమిటీ తన నివేదిక సమర్పిస్తుందని నిర్మాలా సీతారామన్ అన్నారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు సాధారణంగా జూలైలో ప్రారంభమై ఆగస్టు వరకు కొనసాగుతాయి. 1961 ఆదాయపు పన్ను చట్టంలోని పలు అంశాలను సరళీకృతం చేసి కొత్త బిల్లును తీసుకువస్తున్నట్లు ఆదాయ పన్ను శాఖ ఇంతకుముందు తెలిపింది. కొత్త బిల్లులో పదాల సంఖ్య 2.6 లక్షలు. ఐటీ చట్టంలోని 5.12 లక్షల కన్నా తక్కువ. ప్రస్తుతం చట్టంలో 819 సెక్షన్లకు గానూ సెక్షన్ల సంఖ్య 536గా ఉంది. చాప్టర్ల సంఖ్యను 47 నుంచి 23కి తగ్గించారు. కొత్తగా తీసుకువస్తున్న ఇన్కమ్ టాక్స్ బిల్ -2025లో పాత బిల్లులోని 1200 నిబంధనలు, 900 వివరణలను తొలగించారు.

## ఏప్రిల్ 3న తెలంగాణ కొత్త మంత్రుల ప్రమాణం..?



ఎస్సీలో చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామికి... బీసీ సామాజిక వర్గంలో ఆది శ్రీనివాస్, శ్రీహరి ముదిరాజ్‌లకు చోటు దక్కే అవకాశం ఉందని సమాచారం. మొత్తం ఆరు ఖాళీల్లో నాలుగింటిని భర్తీ చేసే అవకాశం ఉంది. ఒకవేళ మరో స్థానం భర్తీ చేయాలనుకుంటే మైనారిటీ వర్గానికి చెందిన ఎమ్మెల్సీ అమీర్ అలీఖాన్‌కు చోటు దక్కే అవకాశం ఉంది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు పూర్తవుతుంది. దీంతో మంత్రివర్గ విస్తరణ గురించి కొంతకాలంగా ప్రచారం జరుగుతూనే ఉంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలిసారి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. దీంతో ఎప్పుడెప్పుడు మంత్రివర్గ విస్తరణ జరుగుతుందని ఆశావాహులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఆసక్తికరంగా ఎదురుచూస్తున్నారు.

### ఇద్దరు ఔట్..

అయితే, ప్రస్తుత మంత్రివర్గంలోని ఇద్దరు మంత్రులను తొలగించే అవకాశం ఉందని సోషల్ మీడియాలో ఊహాగానాలు సాగుతున్నాయి. మంత్రి కొండా సురేఖ , జూపల్లి కృష్ణారావును తప్పించే సూచనలు కనిపిస్తున్నాయి. వరుస వివాదాల్లో చిక్కుకున్న కొండా సురేఖ పదవి కోల్పోతారనే చర్చ పార్టీ వర్గాల్లోనూ జరుగుతోంది. కొత్త మంత్రివర్గ జాబితా మరో రెండు రోజుల్లో బయటపడే అవకాశం ఉంది. ఈ విస్తరణతో రేవంత్ రెడ్డి టీమ్‌లో కొత్త ఊపు వస్తుందని కాంగ్రెస్ శ్రేణులు ఆశిస్తున్నాయి.

# ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ బెట్టింగ్ చేయడం చట్టరీత్యా నేరం

## డక్కిలి సబ్ ఇన్స్పెక్టర్ శివశంకర్



వెంకటగిరి, నియోజకవర్గం ఇంచార్జ్ - విసి సుబ్బరాయుడు (శుభోదయం న్యూస్): ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ బెట్టింగ్స్ మానుకోవాలని, బెట్టింగ్స్ వేసి డబ్బులు నష్టపోయి జీవితాలను నాశనం చేసుకోవద్దని, తిరుపతి జిల్లా డక్కిలి మండలం సబ్ ఇన్స్పెక్టర్ శివశంకర్ తెలిపారు. క్రికెట్ మ్యాచ్ లు దేశంలో ఈనెల 22 న మొదలు అయ్యాయని, ఇవి సుమారు రెండు నెలల పాటు కొనసాగుతాయని, విషయములో చాలా మంది యువకులు మ్యాచ్ గెలుపు ఓటముల విషయములో పెద్దమొత్తములో బెట్టింగ్ చేసే అవకాశం ఉన్నదని. ఇలా చేయడం వలన కోలుకోలేని విధంగా ఆర్థిక నష్టం జరిగి చివరకు ఆత్మహత్య లు చేసుకునే ప్రమాదం ఉందన్నారు. ఈ మ్యాచులు ప్రారంభం అయ్యాయి కావున తల్లితండ్రులు మీ పిల్లల ప్రవర్తనలో ఏదైనా మార్పులు ఉన్నాయా గమనించి వారితో తరచూ మాట్లాడగలరన్నారు. లేదంటే డబ్బులు, ప్రాణాలు పోయే అవకాశం ఉన్నది. మీ కష్టార్జితాన్ని, కన్న బిడ్డలను బెట్టింగ్ విషయములో కోల్పోవద్దని. సులభమార్గంలో అధిక డబ్బులు సంపాధించాలనే అత్యాశతో యువత ఆన్లైన్ బెట్టింగ్స్ ఆన్లైన్ గేమ్స్ ఆడుతూ. సైబర్ మోసగాళ్ళ చేతిలో చిక్కి డబ్బులు కోల్పోతూ.. అప్పులు చేసి, చేసిన అప్పులను తీర్చలేక తనువును చాలిస్తున్నారని, కావున అందరూ వీటి భారీన పడకుండా అప్రమత్తముగా ఉండాలని ఎస్సై శివ శంకర్ అన్నారు. ఐ పి ఎల్ క్రికెట్ మ్యాచ్ బెట్టింగ్ చేయడం చట్టరీత్యా నేరం. ఎవరైనా ఐ పి ఎల్ క్రికెట్ మ్యాచ్ లకు బెట్టింగ్ కు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకొనబడతాయని, ఎవరైనా ఐపిఎల్ క్రికెట్ మ్యాచ్ లకు బెట్టింగ్ కు పాల్పడితే పోలీస్ వారికీ సమాచారం ఇవ్వగలరు మీ వివరములు గోప్యముగా ఉంచబడుతాయని తెలిపారు.

# అపర భగీదరుడు వర్గీకరణ సాధకుడు మంద కృష్ణ మాదిగ అన్నకు పాలాభిషేకం



శుభోదయం న్యూస్, బాపట్ల జిల్లా: చీరాల విఠల్ నగర్ గ్రామం నందు అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు మరియు వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ అన్న చిత్రపటానికి పాలాభిషేకం కార్యక్రమం జరిగింది. ముప్పై యేళ్ళ ఉద్యమంలో అంకితభావంతో ఆత్మగౌరవంతో అకుంఠిత దీక్షతో కృష్ణమాదిగన్న నడిపిన ఉద్యమం చరిత్రలో మైలురాయి వంటిదని మాదిగల చిరకాల వాంఛ వర్గీకరణే ధ్యేయంగా ఎటువంటి ప్రలోభాలకు తలొగ్గకుండా జాతికి సేవ చేసిన ఏకైక వ్యక్తి అపర భగీరధుడు వర్గీకరణ సాధకుడు అయిన అన్న చిత్ర పటానికి పాలాభిషేకం కార్యక్రమం నిర్వహించారు.అలాగే ఇచ్చిన మాట తప్పకుండా కూటమి ప్రభు త్వం అసెంబ్లో బిల్లు ప్రవేశ పెట్టి ఆమోదింప చేసినందులకు ప్రధాని, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి లకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో %మీ్రా% జిల్లా అధ్యక్షులు, బి లక్ష్మీనరసయ్య మాదిగ %వీ్రూా%. జిల్లా అధ్యక్షులు డి వందనం మాదిగ జిల్లా అధ్యక్షులు వి. రమేష్ మాదిగ పట్టణ అధ్యక్షుడు యేసురాజా మాదిగ పాల్గొనగా గ్రామ పెద్దలు తొలితరం ఉద్యమ నాయకులు మాజీ కౌన్సిలర్ గూడూరి జేమ్స్ మాదిగ, వెంకట్ మాదిగ, పండ్లూరి జీవరత్నం మాదిగ, మోషే మాదిగ సాల్మన్ మాదిగ డి సురేష్ మాదిగ మాల్యాద్రమాదిగ చేతుల మీదుగా పాలాభిషేకం జరిపించారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# హెూం మంత్రికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన తిరువీధుల శంకర్ ప్రసాద్



శుభోదయం న్యూస్, బాపట్ల జిల్లా: పుట్టినరోజు జరుపుకొంటున్న మా లీడర్, దళిత ముద్దు బిడ్డ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హెూమ్ శాఖ మాత్యులు వంగలపుడి అనితకి జన్మదిన శుభాకాంక్షలు, మీ అభిమానులు, గుంటూరు సరిత, తిరువీధుల శంకర ప్రసాద్.

# హెూం మంత్రికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన బాపట్ల మహిళలు



శుభోదయం న్యూస్, బాపట్ల జిల్లా: మహిళల్లో ఆణిముత్యం డైనమిక్ లీడర్ దళిత ముద్దుబిడ్డ రాష్ట్ర హెూమ్ మినిస్టర్ పార్టీ కోసం అహర్నిశలు కష్టపడిన వీర వనిత వంగలపూడి అనిత కి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్న బాపట్ల పార్లమెంట్ మరియు నియోజకవర్గ మహిళా కమిటీ సభ్యులు,

# నంద్యాలలో ఘనంగా జరిగిన గ్రామీణ వైద్యుల జిల్లా మహాసభ

### ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ



నంద్యాల రిపోర్టర్/ మోహన్ (శుభోదయం న్యూస్ ): స్థానిక నంద్యాలలోని వివేకానంద ఆడిటోరియంలో గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రొక్కం నాగేశ్వర్ రెడ్డి అధ్యక్షతన జిల్లా మహాసభ ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ, గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు తెలకపల్లి రాధాకృష్ణయ్య, రాష్ట్ర ప్రచార కార్యదర్శి దస్తగిరి పర్ల, కర్నూలు జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు,రఘునాథ్,నాగరాజు, నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్ బాబు, కోశాధికారి నాగ సురేంద్ర, రాష్ట్ర నాయకులు నాగేశ్వరావు ,యాకుబ్, పట్టణ కన్వీనర్ శ్రీనివాసులు తదితరులు ముఖ్య అతిథులుగా హాజరై సంఘం పొందుపరిచిన నియమ నిబంధనల కరపత్రాలను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ మాట్లాడుతూ మిమ్మల్ని నమ్మి వచ్చిన ప్రజలకు సరియైన చవకైన ప్రాథమిక వైద్యం మాత్రమే పరిధి మేరకు అందించాలని అనునిత్యం ప్రజా శ్రేయస్సు ధ్యేయంగా మీ సేవలు ఉండాలని సూచించారు.రాష్ట్ర అధ్యక్షుడు రాధాకృష్ణయ్య జిల్లా అధ్యక్షుడు నాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో సంఘ నియమ నిబంధనలకు లోబడి ప్రాథమిక వైద్యం అందజేస్తూ సంఘ సభ్యత్వం తీసుకున్న వారికి మాత్రమే సంఘం నుంచి సహకారం అందిస్తామని అలాగే ప్రతి సభ్యుడు ప్రతినెల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసే విజ్ఞాన తరగతులకు హాజరై గ్రామీణ ప్రజలకు చేయదగిన చేయకూడని వైద్య విజ్ఞానంపై శిక్షణ పొందాలని తెలిపారు. పల్లెల్లో పట్టణ మురికివాడల్లో నిబంధనలకు లోబడి ప్రాథమిక వైద్యం అందజేస్తున్న గ్రామీణ వైద్యులే కాకుండా నిబంధనలకు విరుద్ధంగా వైద్యం అందిస్తున్న ల్యాబ్ టెక్నీషియన్లు మెడికల్ షాపులలో పనిచేసేవారు ఆసుపత్రులలో పనిచేసేవారు నాటు మందుల వారు లాడ్జిలలో మందులు ఇచ్చేవారు మొలలు చికిత్స చేసేవారు కనీస విద్యార్హత లేని వారు ఏ సంఘంలో సభ్యులుగా లేనివారు ప్రభుత్వ శిక్షణకు ఎంపిక కాని వారు ఎలాంటి అర్హత లేని వారు ఎంతోమంది మా పరిధికు రాకుండా తప్పుడు వైద్యం చేస్తున్న వారందరినీ ఆర్ఎంపీలు గా మీడియా సమాజము ప్రచారం చేయడము చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా సంఘంలో సభ్యులుగా చేరే గ్రామీణ వైద్యులు పాటించవలసిన నియమ నిబంధనలకు సంబంధించిన కరపత్రాలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి చేతుల మీదుగా ఆవిష్కరించి అందరికీ పంపిణీ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో మహానంది అమర్, గడివేముల కృష్ణయ్య, బనగానపల్లె సైపుల్ల, పేరు సోముల మూర్తి, డోన్ వెంకటేశ్వర్లు, బాలసుబ్బయ్య నందికొట్కూరు నాగరాజు, బండి ఆత్మకూరు షరీఫ్, శ్రీనివాసులు వెలుగోడు నాగశేషులు, ఆళ్లగడ్డ వెంకటేశ్వర్లు, ఆత్మకూరు చింతలయ్య, నాగేష్ చాగలమర్రి మాలిక్, ఎర్రగుంట్ల మద్దిలేటి తదితరులతోపాటు సుమారు జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి 400కు పైగా గ్రామీణ వైద్యులు హాజరయ్యారు.

# ప్రకృతి వ్యవసాయంపై మొగ్గు చూపండి: వ్యవసాయ అధికారి స్వప్నికా రెడ్డి



నంద్యాల రిపోర్టర్/ మోహన్ (శుభోదయం న్యూస్ ): రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపి అనారోగ్యాన్ని దూరం చేసుకోవాలని వ్యవసాయ అధికారి స్వప్నికా రెడ్డి సూచించారు. మండలంలోని దీబగుంట్ల గ్రామంలో నిర్వహిస్తున్న పొలం పిలుస్తుంది కార్యక్రమంలో రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ రసాయనిక ఎరువుల వినియోగం రోజురోజుకు అధికమవుతుందన్నారు .ఎరువుల వినియోగాన్ని తగ్గించే దిశగా రైతులు వివిధ కార్యక్రమాల్లో పాల్గొని వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలన్నారు. రసాయనిక ఎరువులు వినియోగం తగ్గించి సేంద్రియ ఎరువులను వాడాలని సూచించారు. నేల ఆరోగ్యం, ప్రజారోగ్యం కాపాడుకునేందుకు ప్రకృతి వ్యవసాయం దోహదపడుతుందన్నారు. సొంత భూమి కలిగిన ప్రతి రైతు విశిష్ట గుర్తింపు నంబర్ కొరకు రైతు సేవ కేంద్రాలకు వెళ్లి నమోదు చేసుకోవాలని పొలం పిలుస్తుంది కార్యక్రమంలో సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

# అయ్యాలూరు మరియు పెద్ద కొట్టల గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం



నంద్యాల రిపోర్టర్/ మోహన్ (శుభోదయం న్యూస్): పొలం పిలుస్తోంది భాగంగా సహాయ వ్యవసాయ సంచాలకులు రాజశేఖర్ మాట్లాడుతూ నీటి వసతి గల రైతులు అందరూ వేసవిలో పెసర, మినుము, కొర్ర పంటలు వేసుకొని నేల పై నిరంతరం పచ్చగా ఉండేట్లు చేయడం ద్వారా నేలలో గల నేలలోని బ్యాక్టీరియా,శిలీంధ్రాలు వాటి ప్రక్రియ నిరంతరం జరిపి నేలను సారవంతంగా ఉండేట్లు చేస్తుందని తెలిపారు.అదేవిధంగా రైతుకు ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు ప్రక్రియ ఇప్పటివరకు నంద్యాల మండలం లో 43% అయ్యిందని ఇంకా మిగిలిన రైతులు త్వరగా చేయించుకోవాలని కోరారు., వారికి ప్రభుత్వం నుండి వచ్చు వివిధ సబ్సిడీలు, పంటల బీమా వంటి ప్రయోజనాలు పొందేలా చేస్తుంది అని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు నంద్యాల, రెగ్యులర్ శ్రీ బి.రాజ శేఖర్, మండల వ్యవసాయ అధికారి నంద్యాల ఈర్ల ప్రసాదరావు,జిల్లా వనరుల కేంద్రం బ్లాక్ టెక్నాలజీ మేనేజర్ ఉమామహేశ్వరమ్మ, వ్యవసాయ విస్తరణ అధికారి ముక్తారు భాష రైతు సేవ కేంద్ర సిబ్బంధి అనిల్ కుమార్ రెడ్డి, షర్మిల మరియు మాధురి రైతులు పాల్గొన్నారు.

# ఎస్ఐని కలిసిన వేముల గోపాల్ రావు



లింగసముద్రం కే సురేష్ (శుభోదయం న్యూస్ ):లింగసముద్రం ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన ఎం నారాయణను మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వేముల గోపాలరావు మంగళవారం పోలీస్ స్టేషన్ లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్సై ను శాలువాతో సత్కరించి,పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.ఎస్సైను తెలుగుదేశం నాయకులు కండే మాలకొండయ్య,బోడి సురేష్, షేక్ పరేష్, సురేష్ తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఈనెల 28న జరిగే సీపీఐ నియోజకవర్గ కౌన్సిల్ సమావేశాన్ని విజయవంతం చేయాలి



యర్రగొండపాలెం, నియోజకవర్గ ఇంచార్జి కాకర్ల కోటయ్య (శుభోదయం న్యూస్) : ఈనెల 28వ తేదీన జరిగే యర్రగొండపాలెం నియోజకవర్గ కౌన్సిల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి దేవండ్ల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను గ్రామ గ్రామాన విస్తృతంగా ప్రచారం చేయాలని, మార్చి 23 నుండి ఏప్రిల్ 14 వరకు ఈ ప్రచార ఆందోళన కార్యక్రమం నిర్వహించాలని జాతీయ సమితి పిలుపునిచ్చిందని తెలిపారు. గత ప్రభుత్వం జగనన్న కాలనీలో ఈ రాష్ట్రంలో 34 లక్షల మందికి ఇళ్ల స్థలాలు ఇవ్వటం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీల్లో భాగంగా నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని గత కొన్ని సంవత్సరాల నుంచి కమ్యూనిస్టు పార్టీ, ప్రజా సంఘాలు ఆందోళన చేసినటువంటి ఫలితంగా గ్రామీణ ప్రాంతంలో 3 సెంట్లు, పట్టణ ప్రాంతంలో 2 సెంట్లు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాంతంలో ఉన్నటువంటి పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు, పశ్చిమ ప్రాంతంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని, మార్కాపురం ను జిల్లా చేయాలని, ఈ ప్రాంతంలో ఉన్న మౌలిక సమస్యలను పరిష్కరించాలని ఈనెల 28వ తేదీన జరిగే నియోజకవర్గ కౌన్సిల్ సమావేశంలో చర్చించి పోరాట రూపం నిర్ణయించుకుంటామని తెలిపారు. ఈ సమావేశానికి నియోజకవర్గంలోని పార్టీ మండల కార్యదర్శులు, నాయకులు, కార్యకర్తలు, సభ్యులు, సానుభూతిపరులు హాజరుకావాలని తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ సీనియర్ నాయకులు టిసిహెచ్ చెన్నయ్య, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కే వి కృష్ణ గౌడ్, త్రిపురాంతకం మండల కార్యదర్శి బాణాల రామయ్య, రైతు సంఘం నాయకులు సాంబశివరావు, వై వెంకట శివయ్య తదితరులు పాల్గొన్నారు.

# పొలం పిలుస్తుంది కార్యక్రమం



దోర్నాల మండల రిపోర్టర్- ఆవులయ్య (శుభోదయం న్యూస్): ప్రకాశం జిల్లా పెద్దదోర్నాల మండలం ఈ రోజు అనగా తేది :25.03.2025 న దోర్నాల మండలం లోని నల్లగుంట్ల, నల్లగుంట్ల గూడెం గ్రామాలలో వ్యవసాయ శాఖ వారు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమం లో మండల వ్యవసాయ అధికారి డి. జవహర్ లాల్ నాయక్ పాల్గొని రైతులు సాగు చేసిన జొన్న, టమాటో మరియు కోత కోసిన జొన్న పంటలను సందర్శించడం జరిగింది.ఈ కార్యక్రమం లో వ్యవసాయ అధికారి మాట్లాడుతూ జొన్న, కంది, మినుము, శనగ పంటలను ప్రభుత్వ మద్దతు ధరలకు మార్కుఫెడ్ ద్వారా కొనుగోలు చేసున్నట్లు తెలిపారు.



పంటలను అమ్మధలచిన రైతులు లో రైతు సేవకేంద్ర నందు నమోదు చేసుకొని కొనుగోలు కేంద్రం నందు అమ్ముకోవచ్చని తెలియజేయడం జరిగింది.అలాగే రైతు విశిష్ట నమోదు కూడా ప్రతి రైతు నమోదు చేసుకుంటేనే ప్రభుత్వ పథకలైన అన్నదాత సుఖీభవ, వ్యవసాయ యంత్రికరణ, ఇన్పుటసబ్సిడీ, సున్నా వడ్డీ పంటరుణాలు, పంటల భీమా పథకలు వర్తిస్తాయని రైతులకు తెలియజేసారు.ఈ కార్యక్రమం లో సిబ్బంది,సిబ్బంది బాలరాజు, మరియు నల్లగుంట్ల గ్రామ రైతులు పాల్గొన్నారు.

# నాటు సారా నిర్మూలన పై ప్రత్యేక అవగాహన సదస్సు



దోర్నాల మండల రిపోర్టర్- ఆవులయ్య (శుభోదయం న్యూస్ ): ప్రకాశం జిల్లా దోర్నాల మండలంలో ని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో నాటు సారా నిర్మూలన పై అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం జరిగినది ఈ కార్యక్రమం అసిస్టెంట్ కమిషనర్ విజయ ఆధ్వర్యంలో మంగళవారం జరిగింది. నవోదయం 2.0 లో భాగంగా దోర్నాల మండలంలోని వ్యాపారులతో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దాసరి బాలయ్య( ఏ ఈ ఎస్ మార్కాపురం) జనార్ధన రావు( ఏ ఈ ఎస్ ఒంగోలు) వెంకట్ రెడ్డి( సర్కిల్ ఇన్స్పెక్టర్) శ్రీకాంత్( ఎస్ ఐ) ఎస్ బి సిబ్బంది పాల్గొని మాట్లాడుతూ నాటు సారా కాసిన అమ్మిన వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో దోర్నాల మండలం వ్యాపారస్తులు ఎక్సైజ్ శాఖ సిబ్బంది ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# తాసిల్దార్ కార్యాలయంలోనవోదయం 2.0 పై మండలస్థాయిసమీక్ష సమావేశం



(శుభోదయం న్యూస్) బిట్రగుంట: సంపూర్ణసారారహితరాష్ట్రం ఏర్పాటుకుప్రభుత్వంఅమలు చేస్తున్ననవోదయం 2.0 కార్యక్రమంఅమలుపైబోగోలు మండలతాసిల్దార్ కార్యాలయంలోమంగళవారం మండలస్థాయిఅధికారులతో సమీక్షసమావేశంనిర్వహించడం జరిగింది.నవోదయంమండల కమిటీకన్వీనర్,ఎక్సైజ్ సి ఐ శ్రీనివాసులుఆధ్వర్యంలో నిర్వహించినఈకార్యక్రమంలో కమిటీచైర్మన్,తాసిల్దార్,మలిశెట్టి సురేష్ బాబుతోకలిసికార్యక్రమం అమలకుతీసుకోవలసినచర్యలపై కమిటీసభ్యులకుపలుసూచనలు చేశారు.గ్రామాలలోసంపూర్ణసారా నిషేధం,అక్రమతయారీకిదారులపైకఠినచర్యలు,సమాచారసేకరణకు గ్రామపెద్దలసహకారంవంటిపలు విషయాలపైచర్చించారు.పై కార్యక్రమంలోయంపిడిఓ సుబ్రమణ్యం, బిట్రగుంటఎస్సై భోజ్యానాయక్,అటవీశాఖ అధికారిసుమన్, డిఆర్డిఎ ఎ.పి యంనవీన్, మరియుఎక్సైజ్ సిబ్బందితదితరులుపాల్గొన్నారు.

# పాఠశాల ఉపాధ్యాయులు భాధ్యతగా ఉండాలి

### .మండల విద్యాశాఖ అధికారుల,

### ప్రధానోపాధ్యాయుకు అవగాహన కల్పించిన సిఐ హాజరత్యయ్య



సింగరాయకొండ, మండల రిపోర్టర్ - పసుమర్తి జాలయ్య (శుభోదయం న్యూస్): పాఠశాలల్లో నిత్యం చోటు చేసుకుంటున్న నేరాలు,పిల్లల పై చోటుచేసుకుంటున్న లైంగిక వేధింపుల పై ప్రతి ఉపాధ్యాయుడు అవగాహన కలిగి ఉండాలని పాఠశాలల్లో అప్రమత్తంగా ఉండాలని సింగరాయకొండ సిఐ చావా హాజరత్యయ్య స్పష్టం చేశారు. మంగళ వారం సింగరాయకొండ సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయం లో స్థానిక మండల విద్యాశాఖ అధికారులు, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపా ధ్యాయులతో ఆయన సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా సిఐ హాజరత్యయ్య మాట్లాడుతూ నిత్యం పాఠశాల పరిధిలో పిల్లల పై లైంగిక వేదింపులు చోటు చేసుకుంటు న్నాయని వాటిని నివారించడం లో పాఠశాల స్థాయిలో నిత్యం ఉపాధ్యాయులు శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పాఠ శాలలో ఏదైనా లైంగిక వేదింపుల సంఘటన చోటు చేసుకున్న, సమాచారం ఉన్నా వెంటనే సమీపం లోని పోలీస్ స్టేషన్ కి, లేదా క్రైమ్ స్టాపర్, పోలీస్ కంట్రోల్ రూం కి భాధ్యతగా సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. నిత్యం పాఠశాల పరిధిలో ఉపాధ్యా యులు, మండల విద్యాశాఖ అధికారులు అవగాహన కలిగి ఉండాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా పాల్గొన్న మండల విద్యాశాఖ అధికారులు మండలం లోని ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థల యాజమాన్యాలు, పర్యవేక్షకులు, ఉపాధ్యాయులతో సమన్వయం చేసుకుంటూ లైంగిక వేదింపులు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

# యువత బెట్టింగ్ ఊబిలో పడొద్దు వెలిగండ్ల ఏ ఎస్ ఐ జిలాని బాషా



కనిగిరి రిపోర్టర్ జి. ప్రసాదు శుభోదయం న్యూస్ : సాంకేతిక పరిజ్ఞాన్ని ఉపయోగించి యువత బెట్టింగ్ ఊబిలో పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని ఏ ఎస్ఐ షేక్ జిలాని బాషా అన్నారు. మంగళవారం ప్రకాశం జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్, పామూరు సిఐ భీమానాయక్ ఆదేశాల మేరకు వెలిగండ్ల లో కొంత మంది యువకులను బెట్టింగ్ అనేది యువత భవిష్యత్ ను ఏ విధంగా ప్రభావితం చేస్తుంది దాని వలన కలిగే అనర్థాలు, ఆర్థికపరమైన సమస్యల గురించి విద్యార్థులకు, యువకులకు అవగాహన కల్పించారు.రోజుకొక రకమైన బెట్టింగ్ యాప్ లు అందుబాటులో కీ వస్తున్నాయన్నారు. వీటి బారిన పడిన యువకులు బయటికి రావడం కష్టమన్నారు. ఈ బెట్టింగ్ అలవాటు పడ్డవారు అప్పుల పాలు కావడమే కాకుండా, చేసిన అప్పులు తీర్చలేక ఆత్మహత్యలకు పాల్పడే అవకాశం ఉందన్నారు. క్రికెట్ బెట్టింగ్ లకు పాల్పాడ్వేరిపై చట్టపరమైనకఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొత్తగా ఎవరైనా బెట్టింగ్ లకు పాల్పదే అవకాశం ఉన్న వారిపై నిఘా ఉంచామని ఈ సందర్భంగా తెలిపారు.ఈ కార్యక్రమం లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# వేద పండితులకు పంచాంగం బహుకరించిన జనగామ తిరుపతి



గోదావరిఖని టౌన్ రిపోర్టర్- సురేష్,(శుభోదయం న్యూస్) రానున్న తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళవారం ఎన్ టి పి సి హరి హర దేవాలయం,హనుమాన్ దేవాలయం లోని వేద పండితులకు అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ సభ్యుడు జనగామ తిరుపతి శ్రీ ముక్తేశ్వర సిద్ధాంతి వారు వ్రాసిన నూతన పంచాంగాన్ని బహుకరించారు. ప్రజలందరూ ఈనూతన సంవత్సరంలో క్షేమంగా సుభిక్షంగా ఉండాలని ప్రత్యేక పూజలు చేసి ఆశీర్వచనాలు ఇచ్చారు. అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ రాష్ట్ర సభ్యుడు జనగామ తిరుపతి ఆధ్వర్యంలో బ్రహ్మశ్రీ రాంపల్లి వామన శర్మ గారి తో పాటు వేంకటేశ్వర ఆలయ అర్చకులు శ్రీ వాణమామలై రామాచార్యులు దుర్గామాత ఆలయ అర్చకులు శ్రీ పాపిట్ల రాజ నరేంద్ర శర్మ, శ్రీ ఆంజనేయ స్వామి వారి దేవాలయ అర్చకులు శ్రీ రుద్రబట్ల శ్రీకాంత్ శర్మ, సురేష్ శర్మ గారితో పాటు వివిధ దేవాలయల అర్చకులకి నూతన పంచాంగాలను దానం.



ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కొలాని వెంకట్ రెడ్డి, ఎన్ టి పి సి విశ్రాంత ఉద్యోగి సుదర్శన్ బాబు, శ్రీ అయ్యప్ప దేవాలయం సభ్యుడు పి సంపత్ రావు, తోట చిన్నయ్య, శ్రీధర్ తో పాటు భక్తులు, సేవకులు పాల్గొన్నారు.

# గద్దర్ గళం అవార్డ్స్ లకు దరఖాస్తులకు ఆహ్వానం

### వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ(వి.ఎస్.ఎస్. ఎస్) వారి ఆధ్వర్యంలో



రామగుండం మండలం రిపోర్టర్ - తిరుపతి, (శుభోదయం న్యూస్ )విశ్వవసు నామ సం? ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ఉభ య తెలుగు రాష్ట్రాల లోని కవులకు, రచయితలకు, గాయకులకు, కళాకారులకు గద్దర్ గళం అవార్డ్స్ తో పాటు,పలు రంగాలలో సేవలందిస్తున్న స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులకు, పండితులకు, సంగీత, సాహిత్య, నృత్య, చిత్రలేఖన, శిల్ప, జానపద, మిమిక్రీ, ఇంద్రజాల, హరికథ, బుర్రకథ, ఒగ్గుకథ, కోలాటం విద్య, వైద్య రంగాలలో సేవలందిస్తున్న వారికి. జాతీయస్థాయి మానవత వెలుగు అవార్డ్స్ - 2025 .ఉగాది పురస్కారాల ప్రధానోత్సవం కార్యక్రమం నిర్వహించడం జరిగిందని. వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ ఫౌండర్ అండ్ చైర్మన్, లయన్ డాక్టర్, సురభి శ్రీధర్ తెలిపారు. ఈ పురస్కారాలకు దరఖాస్తులు చేసుకునేవారు ఏప్రిల్ 15 లోపు దరఖాస్తు చేసుకోవాలని. మరిన్ని వివరాలకు8977748838 నెంబర్ ను సంప్రదించగలరని సురభి శ్రీధర్ తెలిపారు.

# శక్తి యాప్ తో మహిళలకు మరింత భద్రత

## స్వయంకృషి సేవా సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు అవగాహన కల్పించడం అభినందనీయం : సీఐ ఖాజావలి



కనిగిరి రిపోర్టర్ జి.ప్రసాద్ రావు (శుభోదయం న్యూస్): మహిళలు ఆపద సమయాలలో రక్షణ కల్పించడానికి శక్తి యాప్ ఎంతగానో ఉపయోగపడుతుందని కనిగిరి సర్కిల్ ఇన్స్పెక్టర్ షేక్ ఖాజావలి అన్నారు . మంగళవారం పట్టణంలోని ఎం ఎస్ ఎం కళాశాలలో స్వయంకృషి సేవా సంస్థ అధ్యక్షులు డాక్టర్ షేక్ నాయబ్ రసూల్ ఆధ్వర్యంలో శక్తి యాప్ పై మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సిఐ కాజావలి మాట్లాడుతూ శక్తి యాప్ మహిళలు బాలికలు తమ ఫోన్లలో డౌన్లోడ్ చేసుకొని మహిళలు సైతం చైతన్యం కావాలని సూచించారు. సమాజంలో మహిళలపై అఘాయిత్యాలు, అత్యాచారాలు దాడుల నుంచి తమను తాను కాపాడుకునేందుకు ప్రభుత్వం తెచ్చిన శక్తి యాప్ మహిళలకు రక్షణ కవచం వంటిదని అన్నారు.



ఆపదలో ఉన్న మహిళలను రక్షించే క్రమంలో శక్తి యాప్ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా స్మార్ట్ ఫోన్ వినియోగిస్తున్న ప్రతి మహిళలకు శక్తి యాప్ పై అవగాహన కల్పించిచాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమ చేపట్టడం జరిగిందని పేర్కొన్నారు. ఫోన్లో నిక్షిప్తం చేయించి ఆపదలో ఉన్న సమయంలో ఉపయోగించే విధంగా పోలీస్ శాఖ ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందని తెలిపారు. ఎస్ ఓ ఎస్ బటన్ నొక్కడం ఫోన్లు గట్టిగా అటు ఇటు కదపడం ద్వారా ఆపదలో ఉన్న మహిళ యొక్క లొకేషన్ సంబంధిత శక్తి కాల్ సెంటర్ కు చేరవేయబడి తదుపరి సంబంధిత పోలీస్ స్టేషన్ ద్వారా తక్షణ సహాయం అందించబడుతుందని అన్నారు. శక్తి యాప్ నేడు మహిళల చేతిలో వజ్రాయుధం అనీ చాటి చెప్పాలన్నారు . శక్తి యాప్ తో పాటు మహిళా స్వీయ రక్షణ కూడా కలిగి ఉండాలన్నారు. బాలికలు యువతులు బయటకు వెళ్లే సమయాలలో చాలా అప్రమత్తంగా ఉండాలన్నారు. మహిళల రక్షణకు సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యతిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ సరోజిని, అంగన్వాడీ సూపర్వైజర్లు షేక్ జరీనా, ఎం వి ఎస్ పార్వతి,జి ఎన్ మల్లీశ్వరి, ఎ ధనలక్ష్మి

# కనిగిరి మండల కార్యకర్తల సమావేశాన్ని జయప్రదం చేయండి -మడతల కస్తూరి రెడ్డి.



కనిగిరి రిపోర్టర్ జి.ప్రసాదరావు (శుభోదయం న్యూస్): కనిగిరి మండలంలోని వైయస్సార్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు 26-03-25బుధవారం ఉదయం 10 గంటలకు కనిగిరి వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరుగు సమీక్ష సమావేశ కార్యక్రమానికి హాజరు కావాలని కనిగిరి మండల అధ్యక్షులు, మరియు కనిగిరి జడ్పిటిసి సభ్యులు మడతల కస్తూరి రెడ్డి పిలుపునిచ్చారు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రకాశం జిల్లా అధ్యక్షులు బూచేపల్లి శివ ప్రసాద్ రెడ్డి గారు కనిగిరి నియోజకవర్గ ఇన్చార్జి దద్దాల నారాయణ యాదవ్ గారి ఆదేశాల మేరకు కనిగిరి మండల పార్టీ అధ్యక్షుడు మడతల కస్తూరి రెడ్డి అధ్యక్షతన జరుగుతున్న సమావేశానికి కనిగిరి మండలం సీనియర్ నాయకులు వివిధ కమిటీల అధ్యక్షులు అనుబంధ విభాగాల అధ్యక్షులు 25 పంచాయితీల సర్పంచులు ఎంపీటీసీలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు జగనన్న అభిమానులు అందరూ పాల్గొని , కార్యకర్తల సమీక్ష సమావేశం జయప్రదం చేయవలసిందిగా కోరారు.

# అన్నా క్యాంటీన్ కావాలి ముళ్ళ పూడి నాగేశ్వర రావు



(శుభోదయం న్యూస్) విజయవాడ.విజయవాడ పరిసర ప్రాంతాలలో ప్రజలు ఎక్కువగా రద్దీగా ఉండే ప్రాంతాలు బస్టాండ్ మరియు రైల్వే స్టేషన్ ప్రజలు నిత్యం లక్షలలో విజయవాడ కు ప్రజలు వస్తువుంటారు హొటల్లో రోడ్డు పక్కన ఉన్న ఫుడ్ సెంటరు లలో నిల్వ ఉంచిన శుభ్రత లేని అనారోగ్యానికి గురవుతున్నారు పేద నిరుపేద మంచి జరిగితే ప్రజలు ఇలాంటి ఆహారాన్ని తీసుకుని తీవ్ర అనారోగ్యానికి గురవుతున్న మాట వాస్తవం తాగునీరు శుభ్రత లేని ఆహారం తీసుకోవడం వల్ల ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాలలో అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేయాలని అన్నా క్యాంటీన్ వలన పేద ప్రజలకు నాణ్యమైన ఆహారం అది తక్కువ ధరకి ఇస్తున్నారని అన్నా క్యాంటీన్ లో దొరికే ఆహార పదార్థాలు రుచి శుభ్రత నాణ్యత కలిగి ఉంటాయని ప్రజలు తమకు అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయవలసిందిగా విన్నవించు చున్నారు ఉన్నత అధికారులు దృష్టి సారించి ఎక్కువగా రద్దీగా వున్న ప్రాంతాలలో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయాలని కోరుచున్నాను. శాసనసభ్యులు మంత్రులు ఈ విషయాన్ని పరిశీలించి త్వరితగతిన అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయాలని కోరుచున్నాము నాణ్యతలేని ఆహారం అధిక ధరకు కొందరు హొటల్ లో విక్రయించు చున్నారని ప్రజలు వాపోతున్నారు కూటమి ప్రభుత్వం ఏర్పడడానికి ముఖ్య కారణాలలో ఒకటి అన్న క్యాంటీన్ నిరుపేదల పాలిట వరం గత ప్రభుత్వం చేసిన తప్పిదం అన్న క్యాంటీన్ తొలగించుట పేద ప్రజల దేవాలయం అన్న కాంటీన్ ప్రభుత్వం ఈ విషయాన్ని గుర్తించి ఎక్కువగా ప్రజలు రద్దీగా ఉన్న ప్రాంతాలలో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులో ఉండేలాగా ప్రయత్నించాలని ప్రజలు కోరుచున్నాను అధికారులు శాసనసభ్యులు మంత్రులు సహకరించాలని కోరుచున్నారు అన్న క్యాంటీన్ ద్వారా పేద ప్రజల ఆకలి తీరుతుందని ఆకలి చావులు ఉండవని ప్రజలకు అన్నా క్యాంటీన్ ఏర్పాటు ద్వారా పేద ప్రజలకు నాణ్యమైన ఆహారం అందుతుంది అని ప్రజా నాయకుల సామాజిక కార్య కర్త కూటమి గెలుపు ముందు గా తెలిపిన రాజకీయ విశ్లేషకులు రాధ రంగా నాయకులు ముళ్ళ పూడి నాగేశ్వర రావు ప్రభుత్వాన్ని అధికారులను మంత్రులను విన్నవించుచున్నారు

# పోషణాభి పడి యాబి శిక్షణ తరగతులు



దోర్నాల మండల రిపోర్టర్- ఆవులయ్య ( శుభోదయం న్యూస్ ): ప్రకాశం జిల్లా పెద్ద దోర్నాల మండలం పోషణాభి పడియాబీ మూడు రోజులపాటు శిక్షణ తరగతులు. సిడిపిఓ కమల కుమారి. పెద్ద దోర్నాల. అంగన్వాడి కేంద్రాలలో చిన్నారులకు పోషణాభి, వడియాబీ శిక్షణ తరగతులను సిడిపిఓ కమల కుమారి ఆధ్వర్యంలో మూడు రోజులపాటు, అంగన్వాడి కార్యకర్తలకు ఆయాలకు, శిక్షణా తరగతులు నిర్వహించడం జరుగుతుంది! మండలంలోని రామచంద్ర కోట గ్రామంలో మంగళవారం రెండో రోజు శిక్షణా కార్యక్రమంలో భాగంగా, పిల్లలకు . ప్రీస్కూల్ కార్యక్రమాలను ఎలా నిర్వహించాలో అనే వాటిపై సిడిపిఓ కమల కుమారి కార్యకర్తలకు వివరించారు. పోషణ్ భీ పదాయ్ భీ కార్యకమములో డాక్టర్ సంజయ్ మాట్లాడుతూ గర్భవతులుగా ఉన్నపుడు వికలాంగులుగా పిల్లలు పుట్ట కుండ తీసుకోవలసిన జాగ్రతాలు, వికలాంగ పిల్లలను ఎలా గుర్తించాలి, పౌష్టిక ఆహారము గురించి తెలిపా రు. మరియు హెడ్ మాస్టర్ మహంతి నాయక్ తగిన సూచనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# వైయస్ జగన్ ని మర్యాద పూర్వకంగా కలిసిన ఇంచార్జి దద్దాల, నియోజవర్గ నాయకులు



కనిగిరి రిపోర్టర్ జి. ప్రసాదరావు (శుభోదయం న్యూస్): పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి గారిని తాడేపల్లి వైయస్ఆర్ సీపీ క్యాంపు కార్యాలయంలో మంగళవారం కనిగిరి వైసీపీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ మర్యాద పూర్వకంగా కలిసి నియోజకవర్గం లో పార్టీ పరిస్థితులు, బలోపేతం మరియు నాయకులు, కార్యకర్తలకు అండగా నిలబడుతున్న పలు విషయాలపై చర్చించారు ..ఈ సందర్భంగా ఇటీవల కూటమి ప్రభుత్వం అకారణంగా, అన్యాయంగా హనుమంతునిపాడు మండలం లింగంగుంట్ల పంచాయతీ వైసీపీ సర్పంచ్ మద్ది నాగరత్నాలు చెక్ పవర్ రద్దు చేసిన విషయం పార్టీ అధ్యక్షులు



జగన్ గారి దృష్టికి కనిగిరి వైసీపీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ గారు తీసుకోనివెళ్లారు.. అనంతరం జగన్ మోహన్ రెడ్డి గారు మాట్లాడుతూ మీకు పార్టీ మరియు మీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ అన్ని విధాలుగా అండగా ఉంటారని మన ప్రభుత్వం రాగానే తప్పకుండా న్యాయం చేస్తామని భరోసా ఇచ్చినట్లు తెలిపారు..ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షులు బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, పార్లమెంట్ ఇంచార్జి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, హనుమంతునిపాడు ఎంపీపీ గాయం సావిత్రి, మాజీ ఎంపీపీలు గాయం బలరారెడ్డి, గాయం ఈశ్వరమ్మ, మండల అధ్యక్షులు యక్కంటి శ్రీనివాసరెడ్డి, మండల బీసీ నాయకులు మద్ది తిరుపతయ్య,సర్పంచ్ మద్ది నాగరత్తాలు,సర్పంచ్ సానికొమ్ము మధుసూదన్ రెడ్డి,దిరిశనం పిచ్చిరెడ్డి, యారవ వెంకటరెడ్డి, సానికొమ్ము వెంకటేశ్వరెడ్డి,చిట్యాల నాగార్జున రెడ్డి, మోర ఆంజనేయులు రెడ్డి, మోర సాంబ, శ్యామల సాంబిరెడ్డి,మద్ది శ్రీకాంత్,సర్పంచ్ సైకం స్వర్ణ ఏడుకొండలు రెడ్డి,సర్పంచ్ పాశం కొండయ్య,ఇండ్ల శ్రీకాంత్,ఈర్ల శ్రీను, కంటూ కేశవ, షబ్బీర్, పెద్ద ఖాజాతదితరులు పాల్గొన్నారు..

# రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన గూడూరి ఎరిక్షన్ బాబు



దోర్నాల మండల రిపోర్టర్- ఆవులయ్య( శుభోదయం న్యూస్): ప్రకాశం జిల్లా పెద్ద దోర్నాల మండలం లో ఇఫ్తార్ విందులో పాల్గొని ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన గూడూరి ఎరిక్షన్ బాబు రంజాన్ ఉపవాస దీక్షల సందర్భంగా దోర్నాల పట్టణంలోని ఉమర్ మస్జీద్ లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎర్రగొండపాలెం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి గూడూరు ఎరిక్షన్ బాబు గారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలతో కలిసి ప్రత్యేక దువా చేశారు రంజాన్ మాసం ముస్లిం సోదరులు కట్టిన ఉపవాస దీక్షలతో నిర్వహించే పవిత్రమైన పండుగని ప్రతి ఒక్కరికి అల్లాహ్ శుభాలను అందజేయాలని దువా చేశారు ఈ కార్యక్రమంలో దోర్నాల మండలం తెలుగుదేశం పార్టీ ముస్లిం నాయకులు ముస్లిం సోదరులు పాల్గొన్నారు

# గ్రామీణ వైద్యుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి

## జాతీయ ఆర్ఎంపి పి.ఎం.పి సంఘాల సమైక్య అధ్యక్షులు కొండి శెట్టి సురేష్ బాబు



విజయవాడ, శుభోదయం న్యూస్: దేశవ్యాప్తంగా ప్రజలకు నిత్యం ప్రజలకు ప్రథమ చికిత్స చేసి ప్రజల ప్రాణాలు కాపాడు తూ జీవనం సాగించు చున్న గ్రామీణ వైద్యులు కు ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు పార్టీ అధ్యక్షులు నాయకులు గ్రామీణ వైద్యులతో కలిసి తన సహాయ సహకారాలు అంది ఇవ్వాలని వేడుకుంటారు గ్రామీణ వైద్యుడు ప్రజలకు చెబితే కచ్చితంగా తమ పార్టీ అధికారంలోకి వస్తుందని ప్రజలు ఆర్ ఏం పీ ల మాట వింటారని ప్రజలకు మీరు దేవునితో సమానమని మీ సహాయ సహకారాలు ప్రజలకి సమాజానికి ఎంతో అవసరమని మీరు లేకపోతే మేము లేము అని మా ప్రభుత్వం వచ్చిన వెంటనే మీకు మీ సమస్యలన్నీ పరిష్కరించి న్యాయం చేస్తామని హామీల వర్షం కురిపిస్తారు హత్తు కుంటారు నాటి నుండి నేటి వరకు జరుగుతున్న వాస్తవం హామీలను ప్రభుత్వం వచ్చిన వెంటనే నెర వేరుస్తారని గ్రామీణ వైద్యులు నమ్మి ఆ రాజకీయ పార్టీ నాయకులకు మద్దతు తెలిపి ప్రజలను కూడా గ్రామీణ వైద్యులు నమ్మిన పార్టీకి మద్దతు తెలుప వలసిందిగా కోరుతూ అఖండ విజయానికి మూల కారకులు గ్రామీణ వైద్యులు నిస్వార్థంగా ప్రజలకు సేవ చేస్తూ ప్రథమ చికిత్స తో ప్రజల ప్రాణాలను కాపాడుతూ తమ ప్రాణం సైతం లెక్క చేయగా ప్రజలు కు ప్రథమ చికిత్స చేయుటకు సుధీర ప్రాంతాలకు వాహనాలు కూడా వెళ్ళని ప్రాంతాలకు కొండలలో కోనలలో అడవి ప్రాంతంలో మురికివాడల్లో ప్రజల ప్రాణాలు కాపాడుట కొరకు ఎంత దూరమైనా కాలినడకన వెళ్లి ప్రథమ చికిత్స చేసి ప్రజల ప్రాణాలను కాపాడుతున్న వారు గ్రామీణ వైద్యులు ఆ విషయం గత ప్రభుత్వాలు అధికారులు నేడు రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు ఏకగ్రీవంగా అంగీకరిస్తారు కానీ గ్రామీణ వైద్యుల సమస్యలను పరిష్కరించే విషయంలో చిత్తశుద్ధి లేక మరల ఎన్నికల సమయం వరకు సమస్యలను పరిష్కరించరు హామీలను నెరవేర్చాలని కోరిన కనీసం వారిని కలవడానికి కూడా వారితో సమావేశం అవ్వడానికి కూడా అవకాశం కల్పించడం లేదు రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు నాటి నుండి నేటి వరకు జరుగుతున్న ది ఇదే అసెంబ్లీ సమావేశాలు 15 రోజులు జరిగినప్పటికీ కనీసం గ్రామీణ వైద్యుల సమస్యల గురించి ఎమ్మెల్యేలు .ఎమ్మెల్సీలు . మంత్రులు . కనీసం ఒక్క మాట కూడా మాట్లాడని పరిస్థితి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ది . ఇచ్చిన హామీలను నెరవేర్చలని అనేక సందర్భాలలో కోరినప్పటికీ సమస్యలు పరిష్కారం కావడం లేదు అని గ్రామీణ వైద్యులు వాపోతున్నారు గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గా ఉన్న సమయంలో డాక్టరే రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో గ్రామీణ వైద్యుల కు తర తరాలుగా వున్న వారి సమస్యలను అధ్యయనం చేసి అధికారులతో మంత్రులతో కలిసి ఒక ప్రణాళికను 429 జి వో గా ఇవ్వడం జరిగింది ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో రాష్ట్రంలో ఉన్న గ్రామీణ వైద్యులు అందరికీ జిల్లా వైద్యాధికారి జిల్లా ఆసుపత్రులలో ప్రథమ చికిత్స శిక్షణ తరగతులు నిర్వహించడం జరిగింది. కొంతవరకు శిక్షణ తరగతులు పూర్తి అయి పరీక్షలు నిర్వహించే సమయంలో దురదృష్టం డాక్టర్ రాజశేఖర్ రెడ్డి అకాల మరణం తీవ్ర దిగ్భ్రాంతిని కలగజేసింది తరువాతా వచ్చిన ముఖ్యమంత్రులు రాష్ట్రం విడిపోయిన తరువాత వచ్చిన ముఖ్యమంత్రి లు హామీల వరకే పరిమితం శాశ్వత పరిష్కారం చూపిన దాఖలు లేవు నేటికీ ప్రభుత్వం మారుతున్న నాయకులు ముఖ్యమంత్రి లు మారుతున్న ఎన్నికల సమయంలో మాత్రమే గ్రామీణ వైద్యుల సమస్యలు పరిష్కరిస్తామని అధికారంలోకి వచ్చిన వెంటనే సమస్యలు పరిష్కరించి తగు న్యాయం చేస్తామని హామీల ఇవ్వడం వరకే జరుగుతున్నది నాటి నుండి నేటి వరకు అధికారులు నాయకులు మంత్రులు ముఖ్యమంత్రులు రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు కలిసి గ్రామీణ వైద్యుల సమస్యలను శాశ్వత పరిష్కారం చూపాలని తగువిధంగా చర్యలు తీసుకోవాలని సమస్యలు పరిష్కరించాలని ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరుతు జాతీయ ఆర్ఎంపి పి.ఎం.పి సంఘాల సమైక్య అధ్యక్షులు కొండి శెట్టి సురేష్ బాబు విజయవాడలో తన కార్యాలయం నందు ఒక ప్రకటనలో తెలియజేశారు.

# అయ్యప్ప స్వామి గుడి కి విరాళం



లేపాక్షి మండల రిపోర్టర్ అమరేష్ (శుభోదయం న్యూస్ )లేపాక్షి మండలం కంచిసముద్రం గ్రామం లో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్ప స్వామి దేవాలయ నిర్మాణనికి తనవంతు గా పది వేల రూపాయలు విరాళంగా అదించిన కంచి సముద్రం నివాసి ప్రభుత్వ ఉపాధ్యాయులు బి.గంగాధర్. ఇంతే కాకుండా రానున్న రోజుల్లో మరింత సహాయ సహకారాలు అందిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వామి గుడి నిర్మాణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ఆటో ఆవేదన





మంగపేట, మండల రిపోర్టర్ - తులసి (శుభోదయం న్యూస్):నేను ఆటోని..ఎన్నో కుటుంబాల ఆవేదంలో చూడలేక, మరెన్నో కుటుంబాల అప్పుల కూరుకు పోతుంటే.. గుండె బరువెక్కి ఈ కాంగ్రెస్ ప్రభుత్వంతో నా ఆటో అన్నల బాధ చెప్పుకుందామని ఇలా మీ ముందుకు వచ్చా..నిజమో.. నా మూడు చక్రాలు ఎన్నో వేలాది కుటుంబాలకు జీవనాధారం గా మారి వాళ్ల జీవితాల్లో వెలుగులు పూయించింది అన్నది అంతే నిజం..ఎంత చదివిన ఉద్యోగం రాక నిరుద్యోగ మారిన ఓ విద్యావంతుడు తన కుటుంబాన్ని సాకడానికి నాపై ఆధారపడి నన్నే దైవంగా భావించి నన్ను నడపగా వచ్చిన ఆదాయంతో తన కుటుంబ అవసరాలను తన పిల్లల స్కూల్ ఫీజులను, తన చిన్ని చిన్ని ఆనందాలు ఆశలను తీర్చుకోవడానికి నేను ఎంతగానో వారి కుటుంబానికి సహకారంగా నిలుస్తున్నాను.. అందుకే ఆటో అన్నకు నేనంటే అంత ఇష్టం ఎవరినీ ప్రేమించని అంతగా నన్ను ప్రేమిస్తాడు ఎంతో జాగ్రత్తగా ఎంతో ప్రేమగా రోజు నన్ను శుభ్రం చేసి నాలోనే ఆ దైవాన్ని చూసుకొని మొక్కుకొని బయటికి వెళ్లి నా ద్వారా ప్రయాణికులను వాళ్ళ గమ్యస్థానానికి చేర్చి తన జీవిత గమనాన్ని నా సహకారంతో సంతోషంగా గడుపుతున్న సమయంలో.కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన ఉచిత బస్సు పథకం ద్వారా నా మూడు చక్రాలకు పని లేకుండా అయిపోయింది నాపై ఆధారపడిన నా డ్రైవర్ అన్న ఆవేదంలో మునిగిపోయారు పిల్లల చదువులు కట్టలేక స్కూల్ కు వెళ్లలేక ఇంట్లోనే దిగాలుగా కూర్చున్నారు, ఫైనాన్సర్లు ఫోన్ చేసి ఇంటికి వచ్చి పదే పదే అనరాని మాటలని అంటుంటే నలుగురిలో పరువుగా బతికినా డ్రైవర్ అన్న పరువును తీస్తుంటే కళ్ళు లేకున్నా నాకు కన్నీరు వస్తుంది ఉదయం లేకున్నా గాని బాధ కలుగుతుంది, ప్రాణం లేకున్నా గాని ప్రాణం పోయినంత పని అవుతుంది, ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి చెప్పేంత పెద్ద స్థాయి నాది కాదు నేను కేవలం ఆటోని కానీ ఎంతోమంది జీవితాలకు నేనే ఆధారం, నేనే వాళ్ల జీవిత ఆయువుగా ఉన్నాను కాబట్టి చెబుతున్నాను మీ పథకాలు నలుగురిని బ్రతికించడానికి నలుగురి జీవితాల్లో ఆనంద వెలుగులు అభివృద్ధి కాంతులు తీసుకురావడానికి ఉపయోగపడాలి గాని వేలాది కుటుంబాలను ఆవేదంలో ముంచి అప్పుల ఊబిలో తోసేసి, ఆత్మహత్యలు చేసుకునేలా ఉండకూడదు దయుంచి నా ఆటో అన్నల బాధల గురించి ఆలోచించి వారి జీవితాలు ఓ మంచి మార్గాన్ని చూపేలా మీ కాంగ్రెస్ ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకుంటుందని ఆశిస్తూ .. ఆటో అన్నల ఆరాధ్య దైవాన్ని మీ...ఆటోని..రచన: సామాజిక వేత్త జై భీమ్ రామ్మోహన్

# డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు



బీర్కూర్, మండలం రిపోర్టర్ (శుభోదయం న్యూస్):కామారెడ్డి జిల్లా సదాశివ నగర్ మండల్ మర్కల్ గ్రామం నంది ఉన్న సాంఘీక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల మర్కల్ నందు డిగ్రీ తృతీయ సంవత్సర విద్యార్థులకు కోర్సు పూర్తి చేసుకుని కళాశాలను వీడుతున్న సందర్భంగా ఘనంగా వీడ్కోలు పలికారు విద్యార్థులు కాలేజీతో తమ అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.కళాశాల ప్రిన్సిపాల్ డా. సి. శోభారాణి మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు కళాశాలకు ఆస్తి లాంటి వారని, కళాశాల పేరును నిలబెట్టేవారని తెలిపారు విద్యార్థులు ప్రతికూలతలను అనుకూలతలుగా మలచుకొని లక్ష్యం దిశగా ప్రయాణించాలని ఆకాంక్షించారు. ఆద్యంతం భావోద్వేగంతో సాగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులతో పాటుగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ సీ హెచ్.మీన, డా. డి.శ్రావణి,అధ్యాపకులు పాల్గొన్నారు.విద్యార్థులు నృత్యాలతో సందడి చేసారు.

# విజయవంతంగా ఆలయ ఫౌండేషన్ ఉచిత కంటి వైద్య శిబిరం

## శంకర్ ఐ హాస్పిటల్ ఇన్చార్జ్ పరికిపండ్ల రామ్ ఆధ్వర్యంలో




గోదావరిఖని టౌన్ రిపోర్టర్- సురేష్, (శుభోదయం న్యూస్) పెద్దపెల్లి జిల్లా, గోదావరిఖని, సంజయ్ నగర్, 11 డివిజన్లో మంగళవారం రోజున పరికిపండ్ల నరహరి ఐఏఎస్ నిర్మించిన ఆలయ ఫౌండేషన్ ఉచిత కంటి ఆసుపత్రి ద్వారా శంకర్ ఐ హాస్పిటల్ ఇన్చార్జ్ పరికిపండ్ల రామ్ ఆధ్వర్యంలో, ఆలయ ఫౌండేషన్ సభ్యులు లంక సురేష్(11వ డివిజన్) సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం ను విజయవంతంగా నిర్వహించారు.ఈ సందర్భంగా లంక సురేష్ మాట్లాడుతూ ఆలయ ఫౌండేషన్ సేవలు మరింత విస్తరించాలని కోరుతూ వారు చేస్తున్న సేవలను కొనియాడారు. ఈరోజు శిబిరం ద్వారా దాదాపు 300 మందికి పైగా కంటి పరీక్షలు నిర్వహించాము. ఇందులో నుండి దాదాపు 100 మందికి కంటి సమస్యలు ఉన్న రోగులను హైదరాబాద్ నానాక్ రామ్ గూడా లోని శంకర్ ఐ విజన్ సెంటర్ కు పంపించడం జరుగుతుందని తెలిపారు. వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్ 9652034500, శంకర ఐ హాస్పిటల్, బసంత నగర్, పెద్దపెల్లి జిల్లాను సంప్రదించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండేషన్ సీఈవో తీట్ల రమేష్ బాబు, డిప్యూటీ సీఈవో కీర్తి నాగర్జున, అడిషనల్ సీఈవో మిట్టపల్లి రాజేందర్ కుమార్, హాస్పిటల్ ఇంచార్జ్ పరికిపండ్ల రామ్, ఐత శివ(32వ డివిజన్ మాజీ కార్పొరేటర్), మహేష్ పటేల్, ఆలయ ఫౌండేషన్ వాలంటీర్స్ లంక నరేష్, గడ్డం రమేష్, దూడపాక సుకుమార్, జూడపాక సాగర్, వెంకటేష్, శ్రీనివాస్, బుల్లి సాగర్, కన్నా బెంజ్, ఇంకా అధిక సంఖ్యలో యువకులు బస్తీ వాసులు మహిళలు హాస్పిటల్ డాక్టర్ల బృందం, తదితరులు పాల్గొన్నారు.



# ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఫౌండర్ గంప నాగేశ్వరరావు చేత మోటివేషన్ ట్రైనర్ గా సర్టిఫికెట్ అందుకున్న దీపిక

వనపర్తి జిల్లా ఇంపాక్ట్ క్లబ్ ఇన్చార్జిగా ఎన్నికైన దీపిక రాము




తెలంగాణ స్టేట్ బ్యూరో, దొమ్మాటి శివకుమార్, (శుభోదయం న్యూస్),: ఇంపాక్ట్ ఫౌండర్ మరియు ప్రముఖ మోటివేటర్ గంప నాగేశ్వరరావు చేత ఉత్తమ మోటివేషనల్ స్పీకర్ ట్రైనర్ గా సర్టిఫికెట్ అందుకోవడం చాలా సంతోషంగా ఉందని గడ్డమీద దీపిక రాము అన్నారు. ఈనెల 22. 23 తేదీలలో రెండు రోజులపాటు హైదరాబాదు సికింద్రాబాద్ లోని మినర్వా గ్రాండ్ హోటల్ లో జరిగిన రెండు రోజుల మోటివేషనల్ స్పీకర్స్ ట్రైనింగ్ క్లాసులలో వనపర్తి జిల్లా వీపనగండ్ల మండల కేంద్రానికి చెందిన దీపిక మొదటి బహుమతి పొందడం జరిగింది. అదేవిధంగా ఇంపాక్ట్ వనపర్తి జిల్లా క్లబ్ ఇన్చార్జిగా నియమితులయ్యారు.రెండు రోజుల క్లాసులు ముగింపు రోజు దీపిక మొదటి బహుమతితోపాటు ఇంపాక్ట్ ప్రశంసా పత్రాన్ని ఇంపాక్ట్ ప్రెసిడెంట్ అయిన రామచంద్రుడు, వైస్ ప్రెసిడెంట్ మాధవి, ప్రముఖ సినిమా ఆర్టిస్ట్ ప్రదీప్ కుమార్ ల చేతుల మీదుగా అందుకోవడం జరిగింది. ఈ సందర్భంగా దీపిక మాట్లాడుతూ... సమాజంలో నెలకొన్న, మూఢనమ్మకాలు, బాల్య వివాహాలు, మహిళలపై అత్యాచారాలు, ఇవి టీజింగ్, డ్రగ్స్, తదితర అభివృద్ధి నిరోధక అంశాలపై అవగాహన కల్పించేందుకు ప్రజల్ని చైతన్యవంతం చేస్తానని అన్నారు. దేశానికి పట్టుకొమ్మలు విద్యార్థులు,యువకులే అని అలాంటి వారి జీవిత లక్ష్యాన్ని ఎంచుకోవడంలో ఇబ్బందులు పడుతుంటారని, వాళ్లలో వాళ్లకు తెలియకుండా దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి మోటివేషన్ క్లాస్ లు ఎంతో దోహద పడుతాయని,రానున్న కాలంలో జిల్లావ్యాప్తంగా అనేక పాఠశాలను తిరిగి విద్యార్థులను ఉత్తమ భవిష్యత్తు నిర్మాణం కోసం చైతన్యం చేయనున్నట్టు ఆమె పేర్కొన్నారు. ఈ అవార్డుకి ఎంపిక చేసిన ఇంపాక్ట్ సభ్యులందరికీ అభినందనలు తెలియజేశారు. అదేవిధంగా రానున్న కాలంలో వనపర్తి జిల్లాలో ఇంపాక్ట్ క్లబ్ ఏర్పాటు చేయబోతున్నట్టు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ క్లబ్ లో సమాజ సేవ చేయాలనుకున్న ప్రతి ఒక్కరు జాయిన్ కావచ్చు అని, భవిష్యత్తులో గొప్ప ఉపన్యాసకులుగా ఎదగడానికి, సమాజ సేవ చేయడానికి ఇంపాక్ట్ అవకాశం కల్పిస్తుందని, ఈ అవకాశాన్ని ముఖ్యంగా యువతీ యువకులు సద్వినియోగపరచుకోవాలని కోరారు. ఇంపాక్ట్ ట్రైనర్ దీపిక ను కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులు, గ్రామస్తులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

## సబ్ కి యోజన - సబ్ కి వికాస్ కింద జిల్లా, మండల ప్రణాళికలు రూపొందించాలి

జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ




తెలంగాణ స్టేట్ బ్యూరో కడిదల రామారావు (శుభోదయం న్యూస్): ఐడిఓసి కార్యాలయంలోసబ్ కి యోజన సబ్ కి వికాస్ కింద జిల్లా, మండల ప్రణాళికలు రూపకల్పనపై జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులకు ప్రణాళికలు రూపకల్పనపై పలు సూచనలు చేశారుఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా మరియు మండల స్థాయిలో ప్రణాళికా రూపకల్పన ఎంతో కీలకమైనదని, ఇందులో ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సమర్థవంతమైన అభివృద్ధి చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామ, మండల స్థాయిలో ప్రజా భాగస్వామ్యాన్ని పెంచి ప్రణాళికలను రూపొందించాల్సిన అవసరాన్ని ఆయన పేర్కొన్నారుఅంతేకాక, అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనలో ఆయా ప్రణాళికలు సమగ్ర అభివృద్ధిని లక్ష్యంగా ఉంచుకుని రూపొందించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ తెలిపారు. ప్రతి మండలానికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించి, స్థానిక వనరులను సమర్థవంతంగా ఉపయోగించుకోవడం ద్వారా అభివృద్ధిని వేగవంతం చేయడానికి అవకాశం కలుగుతుందని తెలిపారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి , సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, డిపిఓ నారాయణరావు, డిఆర్డీఓ నరేష్, ఇతర శాఖల జిల్లా అధికారులు, అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపిడిఓలు , ఎంపీవోలు తదితరులు పాల్గొన్నారు.

## విజయవాడలో దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ 138వ కౌన్సిల్ సమావేశానికి.. ముఖ్యఅతిథిగా హాజరైన ఆదం సంతోష్ కుమార్






తెలంగాణ స్టేట్ బ్యూరో, దొమ్మాటి శివకుమార్, (శుభోదయం న్యూస్), మార్చి 25: విజయవాడలో జరిగిన దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ రాయన్‌పాడు వర్క్‌షాప్ 138వ డివిజన్ కౌన్సిల్ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆదం సంతోష్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైల్వే కార్మికులకు కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని, ఎంప్లాయిస్ సంఘ్ కార్మికుల సంక్షేమం కోసమే పనిచేస్తుందని అన్నారు. 'నాయకుడంటే దారి తెలిసిన వాడు, అలాగే దారి చూపేవాడు అన్నారు. ఈ యొక్క కార్యక్రమంలో ఎంప్లాయిస్ సంఘ్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

## అభివృద్ధిని జీర్ణించుకోలేక కాంగ్రెస్ పార్టీ నాయకులపై వ్యక్తిగత విమర్శలు చేస్తే ఊరుకునేది లేదు

ఎన్ ఎస్ యు ఐ రామగుండం నియోజకవర్గ అధ్యక్షులు దాసరి విజయకుమార్, యువజన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కుడిదెల శివ హెచ్చరిక




రామగుండం మండలం రిపోర్టర్ - తిరుపతి, (శుభోదయంన్యూస్)అభివృద్ధి పేరిట అవినీతిని ప్రోత్సహించిన బీఆర్ఎస్ నాయకులను ప్రజాక్షేత్రంలో ప్రజలు చీత్కరిస్తే, ఇప్పుడు జరుగుతున్న అభివృద్ధిని జీర్ణించుకోలేక కాంగ్రెస్ పార్టీ నాయకులపై వ్యక్తిగత విమర్శలకు దిగుతే ఊరుకునేది లేదంటూ గోదావరిఖని ప్రెస్ క్లబ్ వేదికగా మంగళవారం రోజున ఉదయం జరిగిన విలేకరుల సమావేశంలో హెచ్చరించిన ఎన్ ఎస్ యు ఐ రామగుండం నియోజకవర్గం అధ్యక్షులు దాసరి విజయ్ కుమార్ యువజన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కుడిదెల శివ. తదితరులు పాల్గొన్నారు.

# పభుత్వ స్థలాల్లో పేదలు నిర్మించుకున్న ఇండ్లకు ఇంటి నెంబర్లు,ఇంటి పట్టాలు ఇవ్వాలి

జాన్ వెస్లీ, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి.




రామగుండం మండలం రిపోర్టర్ – తిరుపతి, (శుభోదయం న్యూస్ ))సిపిఎం పెద్దపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కారానికై ఈరోజు రామగుండం మున్సిపల్ కార్యాలయం వద్ద మహా ధర్నా కార్యక్రమం నిర్వచించడం జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ జాన్ వెస్లీ గారు హాజరైనారు.మహా ధర్నా కార్యక్రమం కు ముందు ఎన్.టి.పి.సి. మేడిపెల్లి సెంటర్ వద్ద జాన్ వెస్లీ గారికి స్వాగతం పలికి అక్కడినుండి మున్సిపల్ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించడం జరిగింది. బైక్ ర్యాలీలో బాగంగా ఎఫ్.సి.ఐ. క్రాస్ రోడ్,మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహాలకు మరియు రాజేష్ థియేటర్ వద్ద ఉన్న జ్యోతిబా పూలే విగ్రహానికి రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, రాష్ట్ర సీనియర్ నాయకులు బొజ్జా బిక్షమయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్ గార్లు పూలమాలలు వేశారు.అనంతరం మున్సిపల్ కార్యాలయం వద్ద మహా ధర్నా ను




ఉద్దేశించి రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ జాన్ వెస్లీ గారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు ప్రజలకు అనేక హామీలు ఇచ్చిందని తెలిపారు.అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు ఉచిత బస్సు పథకం తప్ప ఇంకేవి అమలు చేయలేదని అన్నారు. ఈ అసెంబ్లీ సమావేశాల్లో పెట్టిన రాష్ట్ర బడ్జెట్ లో కూడారైతాంగాన్ని,విద్యను,వైద్యాన్ని,కార్మిక రంగాన్ని విస్మరించిందని అన్నారు. కేంద్ర బడ్జెట్ లో కూడా పేదలకు ఒరిగింది ఏమీ లేదని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా సంపన్నుల కోసం పని చేస్తున్నాయని అన్నారు. దేశంలో పేద,దనిక అంతరాలు పెరిగిపోతున్నాయని దీనికి కారణం పాలకులేనని విమర్శించారు. దనిక,పేద అంతరాలు పెరగకుండా అందరూ సమానంగా ఉండేలా పోరాడాలని పిలుపునిచ్చారు.అదేవిధంగా రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సిపిఎం ఆధ్వర్యంలో 3 సంవత్సరాల క్రితం భూపోరాటం చేసి 4 కేంద్రాలు ఏర్పాటు చేసి సుమారు ఆరువందల మందికి ఇండ్ల స్థలాలు ఇప్పించడం జరిగిందని అన్నారు. వారు ఇప్పుడు ఇండ్లు కట్టుకుని నివసిస్తున్నారని వారికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం పట్టాలు ఇవ్వాలని, ఇంటి నెంబర్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.అప్పటి వరకు వారికి కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా సిపిఎం ఆధ్వర్యంలో కార్పొరేషన్ లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు సర్వే చేశారని వాటిని పరిష్కరించాలని ఇప్పటికే అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినప్పటికీ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవని ఆయన అన్నారు. అనేక డివిజన్లలో రోడ్లు,డ్రైనేజీ,మంచినీరు,పెన్షన్ల సమస్యలు ఉన్నాయని అన్నారు.ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.స్థానిక ప్రభుత్వ రంగ సంస్థల్లో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు.అదే విధంగా సింగరేణి,మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు 26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు, దీంతోపాటు బిల్డింగ్, ట్రాన్స్ పోర్ట్, హమాలీ తదితర అసంఘటిత రంగ కార్మికులకు కనీస వేతనాలు,సౌకర్యాలు కల్పించాలని అన్నారు.ప్రజలు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల్ని వెంటనే పరిష్కరించకుంటే భవిష్యత్తులో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ మహా ధర్నా సందర్భంగా సింగరేణి పర్మినెంట్ కార్మికులకు సొంతింటి కల నెరవేర్చాలని, మున్సిపల్,సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు కనీస 26 వేలు వేతనాలు పెంచి వారు ఎదుర్కొంటున్న సమస్యల్ని వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.అనంతరం సింగరేణి పర్మినెంట్,కాంట్రాక్ట్,మున్సిపల్, భూ పోరాట కేంద్రాలను జాన్ వెస్లీ గారికి వినతి పత్రాలు అందించారు.మహా ధర్నా అనంతరం మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ గారికి వినతి పత్రాన్ని అందివ్వడం జరిగింది.ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా ఎ.మహేశ్వరి వ్యవహరించ రాష్ట్ర కమిటీ సభ్యులు బిక్షమయ్య,భూపాల్ గార్లు స్థానికసమస్యలపై,కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై మాట్లాడారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వై.యాకయ్య, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వేల్పుల కుమారస్వామి, ఎ.ముత్యం రావు, ఎం.రామాచారి, జిల్లా కమిటీ సభ్యులు సారయ్య, శ్రీనివాస్, శంకర్, బిక్షపతి, శైలజ,గణేశ్, జ్యోతి, రవీందర్,అశోక్, నాయకులు నాగమణి, ఉపేందర్,సంజీవ్,లక్ష్మారెడ్డి,నాగలక్ష్మి,సుమారుఐదువందల మంది ప్రజలు పాల్గొన్నారు.

## రేషన్ కార్డులు ఇవ్వకుండా 'యువ వికాసం' ఎలా సాధ్యం..? రేషన్ కార్డు తప్పనిసరి నిబంధన ఎత్తివేయాలి

కాంపల్లి శ్రీనివాస్, సిపిఐ సికింద్రాబాద్ కార్యదర్శి




తెలంగాణ స్టేట్ బ్యూరో, దొమ్మాటి శివకుమార్,( శుభోదయం న్యూస్) మార్చి 25: 10 సంవత్సరాలుగా టిఆర్ఎస్ ప్రభుత్వం రేషన్ కార్డులు ఇవ్వకుండా ప్రజలను మోసం చేస్తే, ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్ కార్డులు ఇవ్వకుండా ప్రభుత్వం అందించే సబ్సిడీ పథకాలకు రేషన్ కార్డు తప్పనిసరి చేయడం తీవ్రమైన అన్యాయమని , రేషన్ కార్డు లేకుండా రాజీవ్ యువ వికాసం ఎలాసాధ్యమైతుందని రాష్ట్ర ప్రభుత్వాన్ని సిపిఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ ప్రశ్నించారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ యువతకు 'రాజీవ్ వికాస్ పథకం' కింద స్వయం ఉపాధి కల్పించాలని ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకం మంచి ఆలోచన అని కానీ సుమారు గత టిఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లుగా రేషన్ కార్డులు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తే , ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఒకవైపు రేషన్ కార్డులు అదిగో.. ఇదిగో.. అంటూ త్వరలోనే ఇస్తున్నమంటూ మరోవైపు ప్రభుత్వం అందించే సంక్షేమ, సబ్సిడీ పథకాలకు రేషన్ కార్డు తప్పనిసరి చేయడం యువతను మోసం చేయడమే అని అన్నారు. ఈ ప్రభుత్వానికి యువతకు స్వయం ఉపాధి కల్పించాలని ఆలోచన నిజంగానే ఉంటే రాజీవ్ వికాస్ పథకం దరఖాస్తు తప్పనిసరి చేసిన రేషన్ కార్డు నిబంధనను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.ఇప్పటికే పేద ప్రజలు రేషన్ కార్డులు లేకుండా ప్రభుత్వాన్నించే సంక్షేమ పథకాలకు దూరమయ్యారని, రేషన్ కార్డు కొరకు కళ్ళల్లో ఒత్తులు వేసుకుని ఎదురు చూస్తున్నారని అన్నారు. కానీ ప్రభుత్వ మాత్రం ప్రకటనలకు మాత్రమే పరిమితమైందని ఆవేదన వ్యక్తం చేశారు . కావున తక్షణమే ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డును యుద్ధ ప్రాతిపదికన అందజేయాలని డిమాండ్ చేశారు.

## ప్రజల దాహాన్ని తీర్చేందుకు ధర్మోజి గూడెం గ్రామంలో బోరు వేయించిన ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి



చౌటుప్పల్, మార్చ్. 25 శుభోదయం న్యూస్ రిపోర్టర్(విడం సాయికుమార్): చౌటుప్పల్ మండలం ధర్మోజి గూడెం గ్రామంలో వేసవికాలంలో ప్రజలు నీటి కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నీటి కొరత విషయం గుర్తించిన ధర్మోజి గూడెం గ్రామ కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే స్పందించిన ఎమ్మెల్యే తన నిధులతో ధర్మాజీగూడెం గ్రామంలో బోరు వేయించారు సార్ అనుమతించాడు దేవుడు వరమిచ్చాడు అన్నట్టుగా ధర్మాజీగూడెం గ్రామంలో బోరు వేయించగానే బోరు నుంచి సమృద్ధిగా వాటర్ రావడం జరిగింది. దీంతో గ్రామ ప్రజలందరూ హర్ష వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి గారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ ఉపసర్పంచ్ బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బత్తుల శ్రీహరి గ్రామ శాఖ అధ్యక్షులు వల్లబోతు నారాయణ యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు రాచకొండ భార్గవ్ గ్రామ కాంగ్రెస్ ఎన్నికల ఇంచార్జ్ కొయ్యడ సైదులు గౌడ్ మాజీ ఉప సర్పంచ్లు కొంతం బుచ్చిరెడ్డి, కొంతం రామకృష్ణారెడ్డి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు ఊదరి శ్రీనివాస్ బ్లాక్ కాంగ్రెస్ మాజీ కార్యదర్శి ఐతరాజు లింగస్వామి

## శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణోత్సవంలో పాల్గొన్న ప్రజల మనిషి రాజన్న దంపతులు



చౌటుప్పల్, మార్చ్ 25 శుభోదయం రిపోర్టర్(విడం సాయికుమార్): చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని వలిగొండ రోడ్డులోని శ్రీ బాలాజీ రామకృష్ణ దేవాలయంలో శ్రీ అలివేలు మంగ పద్మావతి దేవి వారల సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి బ్రహ్మోత్సవాలలో భాగంగా శ్రీ అలివేలు మంగ పద్మావతి శ్రీ సమేత వెంకటేశ్వర స్వామి వారికి అంగరంగ వైభవంగా కళ్యాణం నిర్వహించడం జరిగినది ఈ కళ్యాణానికిముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ ఛాంబర్ చైర్మన్ గౌరవ శ్రీ వెన్ రెడ్డి రాజు సంధ్య దంపతులు పాల్గొన్నారు.

## జిన్నారం పాఠశాల అదనపు గదులను పాత స్థలంలో నిర్మించాలి



జిన్నారం : (శుభోదయం న్యూస్) జిన్నారం మండల కేంద్ర సమీపంలో 1002 సర్వే నెంబర్లో నూతనంగా నిర్మిస్తున్న అదనపు గదులను గ్రామంలోని పాత పాఠశాల స్థలంలో నిర్మించాలని కలెక్టర్ వల్లూరి క్రాంతిని జిన్నారం గ్రామస్తులు కోరారు. కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో గ్రామస్తులు కలెక్టర్ ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. పాత పాఠశాల స్థలంలోని అదనపు గదులను నిర్మించాలని ఉన్నతధికారులను విజ్ఞప్తి చేశారు. విద్యార్థులకు దూర భారం తగ్గుతుందని ఉన్నంత అధికారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు కంది ప్రవీణ్, తొర్రి యాదగిరి, దేవిని గారి రాములు, తదితరులు పాల్గొన్నారు.

## మల్లన్న స్వామి కళ్యాణంలో పాల్గొన్న సి జి ఆర్



గుమ్మడిదల : (శుభోదయం న్యూస్)గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ మల్లన్న దేవాలయంలో జాతర మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు.యాదవ సంఘం ఆధ్వర్యంలో కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కళ్యాణోత్సవం అనంతరం సిజిఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన అన్న ప్రసాదం కార్యక్రమంలో భక్తులు పాల్గొని భోజనం స్వీకరించారు. ఈ సందర్భంగా యాదవ సంఘం పెద్దలు గోవర్ధన్ రెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నల్ల పోచమ్మ దేవాలయ జాతర మహోత్సవ ఆహ్వానం

ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ఎల్లప్పుడూ నా వంతు సహకారం ఉంటుంది సిజిఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి



గుమ్మడిదల : (శుభోదయం న్యూస్)సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం వడ్డేపల్లి గ్రామంలో శ్రీ కృష్ణ శీతల మాత (నల్ల పోచమ్మ) దేవాలయ జాతర ఈ నెల 30,31 మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించుటకు గ్రామ ప్రజలు దేవాలయ పూజారులు ప్రత్యేక ఏర్పాటు చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరుకావాలని గ్రామ పెద్దలు ఆహ్వాన పత్రికను అందజేశారు.

శుభోదయం

సంపాదకీయం

## బెట్టింగ్‌ను నియంత్రించాలి!

### (విశ్లేషణ)

దేశంలో బెట్టింగ్ సర్వాంతర్యామిగా మారింది. జిల్లా కేంద్రాలతో పాటు మండల, గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఈ అక్రమ దందా ఊపందుకుంది. డబ్బు సులభంగా సంపాదించాలని కోరికతో ఉన్నవారు ఎక్కువగా బెట్టింగ్ బారిన పడుతున్నారు. అందులో ఇక ఐపీఎల్ వంటి ప్రొఫెషనల్ క్రికెట్ ఆటతో ఇది మరింత పెరిగిపోయింది. ఈ దేశంలోని చాలా రాష్ట్రాల్లో బెట్టింగ్ చట్టవిరుద్ధం. కానీ గుట్టు చప్పుడు కాకుండా చాలామంది యువకులు ఈ బెట్టింగ్ యాప్‌లను అనధికారికంగా వాడుతున్నారు.

పోలీసులు హెచ్చరిస్తున్నా..

దేశంలో గత పది పదిహేనేళ్ల క్రితం మొదలైన ఈ క్రికెట్ బెట్టింగ్ వ్యసనం, మొదట్లో కేవలం ఇండియా టీమ్ ఆడే మ్యాచ్‌లకు మాత్రమే ఉండేది. రాను రానూ ఇది మరింత ముదిరి పాకాన పడింది. ముఖ్యంగా టీ-20 మ్యాచ్‌లు ప్రారంభమైనప్పటి నుంచి బెట్టింగ్ జాఢ్యం ఊపందుకుంది. దీనికి తోడు అగ్నికి ఆజ్యం పోసినట్లు ఐపీఎల్ యువతను మరింత కట్టి పడేసింది. దీంతో బెట్టింగ్‌ల జోరుకు అడ్డుకట్ట అనేది లేకుండా పోయింది. ఇక బెట్టింగ్‌లకు బానిసలుగా మారిన చాలా మంది అమాయకులు ఆర్థికంగా నష్టపోవడమే కాకుండా, తమ కుటుంబాలు చిన్నాభిన్నం చేసుకుంటున్నారు. తల్లిదండ్రులు ఇచ్చే పాకెట్ మనీతో క్రికెట్‌లో గెలుపోటములపై వారు పందాలు కాస్తున్నారు. అలాగే దేశంలో సైబర్ నేరాలకు పాల్పడుతున్న ముఠాల్లో ఎక్కువగా బెట్టింగ్, మాదకద్రవ్యాలు, ఆర్థిక నేరగాళ్లే అధికం. బెట్టింగ్‌లకు పాల్పడితే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరికలు జారీ చేస్తున్నా కొంత మంది మాత్రం బెట్టింగ్‌లనే వృత్తిగా సాగిస్తున్నారు. ఇప్పటికైనా పోలీసులు నిఘా పెట్టి క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.


నిషేధించే చట్టం లేదు..

స్పోర్ట్స్ బెట్టింగ్ చట్టం అనేది సంక్లిష్టమైన అంశం. ఎందుకంటే ప్రతి దేశానికి స్పోర్ట్స్ బెట్టింగ్‌కు సంబంధించి దాని సొంత చట్టాలు ఉన్నాయి. కానీ మన దేశంలోనే చట్టాలలోనే ఎక్కువ భాగం ఖచ్చితంగా ఏది చట్టబద్ధమైనది, ఏది కాదో స్పష్టం చేయడంలో విఫలమైంది. గుర్రపు పందాలపై బెట్టింగ్‌లు మినహా భారతదేశంలో క్రీడలు బెట్టింగ్‌లు ప్రధానంగా చట్టవిరుద్ధం. భారతదేశంలో ఎక్కువ భాగం పబ్లిక్ గ్యాంబ్లింగ్ యాక్ట్ 1867, టెక్నాలజీ యాక్ట్ 2000కి లోబడి ఉంది. ఆ చట్టాల ప్రకారం స్పోర్ట్స్ బెట్టింగ్ అనుమతించబడదు. కానీ ఒక్కో రాష్ట్రానికి వారి స్వంత చట్టాలను రూపొందించుకునే హక్కు ఉంటుంది. మన రాష్ట్రంలనూ తెలంగాణ గేమింగ్ యాక్ట్, 2017 చట్టప్రకారం ఇక్కడ ఆన్‌లైన్ గేమింగ్ నిషేధం. ఇక దేశంలో పబ్లిక్ గ్యాంబ్లింగ్ యాక్ట్ (1867) ప్రకారం, భారతదేశంలో అన్ని రకాల జూదాలు చట్టవిరుద్ధం. భారతీయ వ్యవస్థలో ఆన్‌లైన్ జూదాన్ని నిషేధించే నిర్దిష్ట చట్టం ఏదీ లేకపోవడంతో బెట్టింగ్ కంపెనీలు భారతీయులను ప్రతి దానిపై పందెం వేయడానికి ఈ లొసుగులను ఉపయోగించుకుంటున్నారు. పట్టుకున్నా దోషులు తప్పించుకుంటున్నారు. అందుకే దేశంలో ఎక్కువగా బెట్టింగ్‌లకు కారణమైన ఐపీఎల్‌ను ప్రభుత్వాలు సత్వరమే నిషేధించాలి. తద్వారా యువతను చెడుమార్గం నుండి బయటకు రప్పించవచ్చు.

# ఎన్నికల్లో మనీ గేమ్

- 2024లో పార్టీల ఖర్చు రూ. 3,861 కోట్లు- అనధికారిక లెక్క లక్ష కోట్లపైనే
- ఆదాయ, వ్యయాల్లో బీజేపీయే టాప్
- ఎన్నికల కమిషన్ ఏం చేస్తోంది?

ఎన్నికలలో విజయం సాధించడానికి రాజకీయ పార్టీలు విచ్చలవిడిగా డబ్బు ఖర్చు చేస్తున్న సంగతి తెలిసిందే.




న్యూఢిల్లీ: రాజకీయ పార్టీలు తమ ఆదాయాన్ని, వ్యయాన్ని తెలియజేస్తూ ఎన్నికల కమిషన్కు నివేదికలు అందిస్తుంటాయి. అయితే అందులో పూర్తి వివరాలుండవు. కొన్ని జమా ఖర్చులను రహస్యంగా ఉంచుతాయి. వివిధ రాజకీయ పార్టీలు ఎన్నికల కమిషన్కు సమర్పించిన వివరాల ఆధారంగా కామన్వెల్త్ హ్యూమన్ రైట్స్ ఇనిషి యేటివ్ (సీహెచ్ఆర్ఐ) అనే సంస్థ ఇటీవల ఓ అధ్యయనం జరిపింది. అధికారం కోసం రాజకీయ పార్టీలు ఎన్నికలలో ఏ స్థాయిలో విచ్చలవిడిగా డబ్బును ఖర్చు చేస్తాయో ఈ అధ్యయనం బయట పెట్టింది. ఆదాయంలోనే కాదు..ఖర్చులోనూ అధికార బీజేపీదే పైచేయి. అధికార గణాంకాల అధ్యయనం ప్రకారం కేవలం 22 పార్టీలు రూ. 18,742.31 కోట్లు ఖర్చు చేశాయి. వీటిలో ఆమ్‌ఆద్మీ, అసోం గణపరిషత్, అన్నా డీఎంకే, మజ్లిస్, తృణమూల్ కాంగ్రెస్, ఆల్ ఇండియా యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్, బీజేడీ, బీజేపీ, బీఎస్పీ, సీపీఐ (ఎం), డీఎంకే, కాంగ్రెస్, జేడీఎస్, జేడీయూ, ఎల్జేపీ (రాం విలాస్), ఆర్జేడీ, సమాజ్వాదీ, సిక్కిం డెమొక్రటిక్ ఫ్రంట్, సిక్కిం క్రాంతికారి మోర్చ, టీడీపీ, వైసీపీ ఉన్నాయి. ఇవన్నీ ఎన్నికల కోసం రూ. 3,861.57 కోట్లు ఖర్చు చేయగా ఒక్క బీజేపీయే రూ. 1,737.68 కోట్లు%ూ%అంటే మొత్తం వ్యయంలో 45 శాతం ఖర్చు చేసింది. అన్ని పార్టీలకూ కలిపి రూ. 7,416.31 కోట్లు విరాళాల రూపంలో అందగా అందులో 84.5 శాతం ఒక్క బీజేపీ ఖాతాకే చేరాయి. కేవలం ఏడు పార్టీలు అందజేసిన వివరాల ప్రకారం ప్రింట్, టీవీ, డిజిటల్ వేదికల ద్వారా మీడియా ప్రకటనల కోసం రూ. 992.48 కోట్లు, సోషల్ మీడియా, వర్చువల్ ప్రచారం కోసం రూ. 196.23 కోట్లు ఖర్చు చేశారని సీహెచ్ఆర్ఐ డైరెక్టర్ వెంకటేష్ నాయక్ తెలిపారు. స్టార్ క్యాంపెయినర్ల హెలికాప్టర్, ప్రయివేటు జెట్ల ప్రయాణాలకు రూ. 830.15 కోట్లు ఖర్చయ్యాయి.

ఎన్నికలు ఏవైనా వ్యయం మాత్రం కొండలా పెరిగిపోతూనే ఉంది. గత సంవత్సరం దేశంలో ఐదు ఎన్నికలు జరిగాయి. వీటికి అయిన ఖర్చు ఎంతో తెలుసా? అక్షరాలా రూ. 3,861 కోట్లు. ఒక్క లోక్‌సభ ఎన్నికలకే రూ. 1.35 లక్షల కోట్లు ఖర్చు చేశారని సెంటర్ ఫర్ మీడియా స్టడీస్ సంస్థ నిర్వహించిన అధ్యయనం తెలిపింది. అయితే ఇది అనధికారిక అంచనా. మరి లోక్‌సభ ఎన్నికలతో పాటు ఆంధ్రప్రదేశ్, ఒడిశా, అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం రాష్ట్రాల శాసనసభలకు జరిగిన ఎన్నికల కోసం రాజకీయ పార్టీలు చేసిన ఖర్చుపై ఎన్నికల కమిషన్ వెల్లడించిన అధికారిక లెక్కలు ఎలా ఉన్నాయి?

ఇక బ్యానర్లు, హోర్డింగులు, పోస్టర్లు, ఇతర ప్రచార సామగ్రి నిమిత్తం రూ. 398.49 కోట్లు ఖర్చు చేశారు. వివిధ రాజకీయ పార్టీలకు నగదు ఎలా లభించింది అని అడిగిన ప్రశ్నకు వెంకటేష్ నాయక్ సమాధానమిస్తూ 'జవాబు దొరకని ప్రశ్నలు అనేకం ఉన్నాయి. ఎన్నికలు ముగిసిన తర్వాత పార్టీల ఖాతాలలో రూ. 14.848.46 కోట్లు నిల్వ ఉన్నాయి. ఈ అదనపు సొమ్ము ఎక్కడికి పోతుంది? బీజేపీ సహా ఆరు పార్టీల వద్ద ఎన్నికల ప్రారంభంలో కంటే ముగిసిన తర్వాతే ఎక్కువ సొమ్ము ఉంది. ఇది ఎలా సాధ్యం? సీపీఐ, జేఎంఎం, శివసేన, శిరోమణి అకాలీదళ్ సహా అనేక పార్టీలు తమ ఖర్చుల వివరాలే ఇవ్వలేదు' అని చెప్పారు.

మంచినీళ్ల మాదిరిగా ఖర్చు%ూ

%'దిగ్భ్రాంతి కలిగిస్తున్న ఈ లెక్కల్ని చూస్తుంటే ఒక విషయం స్పష్టమవుతోంది. దేశంలో ఎన్నికలు ఇంకెంతో కాలం ప్రజాస్వామ్యం గురించి జరగబోవు. అవి ధనాన్ని విచ్చలవిడిగా వెదజల్లే యుద్ధ క్షేత్రాలుగా మారుతాయి. రాజకీయ పార్టీలు ఈ విధంగా డబ్బును మంచినీళ్ల మాదిరిగా ఖర్చు చేస్తుంటే సామాన్య మానవుడి మనసులో ఓ ప్రశ్న మెదులుతుంది. ఈ డబ్బంతా ఎక్కడి నుంచి వస్తోంది? చివరికి ప్రయోజనం పొందేది ఎవరు?. ఏదేమైనా ఎన్నికలలో ఓట్లు కాదు%ూ% డబ్బే నిర్ణయాత్మక పాత్ర పోషించబోతోంది. భారత రాజకీయ భవితవ్యాన్ని నిర్ణయించబోయేది డబ్బే. ఈ ధన ప్రవాహాన్ని ఎన్నికల కమిషన్ అడ్డుకోగలదా? లేదా ధనబలం, గోప్యత ఇలా కొనసాగుతాయా? అనేదే తేలాల్సి ఉంది' అని వెంకటేష్ నాయక్ చెప్పారు.

# వారి చట్టపరమైన హౌదా రద్దు

- నాలుగు దేశాలకు చెందిన 5.32 లక్షల మంది వలసదారులపై ఎఫెక్ట్
- ట్రంప్ మరో షాకింగ్ నిర్ణయం




వాషింగ్టన్ : వివాదాస్పద చర్యలతో అలజడి సృష్టిస్తున్న ట్రంప్.. మరో షాకింగ్ నిర్ణయం తీసుకున్నారు. ఇప్పుడు తాత్కాలిక వలసదారులను టార్గెట్ చేసుకున్నారు. యూఎస్వ్యాప్తంగా ఐదు లక్షల మందికి పైగా వలసదారులకు తాత్కాలిక నివాస హౌదాను రద్దు చేస్తున్నట్టు డిపార్ట్మెంట్ ఆఫ్ హౌమ్లాండ్ సెక్యూరిటీ ప్రకటించింది. క్యూబా, హైతీ, నికరాగ్వే, వెనిజులా దేశాలకు చెందిన లక్షలాది మంది వలసదారులకు చట్టపరమైన హౌదాను రద్దు చేస్తున్నట్టు హౌమ్లాండ్ సెక్యూరిటీ విభాగం వెల్లడించింది.నెల రోజుల్లో వారిని దేశం నుంచి బహిష్కరించనున్నట్టు వివరించింది. 2022 అక్టోబర్ తర్వాత ఆ నాలుగు దేశాల నుంచి అమెరికాకు వలస వచ్చిన దాదాపు 5,32,000 మందికి ఈ ఉత్తర్వులు వర్తించనున్నాయి. మానవత పెరోల్ కార్యక్రమం కింద అమెరికాకు వచ్చిన వారిపై ఈ కొత్త విధానం ప్రభావం చూపనున్నది. వీరంతా ఇతరుల ఆర్థిక సహకారంతో అమెరికాకు వచ్చారనీ, రెండేండ్ల పాటు యూఎస్లో నివసించటానికి, పని చేయటానికి తాత్కాలిక అనుమతులు పొందారని హౌమ్లాండ్ సెక్యూరిటీ సెక్రెటరీ క్రిస్టీ నోయెమ్ వెల్లడించారు. వీరు ఏప్రిల్ 24 లేదా ఫెడరల్ రిజిస్టర్లో నోటీసులు ప్రచురించిన 30 రోజుల తర్వాత అమెరికాలో ఉండేందుకు లభించిన లీగల్ స్టేటస్ను కోల్పోనున్నారని తెలిపారు.మానవతా పెరోల్ అమెరికాలో సుదీర్ఘకాలంగా ఉన్న వెసులుబాటు. యుద్ధం, రాజకీయ అస్థిరత ఉన్న దేశాల ప్రజలు అమెరికాకు వచ్చి తాత్కాలికంగా నివాసం ఉండేందుకు వీలుగా ఈ లీగల్ స్టేటస్ను కల్పిస్తారు. గతేడాది అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో ట్రంప్ దీని గురించి పలుమార్లు ప్రస్తావించారు. ఇందులో భాగంగా ఆయన ఇప్పుడు ఈ నిర్ణయం తీసుకోవటం గమనార్హం. అంతకముందు ఉన్న నిబంధనల ప్రకారం.. మానవతా పెరోల్ కింద వచ్చేవారు రెండేండ్ల పాటు చట్టబద్ధంగా దేశంలో ఉపాధి పొందొచ్చు. ఆ గడువు ముగిసిన తర్వాత మరింత ఎక్కువ కాలం ఉండాలనుకుంటే.. శరణార్థిగా లేదా వీసా కోసం దరఖాస్తు చేసుకునే సౌకర్యం ఉండేది. అయితే, ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ దరఖాస్తుల ప్రక్రియను నిలిపివేశారు. ఈ నిర్ణయాన్ని సవాలు చేస్తూ పలు ఫెడరల్ కోర్టులలో పిటిషన్లు దాఖలయ్యాయి.

# బంగ్లాదేశ్‌లో సైనిక తిరుగుబాటు ? యూనుస్ ఖేల్ ఖతం!




: త్వరలోనే బంగ్లాదేశ్‌లో సైనిక పాలన మొదలయ్యే అవకాశాలు ఉన్నాయి. తాత్కాలిక ప్రభుత్వ అధినేత మహ్మద్ యూనుస్‌తో విభేదాలు రావడంతో తిరుగుబాటు చేయాలని ఆర్మీ చీఫ్ వకారుజ్జమా సారథ్యంలోని బంగ్లాదేశ్ ఆర్మీ నిర్ణయించుకున్నట్లు తెలిసింది. వకారుజ్జమా సారథ్యంలో సోమవారం రోజు ఆర్మీ ఉన్నతాధికారులు అత్యవసరంగా సమావేశమయ్యారు. తదుపరిగా ఏం చేయాలి ? మహ్మద్ యూనుస్ ప్రభుత్వంపై ఎలాంటి వైఖరిని తీసుకోవాలి ? అనే దానిపై వారు చర్చించారు. ఈ ఎమర్జెన్సీ మీటింగ్‌లో ఐదుగురు లెఫ్టినెంట్ జనరల్స్, ఎనిమిది మంది మేజర్ జనరల్స్ (జీఓసీలు), స్వతంత్ర బ్రిగేడ్‌ల కమాండింగ్ ఆఫీసర్లు, ఆర్మీ హెడ్ క్వార్టర్ల ప్రధాన అధికారులు పాల్గొన్నారు.

తదుపరి ప్రణాళికలు ఇవీ..

బంగ్లాదేశ్‌లో ఎమర్జెన్సీని ప్రకటించాలని తాత్కాలిక ప్రభుత్వ అధినేత మహ్మద్ యూనుస్‌పై(%బఅబం ఎం ూతీఎ%) ఆర్మీ ఒత్తిడిని పెంచే అవకాశం ఉంది. ఎమర్జెన్సీని ప్రకటించగానే సైనిక పాలనను బంగ్లాదేశ్ ఆర్మీ మొదలుపెట్టే ఛాన్స్ ఉంది. తదుపరిగా తమ సారథ్యంలో దేశంలో 'జాతీయ ఐక్యతా ప్రభుత్వం'ను ఏర్పాటు చేయాలని బంగ్లాదేశ్ ఆర్మీ భావిస్తోంది. ఈ ప్రభుత్వంలో ఆర్మీ సూచించే వారికే అవకాశాలు దక్కుతాయి. తద్వారా దేశంలోని అన్ని విభాగాలపై ఆర్మీకి పట్టు దక్కుతుంది.

ఆర్మీకి వ్యతిరేకంగా విద్యార్థి సంఘాలు

అయితే ఆర్మీ వైపు నుంచి జరుగుతున్న ప్రయత్నాలను బంగ్లాదేశ్ విద్యార్థి సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి. షేక్ హసీనాకు చెందిన అవామీ లీగ్ పార్టీ తిరిగి పుంజుకునేలా చేసేందుకే ఆర్మీ ప్రణాళికలు రచిస్తోందని ఆరోపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలను సైన్యం ఖండించింది.బంగ్లాదేశ్‌లో సైనిక తిరుగుబాటు జరగొచ్చనే ఆందోళనల నేపథ్యంలో తాత్కాలిక ప్రభుత్వ అధినేత మహ్మద్ యూనుస్ చైనా పర్యటనకు వెళ్లనున్నారు. ఈ సంక్షోభ వాతావరణం నుంచి గట్టెక్కేందుకు చైనా నుంచి దౌత్యపరమైన సాయాన్ని యూనుస్ అడుగుతారనే అంచనాలు వెలువడుతున్నాయి. అయితే దీనిపై చైనా ఎలా స్పందిస్తుందనేది ఎవరికీ అంతుచిక్కడం లేదు.



## అమెరికా, రష్యా ప్రతినిధుల మధ్య ముగిసిన భేటీ



రియాద్ : ఉక్రెయిన్‌లో పరిమిత కాల్పుల విరమణపై రష్యా, అమెరికా ప్రతినిధుల మధ్య చర్చలు ముగిశాయి. సౌదీ అరేబియాలో 12 గంటల పాటు జరిగిన చర్చల తర్వాత ముగిసిందని రష్యా మీడియా తెలిపింది. నల్ల సముద్రంలో షిప్పింగ్ భద్రతపై దృష్టి సారించాయని, ఈ అంశంపై కొత్త ఒప్పందం సాధ్యమేనని రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్‌రోవ్ తెలిపారు. చర్చలు ముగిసిన అనంతరం మంగళవారం సెర్గీ లావోస్ ఒక ప్రకటన విడుదల చేశారు. అయితే ఆ కొత్త ఒప్పందం కఠినమైన షరతులను కలిగి ఉండాలని అన్నారు. ఆయుధాల సరఫరా కోసం ఖాళీ ఓడలను వినియోగించకుండా రష్యా తనిఖీ చేపట్టాలనుకుంటుందని అన్నారు. రష్యా నుండి ధాన్యం, ఎరువుల ఎగుమతికి వివిధ అడ్డంకులు గతంలో తీవ్రమైన సమస్యగా ఉన్నాయని కూడా సెర్గీ వెల్లడించారు. ఉక్రెయిన్ చర్చల బృందం అమెరికా ప్రతినిధులతో భేటీ అయ్యేందుకు మరో రోజు రియాద్‌లోనే ఉండనున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. రెండవ సమావేశం జరిగే అవకాశం ఉందని, చర్చల్లో పురోగతి సాధించవచ్చని పేర్కొన్నాయి. 12 గంటలకు పైగా చర్చల తర్వాత అమెరికా ప్రతినిధులతో భేటీ ముగిసిందని, త్వరలో సంయుక్త ప్రకటన వెలువడనుందని రష్యా ప్రభుత్వ మీడియా టిఎఎస్ఎస్ పేర్కొంది. తాజాగా దాడులు జరిగినట్లు ఇరు దేశాలు నివేదించినట్లు రష్యా మీడియా పేర్కొంది. రియాద్‌లోని ఒక హోటల్‌లో చర్చలు జరుగుతుండగా, ఈశాన్య ఉక్రెయిన్‌లోని సుమీపై సోమవారం జరిగిన క్షిపణి దాడుల్లో 17 మంది పిల్లలు సహా సుమారు 90 మంది గాయపడ్డారని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ పేర్కొన్నారు. నివాస ప్రాంతంపై జరిగిన దాడిలో అపార్ట్‌మెంట్లు,. విద్యా భవనాలు దెబ్బతిన్నాయని ప్రాంతీయ ప్రాసిక్యూటర్ కార్యాలయం తెలిపింది. ఆస్పత్రి కూడా ప్రభావితమైనట్లు నగర తాత్కాలిక మేయర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉక్రెయిన్‌లోని ప్రత్యేక సైనిక ఆపరేషన్ జోన్‌లో ఒక కారు పై దాడి జరిగిందని, ఈ ఘటనలో ఇద్దరు జర్నలిస్టులు సహా డ్రైవర్ మరణించినట్లు రష్యా ప్రకటించింది.

## మా ఎన్నికల్లో భారత్ జోక్యం.. కెనడా స్పై ఏజెన్సీ ఆరోపణ




ఒట్టావా : త్వరలో జరగబోయే కెనడా ఎన్నికల్లో భారత్ జోక్యం చేసుకునే అవకాశం ఉందని ఆ దేశ స్పై ఏజెన్సీ ఆరోపించింది. ఒక్క భారత్ మాత్రమే కాదు.. ఈ ఎన్నికల్లో రష్యా, చైనా, పాకిస్తాన్ వంటి దేశాలు కూడా జోక్యం చేసుకోవచ్చని కెనడా స్పై ఏజెన్సీ అనుమానం వ్యక్తం చేసింది. తాజాగా ఎన్నికలకు సంబంధించి కెనడియన్ సెక్యూరిటీ ఇంటెలిజెన్స్ సర్వీస్ డిప్యూటీ డైరెక్టర్ వానెస్సా లాయిడ్ మీడియాతో మాట్లాడుతూ.. 'త్వరలో మా దేశంలో జరగబోయే ప్రజాస్వామ్య ప్రక్రియలో చైనా జోక్యం చేసుకునే అవకాశం ఉంది. ఈ ఎన్నికల ప్రక్రియలో చైనా ఎఐ ఆధారిత సాధనాలను ఉపయోగించే అవకాశం ఉందని మాకు సమాచారం. ఈ ఎన్నికల్లో భారత్ కూడా జోక్యం చేసుకునే అవకాశం ఉందని మేము భావిస్తున్నాం. అలాగే రష్యా, పాకిస్తాన్ దేశాలు కూడా ఆ ప్రయత్నాలు చేయవచ్చు' అని ఆయన ఆరోపించారు. కాగా, గతంలో భారత్‌పై కెనడా ఇలాంటి ఆరోపణలే చేసింది. 2019, 2021లో జరిగిన ఎన్నికల్లో భారత్, పాకిస్తాన్‌లు జోక్యం చేసుకున్నాయని కెనడా సెక్యూరిటీ ఇంటెలిజెన్స్ సర్వీస్ ఆరోపణ చేసింది. ఈ ఆరోపణలపై ఆ దేశం దర్యాప్తుకు ఆదేశించింది. ఈ దర్యాప్తులో భారత్ జోక్యం చేసుకోలేదని కెనడా విచారణాధికారులు వెల్లడించారు. అయితే గత రెండు ఎన్నికల్లో చైనా జోక్యం చేసుకున్నట్లు గుర్తించామని కెనడా ఇంటెలిజెన్స్ ఏజెన్సీ తెలిపింది. కెనడాలో రాబోయే నెలలో మధ్యంతర ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ ఎన్నికలకు నూతన ప్రధాని మార్క్ కార్నీ పిలుపునిచ్చారు. వచ్చే నెల 28న మొత్తం 343 పార్లమెంటు స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో ఆ దేశంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారీగా విధించిన సుంకాలపైనే ప్రధాన ప్రచారాస్త్రం కానుంది.

## ఈ గుంపుకి భయపడేది లేదు.. క్షమాపణలు చెప్పను



ముంబయి : తాను ఈ గుంపుకి భయపడనని, క్షమాపణ చెప్పబోనని స్టాండప్ కమెడియన్ కునాల్ కమ్రా స్పష్టం చేశారు. మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేపై కమ్రా ఇటీవల చేసిన వ్యాఖ్యలపై కాషాయం దళాలు కక్షసాధింపు చర్యలకు దిగుతున్న సంగతి తెలిసిందే. తాను చట్టబద్ధమైన చర్యలకు సిద్ధంగా ఉన్నానని, విచారణకు సహకరిస్తానని అన్నారు. " నా నంబర్ లీక్ చేసి, నిరంతరం నాకు కాల్స్ చేయడంలో బిజీగా ఉన్న గుంపుకి ఒకటి చెప్పదలుచుకుంటున్నాను. నాకు వచ్చే కాల్స్ అన్నీ నా వాయిస్ మెయిల్‌కి వెళ్లాయని, అక్కడ మీరు ద్వేషించే పాటను వింటారని, ఆ విషయాన్ని ఇప్పటికే గ్రహించి ఉంటారని నేను అనుకుంటున్నాను. పత్రికా స్వేచ్ఛలో భారతదేశం 195వ స్థానంలో ఉందని కేంద్రం సర్కస్‌ను విశ్వాసంగా ప్రకటించే మీడియా గుర్తుంచుకోవాలని అన్నారు. నేను క్షమాపణ చెప్పను. ఈ గుంపుకు భయపడను. వారికి భయపడి దాక్కుని.. పిరికివాడిలా ఉండను" అని ఎక్స్‌లో పేర్కొన్నారు. కమలం పార్టీ, శివసేనలు హేబిటేట్ స్టూడియోను కూల్చివేయడంపై కూడా కమ్రా స్పందించారు. "హేబిటేట్ స్టూడియో ఒక వేదిక మాత్రమే. అన్ని రకాల ప్రదర్శనలకు వేదిక. హాబిటాట్ కానీ మరేదైనా నా కామెడీకి బాధ్యత వహించదు. స్టాండప్ కమెడియన్ వ్యాఖ్యలను అడ్డుకునేందుకు వేదికపై దాడి చేయడం .. సర్వ్ చేసిన బటర్ చికెన్ మీకు నచ్చలేదని, టమోటాలు తీసుకువెళుతున్న లారీని బోల్తా కొట్టించినంత తెలివి తక్కువ పని" అని ఎద్దేవా చేశారు.

## మోదీ కోసం పార్లమెంట్‌లో ఛావా స్పెషల్ స్క్రీనింగ్, ఎప్పుడంటే..

న్యూఢిల్లీ: బాలీవుడ్ లేటెస్ట్ బ్లాక్‌బస్టర్ చిత్రం 'ఛావా" ను ప్రధాని నరేంద్ర మోదీ వీక్షించబోతున్నారు. ఆయనతో పాటు పలువురు మంత్రులు, ఎంపీల కోసం పార్లమెంట్‌లోనే ప్రత్యేకంగా ఈ చిత్రాన్ని ప్రదర్శించబోతున్నారు. మార్చి 27న పార్లమెంట్‌లోని బాలయోగి ఆడిటోరియంలో ఛావా సినిమాను ప్రదర్శించనున్నారు. ఈ స్క్రీనింగ్‌కి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో పాటు బీజేపీ ఎంపీలు, ఇతర ముఖ్య నాయకులు హాజరుకాబోతున్నట్లు సమాచారం. చిత్ర దర్శకుడితో పాటు తారాగణం కూడా హాజరయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయని న్యూస్18 తన కథనంలో పేర్కొంది. బాలీవుడ్ నటుడు విక్కీ కౌశల్ నటించిన చిత్రమే 'ఛావా. ఛత్రపతి శివాజీ మహారాజ్ కుమారుడు శంభాజీ మహారాజ్ జీవిత కథ ఆధారంగా తెరకెక్కింది. లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వం వహించగా.. దినేష్ విజన్ నిర్మించారు. రష్మిక మందన్నా, అక్షయ్ ఖన్నా ప్రధాన పాత్రలు పోషించారు. ఈ చిత్రం 2025 ఫిబ్రవరి 14న విడుదలై సూపర్ హిట్ అందుకోవడమే కాకుండా.. కేవలం హిందీలోనే రూ.750 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. రీసెంట్‌గా ఈ సినిమాను తెలుగులో కూడా విడుదల చేయగా.. భారీ వసుళ్లను సాధించింది. ఛావా సక్సెస్‌పై గతంలోనే ప్రధాని మోదీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఫిబ్రవరిలో జరిగిన 98వ అఖిల భారతీయ మరాఠీ సాహిత్య సమ్మేళనానికి హాజరైె ఆయన.. ప్రస్తుతం దేశంలో ఛావా హవా కొనసాగుతోందంటూ వ్యాఖ్యానించారు. ఈ క్రమంలోనే ఛావా చిత్రానికి స్ఫూర్తినిచ్చిన నవల(ఛావా) రచయిత శివాజీ సావంత్‌కు ఈ ఘనతంతా దక్కుతుందని అభినందించారు.

# ఇంతకూ ఆ కరెన్సీ ఎక్కడ?





దేశంలో అవినీతి సర్వాంతర్యామి అని, ఏ వ్యవస్థా అందుకు అతీతం కాదని గ్రహించినవారిని సైతం దిగ్భ్రాంతిపరిచేలా ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసంలో జరిగిన అగ్ని ప్రమాదం ఉదంతం రకరకాల మలుపులు తిరుగుతోంది. ఆ ఘటనలో భారీ మొత్తంలో కాలిన కరెన్సీ నోట్ల కట్టలున్న సంచులు బయటపడ్డాయని గుప్పుమంది. సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో సైతం అందుకు సంబంధించిన వీడియో ఉంది. కానీ నోట్ల కట్టల సంగతి అబద్ధమని, కుట్రపూరితమని అంటున్నారు న్యాయమూర్తి. పైగా తానుంటున్న నివాసానికి విడిగా, అందరూ వచ్చిపోగలిగేలా ఉండే ఆ స్టోర్ రూమ్‌కు తాళం కూడా ఉండదని, అలాంటిచోట అంత డబ్బు ఎవరైనా దాస్తారా అన్నది ఆయన ప్రశ్న. కానీ, సామాన్యుల్లో తలెత్తుతున్న ప్రశ్నలు ఇంకా చాలా ఉన్నాయి. ఆయ నొక్కరే కాదు... బాధ్యతాయుత స్థానాల్లోవున్న చాలామంది సంజాయిషీ ఇవ్వకతప్పని ప్రశ్నలవి. ఈ నెల 14 అర్ధరాత్రి అగ్నిప్రమాదం జరిగితే 21వ తేదీన మీడియా బయటపెట్టేవరకూ అధికారికంగా ఎందుకు వెల్లడించలేదు? న్యాయవ్యవస్థ, పోలీస్, అగ్నిమాపక విభాగాలు మౌనంగా ఎందుకు ఉండిపోయాయి? న్యాయమూర్తిపై అంతర్గత విచారణ నిర్వహిస్తున్నామని ఈ ఉదంతం వెల్లడైన వెంటనే సుప్రీంకోర్టు తెలిపింది. కానీ ఆయన విధులకు దూరంగా వుంటారని ఆ మర్నాడు ప్రకటించింది. బదిలీ చేశామని తాజాగా చెబుతోంది. మంచిదే. కానీ ఘటన తర్వాత వారంపాటు ఆయన విధులు ఎలా నిర్వర్తించగలిగారు? స్టోర్‌రూమ్‌కు తాళం లేదని జస్టిస్ వర్మ చెబుతున్నారు. ఘటన సంగతి తెలిశాక తానిచ్చిన ఆదేశాలతో అక్కడికెళ్లిన హైకోర్టు రిజిస్ట్రార్ సైతం ఆ మాటే అన్నారని ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీకే ఉపాధ్యాయ అంటున్నారు. మరి తాళంవున్న గదిలోనే మంటలు రేగాయని పోలీసులు ఎలా చెబుతున్నారు? అసలు అగ్నిమాపక విభాగం తనకున్న నిబంధనల మేరకు నిర్వహించాల్సిన పంచనామా పూర్తిచేసిందా? అక్కడ గుర్తించదగిన లేదా సగం కాలిన సరుకు గురించిన వివరాలు నమోదు చేసిందా? ఇద్దరు సాక్షులతో ఆ పంచ నామాపై సంతకం చేయించిందా? మంటలు ఆర్పిన సందర్భంలో తమకు నోట్ల కట్టలున్న సంచు లేమీ కనబడలేదని ఢిల్లీ అగ్నిమాపక విభాగం చీఫ్ అతుల్ గార్గ్ శనివారం చెప్పారు. అలాంటి ప్రకటనేమీ తానీయలేదని ఆ మర్నాడు ఖండించారు. మళ్లీ గొంతు సవరించుకుని కరెన్సీ నోట్లు దొరకలేదని ఇప్పుడంటున్నారు. సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో పెట్టిన వీడియోలో కాలిపోయిన, సగంకాలిన నోట్లు స్పష్టంగా కనబడుతున్నాయి. కానీ ఆశ్చర్యకరంగా ఇప్పుడా నోట్లు మాయమ య్యాయి. పోలీస్ కమిషనర్ సైతం తన ప్రెస్‌నోట్‌లో పనికిరాని స్టేషనరీ సామాను కాలిపోయిందని తెలియజేశారు తప్ప కరెన్సీ నోట్ల సంగతి ప్రస్తావించలేదు. 14వ తేదీ రాత్రి జరిగిన ప్రమాదంలో కాలిబూడిదైన సామానంతా ఆ మర్నాడు ఉదయం అక్కడి నుంచి తొలగించారు. ఈ పనంతా చేసిందెవరన్న ప్రశ్నకు సమాధానం లేదు. న్యాయమూర్తితోపాటు అగ్నిమాపక విభాగం, పోలీసులు కరెన్సీ లేదని చెబుతుండగా, ఆ నివాసానికి సమీపంలోనే పారిశుద్ధ్య సిబ్బందికి ఒకటి రెండు కాలిన నోట్లు కంటబడ్డాయి. అంటే... ఇందులో నిగూఢంగా ఏదో జరుగుతున్నట్టే కదా! ఈ ఉదంతంలో పారదర్శకంగా వ్యవహరించటానికి సర్వోన్నత న్యాయస్థానం ప్రయత్నించటం అసాధారణమైంది, అభినందించదగ్గది కూడా. మంటల్లో బుగ్గి అయిన కరెన్సీ నోట్ల వీడియోనూ, ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఇచ్చిన ప్రాథమిక నివేదికనూ తన వెబ్ సైట్‌లో ఉంచింది. గతంలో న్యాయమూర్తులపై అవినీతి ఆరోపణలు వచ్చిన సందర్భాలున్నా ఎన్నడూ ఇలా జరగ లేదు. అంతేగాక పంజాబ్, హరియాణా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ శీల్ నాగూ, హిమా చల్ హైకోర్టు చీఫ్ జస్టిస్ సంధావాలియా, కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అనూ శివరామ న్‌లతో ఈ వ్యవహారంపై విచారణకు సుప్రీంకోర్టు ఒక కమిటీని కూడా ఏర్పాటుచేసింది. అయితే అంతమాత్రాన అంతా సక్రమంగా సాగుతోందని భావించనక్కరలేదు. కాలిబుగ్గయిన కరెన్సీ నోట్ల సంచులు మాయమవటం, ఎవరూ నోట్ల సంగతి ధ్రువీకరించకపోవటం సందేహాలకు తావిస్తోంది. రాజ్యానికి సంబంధించిన మూడు ప్రధాన అంగాల్లో ఒక్క న్యాయవ్యవస్థకు మాత్రమే ఆ మూడింటి పరిధులనూ నిర్ణయించగల గొప్ప అధికారాన్ని రాజ్యాంగం ఇచ్చింది. కానీ ఆ బరువు బాధ్యతలకు తగ్గట్టుగా న్యాయవ్యవస్థ జవాబుదారీతనంతో ఉంటున్నదా? గత అనుభవాలు గమనిస్తే లేదన్న సమాధానమే వస్తుంది. కొలీజియం వ్యవస్థను మార్చాలని నిశ్చయించుకుని ఎన్డీయే సర్కారు బిల్లు తెచ్చినప్పుడు పార్లమెంటులో అనేకులు న్యాయవ్యవస్థ తీరుతెన్నులపై తీవ్ర విమర్శలు చేశారు. ఒకరిద్దరు న్యాయమూర్తులపై అభిశంసన వరకూ వెళ్లింది. కానీ విధాన సంబంధమైన సంక్లిష్టత వల్ల అవి వీగిపోయాయి. కొందరు రాజీనామా చేశారు. మరికొందరిపై చేసిన దర్యాప్తు అతీగతీ లేదు. న్యాయాన్యాయాలను విశ్లేషించి తీర్పులివ్వాల్సిన స్థానంలో ఉన్నందువల్ల న్యాయమూర్తులకు పటిష్ఠమైన రక్షణ కవచం ఉండాల్సిందే. దురుద్దేశంతో, కుయుక్తులతో వారిపై నీలాపనిందలు వేసే ధోరణులను అడ్డుకోవాల్సిందే. కానీ అది అవినీతి మకిలి అంటినవారికి ఆలంబన కారాదు. ఈ రెండింటి మధ్యా సమతౌల్యం సాధించటానికి ఇంతవరకూ ఎలాంటి ప్రయ త్నమూ జరగకపోవటమే సమస్యకు మూలం. ఇప్పుడున్న కొలీజియం బదులు మరొకటి వస్తే అంతా మారిపోతుందనుకోవటానికి లేదు. స్వయంప్రక్షాళనకు నడుంబిగించి జవాబుదారీతనం పెంపొందించే పకడ్బందీ యంత్రాంగాన్ని ఏర్పాటు చేయనంతవరకూ ఈ పరిస్థితి మారదు.

# దక్షిణాపథం...




లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన సరికొత్త ఆందోళనలకు దారితీస్తున్నది. డీలిమిటేషన్ ప్రక్రియ కేవలం పార్లమెంటులో ప్రాతినిధ్యానికి సంబంధించిన అంశం మాత్రమే కాదు. నిధులు కేంద్రీకృతం ఆర్థిక నియంతృత్వానికి దారితీస్తుంది. అదే జరిగితే దక్షిణాది భవిష్యత్తు అగమ్యగోచరమే. కొన్ని రాష్ట్రాలు జనాభా నియంత్రణను పాటిస్తే కొన్ని రాష్ట్రాలు విఫలమయ్యాయి. అదే నేడు బీజేపీకి కలిసివచ్చే అంశమైంది. అది దక్షిణాపథానికి శాపమై కూర్చుంది. ఇది దేశాన్ని వెనుకబాటుకు గురిచేసిన వారికి రివార్డివ్వడం లాంటిది. పరిపాలనలో, ఆర్థికాభివృద్ధిలో దక్షిణాది రాష్ట్రాలు దేశానికే ఆదర్శంగా ఉన్నప్పటికీ, తీవ్రమైన నష్టాన్ని ఎదుర్కొంటుంది వాస్తవం. జనాభాను నియంత్రించిన రాష్ట్రాలను శిక్షించి.. ఆ పనిని చేయని రాష్ట్రాలకు సీట్ల నజరానా ప్రకటించడం వైచిత్రి. ఈ వివక్షతపైనే దక్షిణాది రాష్ట్రాల నేతలు మండి పడుతున్నారు. శనివారం చెన్నైలో తమిళనాడు సీఎం స్టాలిన్ అధ్యక్షతన మొదటి జాయింట్ యాక్షన్ కమిటీ 'ఫెయిర్ డీలిమిటేషన్'ను డిమాండ్ చేసింది. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను మరో పాతికేండ్లు వాయిదా వేయాలని కోరుతూ తమిళనాడులో అఖిలపక్ష సమావేశం ఒక తీర్మానాన్ని ఆమోదించింది. ఇదేదో రాష్ట్రానికో, ఒక ప్రాంతానికో ప్రయోజనం కలిగించేది కాదు. జాతీయ సమైక్యతను మరింత పటిష్టం చేసేందుకు ఉద్దేశించిన తీర్మానమది. భారత గణతంత్ర రాజ్య సంస్థాపనలో అంతర్ గర్భితంగా ఉన్న 'సమాఖ్య ఒప్పందం'ను గౌరవించేందుకు ఉత్తమ మార్గం లోక్‌సభా సీట్ల ప్రస్తుత కేటాయింపును ఎటువంటి మార్పు లేకుండా యథాతథంగా కొనసాగించడమే. ప్రస్తుత డీలిమిటేషన్ విధానంతో దేశానికి 36శాతం జీడీపీలో భాగస్వామ్యం ఉన్న దక్షిణాది రాష్ట్రాలకు జనాభా ప్రాతిపదికగా మాత్రమే డీలిమిటేషన్ జరిగితే కేంద్రం చూపేది మాత్రం తెడ్డే. భిన్న అస్తిత్వాలు, సంస్కృతులు కలిగిన ఒక సమాఖ్య ప్రజాస్వామిక దేశం మనదన్న విషయాన్ని కేంద్రం ప్రతిసారి విస్మరిస్తూనే ఉంది. అందుకే రాజ్యాంగ బద్ధంగా జరగాల్సిన ఈ పునర్విభజన రాజకీయ విభజనగా మార్చడం ద్వారా లబ్ధిపొందే మోడీ హిడెన్ ఎజెండా దాగి ఉందన్నది బహిరంగ రహస్యమే. దేశ భవిష్యత్తుకూ రాజకీయ గమనానికి సంబంధించిన కీలకాంశాలపై కూడా పారదర్శకంగా, సమగ్రంగా చర్చ లేకుండా ఒంటెత్తు పోకడలతో వ్యవహరించడం కేంద్ర ప్రభుత్వానికి రివాజు. ప్రతి అడుగులోనూ స్వప్రయోజనాల కోసం ప్రజాస్వామిక పద్ధతులకు తిలోదకాలిచ్చి అంతా తన గుప్పిట్లో పెట్టుకోవడం బీజేపీ సర్కారు విధానం. రాష్ట్రాల హక్కులపై దాడి చేయడం, అంతకంతకూ అధ్యక్షతరహా పాలనను తలపించే విధంగా కేంద్రీకృత పెత్తనానికి దారితీయడం దీని లక్షణంగా ఉంది. అదే సమయంలో అంతా రాజ్యాంగబద్ధంగా పద్ధతి ప్రకారమే జరుగుతున్నట్టు నమ్మించడానికి జరుగుతున్న కుటిల ప్రయత్నాలకు అంతే లేదు. తాజాగా నియోజకవర్గాల పునర్విభజన కూడా ఈ వలయంలో చిక్కి సరికొత్త సవాళ్లకు దారితీస్తున్నది. దక్షిణాది రాష్ట్రాల స్థానాల సంఖ్య తగ్గిపోతుందనీ, ఒకవేళ పెంచినా వాటి వాటాగా రావాల్సిన పెరుగుదల రాదనీ ఈ ముఖ్యమంత్రుల విమర్శ. యూపీ, బిహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో ఎంపీ సీట్ల సంఖ్య ప్రస్తుతం ఉన్న 174 నుంచి 284కు పెరుగుతుందని అంచనా. అదే సమయంలో దక్షిణాదిన కొన్ని రాష్ట్రాలకు ఉన్న సీట్లే పోయే ప్రమాదం ఉంది. ఫలితంగా దేశ రాజకీయాల్లో, విధానపరమైన నిర్ణయాలను ప్రభావితం చేయడంలో.. దక్షిణాది మాటకు విలువ లేకుండా పోయే ముప్పుంది. కేంద్రం నుంచి రావాల్సిన నిధులు కూడా తగ్గిపోయే ప్రమాదం లేకపోలేదు. ఇప్పటికే అన్యాయానికి గురైన దక్షిణాది రాష్ట్రాలకు ఇది పుండు మీద కారం చల్లడమే అవుతుంది. దేశంలో ఒక రాష్ట్రం మరో రాష్ట్రంమీద ఆధిపత్యం చెలాయించే పరిస్థితి ఉండకూడదు. అదే సిసలైన ప్రజాస్వామ్య స్ఫూర్తి. ఇది కేవలం ఉత్తర దక్షిణ రాష్ట్రాల వ్యవహారం కాదు. అభివృద్ధి చెందిన రాష్ట్రాలు, ప్రాంతాలకు నష్టం చేకూర్చే అంశం. కేవలం జనాభా ఆధారంగా సీట్లు పెరిగితే సమాఖ్య స్ఫూర్తికి తీవ్ర విఘాతం కలిగే ప్రమాదం ఉంది. మనమంతా భారతీయులం. అయితే మనందరికీ ఆయా ప్రాంతాల అస్తిత్వం ఉంది. విభిన్న భాషలు, సాంస్కృతిక అస్తిత్వాలతో కూడిన ఒక సమైక్య దేశమే భారతదేశం అన్న విషయాన్ని మనం మర్చిపోకూడదు. బీజేపీ అంటకాగుతున్న చంద్రబాబు, పవన్‌లు కానీ, విపక్షపార్టీ అధినేత జగన్ కానీ తమిళనాడు సమావేశానికి వెళ్లకుండా కేంద్రం ముందు ఆ రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టుపెట్టారు. "దక్షిణాదిలోని అన్ని రాష్ట్రాలు, రాజకీయ పార్టీలు విభేదాలను వీడి, పునర్విభజనలో మన వాటా దక్కించుకునేందుకు ఐక్యంగా పోరాడాలి. తమతమ శాసనసభల్లో దీనిపై తీర్మానం చేయాలి" అన్న తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి మిగతా రాష్ట్రాలు పరిగణలోకి తీసుకోవాలి. దక్షిణ భారత గళాన్ని బలంగా, ఐక్యంగా యావత్ దేశానికి మరింత గట్టిగా వినిపించాల్సిన అవసరం ఉంది.

# ఆనందానికి మనం అందనంత దూరం



'మీరు ప్రపంచానికి చేయగలిగిన మహోపకారం ఏదైనా ఉందంటే అది మీరు ఆనందంగా ఉండటమే' అంటారు సద్గురు జగ్గీ వాసుదేవ్. నిజమే, కానీ ఆ ఆనందాన్ని ఒడిసి పట్టడమెలా అన్నదే అందరినీ వేధించే సమస్య. వాస్తవానికి సంతోషమనేది వచ్చిపోయే చుట్టం లాంటింది. అది శాశ్వతంగా ఏ ఒక్కరి వద్దో ఉండదు. అది ఒక మానసిక స్థితి. మనం చేసే కొన్ని పనులలో మనకు ఆనందం లభిస్తుంది. కానీ, అదే పనిని రోజూ చేస్తూ కూర్చోలేం కదా. వర్షం కురుస్తుంటే ఆ చినుకుల్ని చూస్తూ కూర్చోవడం కొందరికి ఆనందం. ఇంకొందరు రమణీయమైన ప్రకృతిని చూస్తూ పరవశించిపోతారు. ఇంకొందరు తమ ఆనందాన్ని మద్యపానంలో వెతుక్కుంటారు. మరికొందరు తాము చేసే పనిలోనే అపారమైన సంతోషాన్ని ఆస్వాదిస్తారు. ఇదంతా నాణేనికి ఒకవైపు. మన ప్రమేయం లేకుండా సమాజంలో చోటుచేసుకునే మార్పులు, పాలకులు అనుసరించే విధానాల వల్ల కూడా మనకు ఆనందం కలగవచ్చు. ఉదాహరణకు చోరభయం లేనిచోట, నేరాల తీవ్రత కనిపించనిచోట, స్నేహ సౌభ్రాతృత్వాలు వెల్లివిరేసే సమాజం ఉన్నచోట మనకు ఆనందం కలగవచ్చు. అలాంటి దేశాలను సంతోషానికి కేరాఫ్ అడ్రస్‌గా చెప్పుకోవచ్చు. ఆ కోవకు చెందిన దేశమే ఫిన్లాండ్. అంతర్జాతీయ ఆనంద దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీలోని వెల్ బీయింగ్ రీసర్చ్ సెంటర్ విడుదల చేసిన సంతోషకరమైన దేశాల జాబితాలో ఫిన్లాండ్ వరుసగా ఎనిమిదోసారి అగ్రస్థానంలో నిలిచింది. తలసరి ఆదాయం, విద్య, ఆరోగ్యం, ఆత్మసంతృప్తి, జీవనకాలం, అవినీతి, సామాజిక మద్దతు, స్వేచ్ఛ, సమానత్వం, వ్యక్తుల మధ్య సంబంధ బాంధవ్యాలు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని రూపొందించిన ఈ జాబితాలో ఇండియా 118వ స్థానంలో ఉండటం కలవరపరిచే విషయం. అయితే, గత ఏడాదితో పోలిస్తే ఇది కాస్త మెరుగైన స్థానమే అని చెప్పాలి. గత ఏడాది ఇండియా 126వ స్థానంలో నిలిచిందన్న సంగతి గమనార్హం. ఆర్థిక ప్రగతి సాధించినంత మాత్రాన ప్రజలు ఆనందంగా ఉన్నట్లు కాదన్న నగ్నసత్యం ఈ జాబితాను బట్టి విశదమవుతోంది. ఉగ్రవాదం, దిగజారిన ఆర్థిక వ్యవస్థ వంటి సమస్యలతో అతలాకుతలమవుతున్న పాకిస్తాన్, సైనిక పాలనతో అట్టుడుకుతున్న మయన్మార్, అతి చిన్న దేశమైన నేపాల్ వంటి పొరుగు దేశాలు సైతం మనకంటే ముందు ఉన్నాయి. విచిత్రమేమంటే 146 దేశాల ఈ జాబితాలో మొదటి పది ర్యాంకుల్లో పెద్ద దేశాలేవీ లేకపోవడం. డెన్మార్క్, ఐస్‌లాండ్, స్వీడన్, నెదర్లాండ్స్, కోస్టారికా వంటి చిన్న దేశాలే ఫిన్లాండ్ తరువాతి స్థానాలను ఆక్రమించాయి. మరో విశేషమేమిటంటే గాజాను సర్వనాశనం చేసేందుకు కంకణం కట్టుకుని, విధ్వంసం సృష్టిస్తున్న ఇజ్రాయెల్ ఎనిమిదో స్థానంలో ఉంది. తాలిబన్ల పాలనలో ఉన్న అఫ్ఘానిస్తాన్ అట్టడుగు స్థానంలో ఉండగా, సియర్రా లియోన్, లెబనాన్, మలావి, జింబాబ్వే వంటి దేశాలు అఫ్ఘానిస్తాన్ కంటే ముందున్నాయి. ఇక అమెరికాలో ప్రజలు కూడా అంతగా సంతోషంగా లేరనే విషయం ఈ జాబితాను చూస్తే అర్థమవుతుంది. పన్నెండేళ్ల క్రితం 11వ స్థానంలో ఉన్న అగ్రరాజ్యం ఇప్పుడు 24వ స్థానానికి దిగజారింది. ఇండియా విషయానికొస్తే, నిలకడగా సాధిస్తున్న ఆర్థికాభివృద్ధి ప్రజలలో ఏమాత్రం సంతోషం కలిగించడం లేదని అర్థమవుతుంది. సమాజంలో పెరిగిపోతున్న సామాజిక, ఆర్థిక అసమానతలు, మితిమీరుతున్న మానభంగాలు, హత్యలు వంటి నేరాలు, లింగ వివక్ష, పెచ్చుమీరుతున్న అవినీతి వంటివి ప్రజలను సంతోషానికి దూరం చేస్తున్నాయని చెప్పవచ్చు. ఒక కుటుంబం సంతోషంగా ఉండాలంటే జీవనోపాధి ముఖ్యం.అలా చూస్తే, దేశంలో పెరిగిపోతున్న నిరుద్యోగం కూడా ప్రజలను సంతోషానికి దూరం చేస్తోందన్నమాట. ఒక మనిషి జీవితంలో సాధించిన విజయాలకు ఆర్థిక ఎదుగుదల ఒక్కటే కారణం కాబోదు. వృత్తిగత జీవితాన్ని, వ్యక్తిగత జీవితాన్ని సమతుల్యం చేసుకోవడం, స్నేహమయ వాతావరణం, ఆహ్లాదకరమైన ప్రకృతి, స్వేచ్ఛ, సమానత్వం వంటివి మనిషిలో ఆనందోత్సాహాలను పెంచుతాయి. తాజాగా విడుదలైన సంతోషకరమైన దేశాల జాబితా చూసైనా మన పాలకులు గుణపాఠం నేర్చుకోవాలి. పొరుగు దేశాలైన పాకిస్తాన్, నేపాల్, బంగ్లాదేశ్ కంటే మన దేశం వెనుకబడి ఉండటానికి కారణాలేమిటో పాలకులు కనిపెట్టవలసి ఉంది. ప్రజల మనసెరిగి పథకాలకు రూపకల్పన చేయడం, సమాజాన్ని నేరరహితంగా మార్చేందుకు, స్వేచ్ఛాయుత వాతావరణం కల్పించేందుకు చర్యలు చేపడితే ప్రజల జీవి తం ఆనందమయమవుతుంది. ఆ ఆనందమే జీవిత మకరందం!

శుభోదయం
WWW.SUBHODAYAMDAILY.COM
ప్రతీ అక్షరం..ప్రజా సమరం......!



## 'టీడీపీ అధికారంలో ఉంటే రైతన్నకు కష్టాలే'



విశాఖ: టీడీపీ ఎప్పుడు అధికారంలోకి వచ్చినా రైతన్నకు కష్టాలే. వ్యవసాయం అంటే దండగన్న చంద్రబాబు రైతన్నను ఆదుకోకుండా వారిపై పగబడుతున్నారని కూటమి ప్రభుత్వంపై మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ మండిపడ్డారు కూటమి ప్రభుత్వంలో రైతన్నల దుస్థితిపై బొత్స సత్యనారాయణ మీడియాతో మాట్లాడారు. టీడీపీ ఎప్పుడు అధికారంలోకి వచ్చినా రైతులకు ఇబ్బందులు తప్పవు. ప్రభుత్వం అయినా రైతుల కష్టాలను తీర్చేలా ఉంటే బాగున్ను..అది రాష్ట్రంలో లేదు.. టీడీపీ ప్రభుత్వం వస్తే ప్రకృతి కూడా రైతులకు అనుకూలంగా ఉండదు. కడపలో అరటి తోటలు గాలికి నేలకొరిగాయి.పండిన పంటకి గిట్టుబాటు ధర లేదు. మిర్చి పరిస్థితి కూడా అలానే ఉంది ఏం చెయ్యాలో తోచని దుస్థితి.చెరకు రైతులు స్వయంగా పంటను వాళ్ళే కాల్చుకునే పరిస్థితి. ఈ ప్రభుత్వం వ్యవసాయాన్ని, రైతులను ఎందుకు చిన్నచూపు చూస్తుంది. మిర్చి కొంటాం అని హామీ ఇచ్చారు. ఒక్క క్వింటా అయినా కొన్నారా..?.ఒక్క కేజీ అయినా కొన్నారా? కొంటే రైతులు యార్డ్ దగ్గర ఎందుకు ఉంటారు. గోవాడ చెరకు రైతులకు రూ.24 కోట్లు బకాయి పడ్డారు. ఎందుకు రైతులకు చెల్లించడం లేదు. వ్యవసాయం అంటే దండగ అని టీడీపీ నానుడి. ఏ రకంగా చూసినా గత ప్రభుత్వంలో రైతులకు మంచి చేశాం. మా హయాంలో ఇటువంటి పరిస్థితి ఎప్పుడూ లేదు. రైతులకు మాటలే తప్ప చేసినది ఏమి లేదు.గోవాడ షుగర్ ఫ్యాక్టరీకి వెళ్తే పరిస్థితి తెలుస్తుంది. మేము చెప్పింది అబద్ధం అయితే అక్కడికి వెళ్లి ప్రెస్ మీట్ పెట్టి చెప్పండి. హామీలు ఇవ్వడం కాదు చేతల్లో చూపించండి. కూటమి హామీలు చూసి ప్రజలు మోసపోయారు..హామీలు నమ్మి మోసపోయామని ప్రజలకు కూడా అర్థమైంది.ఇక్కడ పండిన పంటకు ఇతర ప్రాంతాల్లో మార్కెటింగ్ చేయొచ్చు కదా. రైతులను ఆదుకోవాలనే తపన ఈ ప్రభుత్వానికి లేదు.రైతుల ఇబ్బందులను ఈ పరిణామాలను తీవ్రంగా ఖండిస్తున్నాను. రైతులను వెంటనే ఆదుకోవాలి.రైతులకు ఇచ్చిన హామీలను మాటల్లో కాదు చేతల్లో చూపించాలి' అని డిమాండ్ చేశారు.

## డబ్బులిచ్చి మరీ తిట్టించారు.. ఇది పొలిటికల్ సుపారీనే!



ముంబై: ప్రముఖ స్టాండప్ కమెడియన్ కునాల్ కమ్రా తనను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలపై శివసేన అధినేత, మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ షిండే స్పందించారు. కునాల్ ఆ వ్యాఖ్యలు వ్యంగ్యంగానే చేసినట్లు తాను అర్థం చేసుకోగలనని.. కానీ ప్రతిదానికి ఓ హద్దు ఉంటుందని అన్నారాయన. ఈ క్రమంలో సంచలన ఆరోపణలకు దిగారు. మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ శిందేపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశాడు స్టాండప్ కమెడియన్ కునాల్. ఈ నేపథ్యంలో ఆ షో జరిగిన హబిటాట్ స్టూడియోపై షిండే వర్గీయులు దాడికి పాల్పడ్డారు. అయితే అది ఎవరైనా సరే విధ్వంసానికి తన మద్దతు ఎప్పుడూ ఉండబోదని ఏక్‌నాథ్ షిండే అన్నారు. బీబీసీ మరాఠీ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన కునాల్ ఎపిసోడ్‌పై స్పందించారు. ప్రజాస్వా?మ్యంలో వాక్ స్వాతంత్రం అందరికీ ఉంటుంది. దీనిని కాదనలేం. నా సంగతి పక్కన పెట్టండి. ప్రధాని మోదీ, భారత మాజీ న్యాయమూర్తి, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, హోం మంత్రి అమిత్ షా..వీళ్ల గురించే కాదు ప్రముఖ వ్యాపారులు, గొప్ప గొప్పవాళ్ల గురించి కూడా చాలా తప్పుగా మాట్లాడాడతను. ఇలాంటి వ్యాఖ్యల కోసం అతనికి ఎవరి నుంచి సుపారీ అందింది?. ఇది కచ్చితంగా రాజకీయ ప్రత్యర్థుల కుట్రే అని అన్నారాయన. ఈ వ్యవహారంలో ప్రజలు కూడా ప్రతిపక్షాలనే వేలెత్తి చూపిస్తున్నారని.. అయినా వాళ్ల విధానాలు మారడం లేదన్నారు. ఇక హబిటాట్ స్టూడియోపై జరిగిన దాడిని ఖండించిన షిండే.. అది కార్యకర్తల మనోభావాలకు సంబంధించిన అంశమని పేర్కొన్నారు. "ఏక్‌నాథ్ షిండే అనేది చాలా సున్నితమైన అంశం. నాపై ఎన్నో ఆరోపణలు వస్తుంటాయి. కానీ, నేను నా పనితోనే వాటికి బదులిస్తుంటా. విధ్వంసానికి నేను వ్యతిరేకం. కానీ, పార్టీ కార్యకర్తలు ఊరుకోలేరు కదా. చర్యకు ప్రతిచర్య కచ్చితంగా ఉంటుంది" అంటూ వ్యాఖ్యలు చేశారు.


## మరో భారీ ఎన్‌కౌంటర్.. ముగ్గురు మావోయిస్టులు మృతి



ఛత్తీస్‌గఢ్: దంతేవాడ-బీజాపూర్ జిల్లాల సరిహద్దులో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య ఎదురు కాల్పులు జరిగాయి. ఉదయం 8 గంటల నుంచి కాల్పులు కొనసాగుతున్నాయి. ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారు. మృతుల్లో వరంగల్‌కు చెందిన మావోయిస్టు సుధాకర్ ఉన్నారు. సుధీర్‌అలియాస్ సుధాకర్‌పై రూ.25 లక్షల రివార్డ్ ఉంది. మృతదేహాలతో పాటు ఆయుధాలను కూడా భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రదేశంలో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. దంతేవాడ- బీజాపూర్ జిల్లాల సరిహద్దులో గల అడవుల్లో మావోయిస్టుల స్థావరాన్ని 500 మంది బలగాలు చుట్టుముట్టాయి. ఎన్‌కౌంటర్ మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశాలు ఉన్నాయని పోలీసులు భావిస్తున్నారు. దంతేవాడ జిల్లా ఎస్పీ గౌరవ్ రాయ్ ఈ ఆపరేషన్‌పై నిఘా పెట్టారు. ఘటనా స్థలంలో కూంబింగ్ జరుగుతోందని పోలీసులు తెలిపారు. పెద్ద సంఖ్యలో మావోయిస్టులు ఉన్నారనే సమాచారంతో భద్రతా బలగాలను రంగంలోకి దించారు.

## జడ్జి ఇంట్లో నోట్ల కట్టల కేసు

### - జస్టిస్ వర్మ ఇంటికి 'సుప్రీం' కమిటీ



ఢిల్లీ: హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంట్లో అగ్ని ప్రమాదం జరిగిన సందర్భంలో నోట్ల కట్టలు బయటపడ్డాయి. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టేందుకు సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా నియమించిన ముగ్గురు ప్రధాన న్యాయమూర్తుల కమిటీ' జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంటికి వెళ్లింది. అగ్ని ప్రమాదం జరిగిన సమయంలో బయపడ్డ నోట్ల కట్టల గురించి దర్యాప్తు చేపట్టనుంది. మార్చి 14న ఢిల్లీలోని జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసంలో అగ్నిప్రమాదం జరిగింది. రాత్రి జరిగిన అగ్ని ప్రమాదం తర్వాత భారీ మొత్తంలో కాలిన నోట్ల కట్టలు వెలుగులోకి వచ్చాయి. దీంతో జస్టిస్ యశ్వంత్ వర్మపై ఆరోపణలు వెల్లువెత్తాయి. ఇదే అంశంపై విచారణ చేపట్టాలని సుప్రీం కోర్టు..పలు రాష్ట్రాలకు చెందిన ముగ్గురు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులతో కమిటీని నియమించింది. ఆ కమిటీలో పంజాబ్ హర్యానా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి షీల్ నాగు, హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జీఎస్ సందవాలియా, కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి అను శివరామన్‌లను సభ్యులుగా చేర్చింది. కాలిన నోట్ల కట్టల విలువ రూ.1.5 కోట్లు ఉంటుందని అంచనా అంటూ పలు రిపోర్టులు వెలుగులోకి వచ్చింది. దీంతో సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా, మరో నలుగురు సీనియర్ న్యాయమూర్తుల కొలీజియం జస్టిస్ యశ్వంత్ వర్మను ఢిల్లీ హైకోర్టు నుంచి అల్హాబాద్ హైకోర్టుకు ట్రాన్స్‌ఫర్ చేసింది. నోట్ల కట్టల విషయంలో స్పష్టత వచ్చే వరకు న్యాయపరమైన పనులు కేటాయించవద్దని సుప్రీం కోర్టు.. ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి దేవేంద్ర ఉపాధ్యాయకు ఆదేశాలు జారీ చేసింది.

# డీలిమిటేషన్ పోరు



జనాభా ప్రాతిపదికన పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్)ను వ్యతిరేకిస్తూ వివిధ రాజకీయ పార్టీలతో జాయింట్ యాక్షన్ కమిటీ (జెఎసి) ఏర్పాటు మోడీ ప్రభుత్వ కుట్ర పూరిత చర్యకు తిరుగులేని హెచ్చరిక. జనాభా ప్రాతిపదికన 2026లో డీలిమిటేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుందని కేంద్రం ఎప్పుడైతే వెల్లడించిందో ఆ క్షణం నుంచి రాజకీయంగా కలకలం లేచింది. నియంత్రణా చర్యలతో జనాభాను అదుపు చేసిన దక్షిణాది రాష్ట్రాల్లో ఆందోళన మరింత ఎక్కువైంది. సరిగ్గా ఈ సమయంలోనే దక్షిణాది రాష్ట్రాల్లో పార్లమెంట్ సీట్లు తగ్గబోవంటూ హోం మంత్రి అమిత్‌షా వంటి వారి వివాదాస్పద వ్యాఖ్యలతో అగ్నికి ఆజ్యం పోసినట్లయింది. కేంద్ర ఈ గందరగోళ అస్పష్ట వ్యవహారం నేపథ్యంలో తమిళనాడు ముఖ్యమంత్రి, డిఎంకె చీఫ్ స్టాలిన్ దక్షిణాది రాష్ట్రాలతో పాటు డీలిమిటేషన్ వల్ల సీట్ల కోత కత్తి వేలాడుతున్న పంజాబ్, ఒడిశా, పశ్చిమబెంగాల్ తదితర రాష్ట్రాల్లోని ప్రధాన రాజకీయపార్టీలతో శనివారం చెన్నరులో నిర్వహించిన తొలి సమావేశం జయప్రదమైంది. కేరళ, పంజాబ్, తెలంగాణ సిఎంలతోపాటు కర్ణాటక డిప్యూటి సిఎం, బిఆర్ఎస్ సహా ఆరు రాష్ట్రాలకు చెందిన 14 పార్టీలు పాల్గొనడమే కాకుండా జెఎసిగా ఏర్పడటం భవిష్యత్ కార్యాచరణపై పలు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించడం మంచి పరిణామం. డీలిమిటేషన్‌పై కేంద్ర ప్రభుత్వం పారదర్శకతకు పాతరేసిందని అది చేస్తున్న విన్యాసాలే తెలుపుతాయి. దేశ వ్యాప్తంగా సీట్లు పెరగుతాయంటున్న మోడీ సర్కారు అందుకు ప్రాతిపదికేంటో ఇదమిత్థంగా పేర్కొనలేదు. రాష్ట్రాల్లో ఇప్పుడున్న సీట్ల నిష్పత్తితోనే పెరుగుతాయా లేదంటే జనాభా ప్రాతిపదికనా అనే విషయంలో మబ్బులో పెట్టి మాట్లాడుతోంది. ఒక వేళ జనాభానే కొలబద్ద అయితే జాతి హితం కోసం జనాభాను నియంత్రించిన రాష్ట్రాల్లో సీట్లు తగ్గుతాయి. పార్లమెంట్‌లో వాటి ప్రాతినిధ్యం కుదించుకుపోతుంది. ఈ చర్య అన్యాయంగా ఆయా రాష్ట్రాలను శిక్షించడమే అవుతుంది. పర్యవసానంగా కేంద్రం నుంచి నిధులు తగ్గుతాయి. సంప్రదాయం, గుర్తింపు, అభివృద్ధి, రాజకీయశక్తి క్షీణిస్తుంది. రాష్ట్రాల మధ్య అసమానతలు పెరుగుతాయి. సామాజిక న్యాయం, మహిళా సాధికారత దెబ్బతింటుంది. 1971 తర్వాత దక్షిణాది సహా మరికొన్ని రాష్ట్రాలు జనాభాను నియంత్రించాయి. ఎమర్జెన్సీ సమయం 1976లో, వాజ్‌పేయి హయాం 2001లో చేసిన రాజ్యాంగ సవరణలు సీట్ల సంఖ్యను ఫ్రీజ్ చేశాయి. ఇప్పుడు జనాభా ప్రాతిపదిన డీలిమిటేషన్ అంటే జనాభా నియంత్రణ లక్ష్యాలను చేరుకోని ఉత్తరప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో సీట్లు పెరుగుతాయి. జనాభా లెక్కల సేకరణ ప్రక్రియ నిజానికి 2021కే పూర్తి అయి ఉండాలి. కాని ఆ లెక్కలు వెల్లడించే కఠోర వాస్తవాలను స్వీకరించే దమ్ము లేని బిజెపి ఏకంగా జనగణననే నిరవధికంగా వాయిదా వేస్తోంది. మరోపక్క డీలిమిటేషన్ వివాదాన్ని ముందుకు తెచ్చి 'జనాభా ప్రాతిపదిక' అంటోంది. ఇది ఆ పార్టీ నయవంచనను వెల్లడిస్తోంది. ఉత్తరాదిలో బిజెపి ప్రభావం ఎక్కువ. ఉత్తరాదిలో, బిజెపి పాలిత రాష్ట్రాల్లో సీట్లు పెంచుకొని రాజకీయంగా లబ్ధి పొందే కుట్రకు బిజెపి తెరతీసిందని అనుమానం వస్తుంది. ఈ తరుణంలో మరో పాతికేళ్లపాటు డీలిమిటేషన్ వద్దన్న విపక్ష పార్టీల జెఎసి డిమాండ్ న్యాయసమ్మతమైంది. డిఎంకె నిర్వహించిన సమావేశానికి దక్షిణాది రాష్ట్రాల నుంచి దాదాపు అన్ని ప్రధాన రాజకీయ పార్టీలూ హాజరుకాగా ఆంధ్రప్రదేశ్ నుంచి ఎవ్వరూ వెళ్లలేదు. అధికార కూటమి పార్టీలు డీలిమిటేషన్ పర్యవసానాలపై నోరు మెదపకపోవడం రాష్ట్రానికి హానికరం. టిడిపి, జనసేన పార్టీలు బిజెపి కుట్రలో భాగస్వాములైతే రాష్ట్ర ప్రయోజనాలకు నష్టం చేసినవారవుతారని గ్రహించాలి. వైసిపి స్టాలిన్ నిర్వహించిన సమావేశానికి వెళ్లకుండా ప్రధానికి లేఖ రాసింది. దక్షిణాది రాష్ట్రాల వాటా తగ్గకూడదంటూనే మోడీ నేతృత్వం పట్ల తన విధేయతను జగన్ చాటుకోవడం ఆ పార్టీ అవకాశవాద వైఖరికి నిదర్శనం. ఇక తెలుగు ప్రజల కోసమే పుట్టానని చెప్పే టిడిపి మౌనం వహించడం తెలుగు ప్రజలను వంచించడమే. ఇప్పుడైనా మౌనం వీడి అసంబద్ధ, అన్యాయమైన డీలిమిటేషన్‌కు వ్యతిరేకంగా టిడిపి, జనసేన తమ వైఖరిని ప్రకటించాలి. రాష్ట్ర ప్రజలకు జవాబు చెప్పవలసిన బాధ్యత నుంచి ఈ పార్టీలు తప్పించుకోలేవు.

# భయం నుంచే కోపం!



కోపం, క్రోధం, ఆగ్రహం భయం-అన్నీ ఒక్కటే. కోపం తాటాకు మంటలా క్షణికం అయితే, క్రోధం చింతనిప్పులా తీవ్రతరం దీర్ఘకాలికం అని చెబుతారు. మనిషన్న తర్వాత కోపం సహజం. కానీ, అది క్రోధంగా మారకూడదు. ఈ క్రోధం ఎదుటివారిని ఎంతవరకూ కాలుస్తుందో తెలియదు కానీ, తనను మాత్రం తక్షణం కాలుస్తుంది. విచక్షణ కోల్పోయేలా చేస్తుంది. ఓ సింహం తన కంటబడిన కోతిని వెంటాడుతుంది. అది ప్రాణ భీతితో ఎత్తైన చెట్టు ఎక్కింది. కోతి తప్పించుకుందన్న అక్కసు, ఆక్రోశంతో ఊగిపోయిన సింహం పట్టలేని క్రోధంతో ఆ చెట్టును కూల్చేస్తుంది. అది కాస్తా తనమీదే పడటంతో ఆ చెట్టుకింద పడి సింహం చచ్చిపోతుంది. అందుకే 'తన కోపమే తన శత్రువు' అంటారు. 'విచక్షణా జ్యోతి కోపమనే సుడిగాలికి కొండెక్కుతుంది' అన్న అమెరికన్ తత్వవేత్త రాబర్ట్ ఇంగర్ సాల్ మాట అక్షర సత్యం. ఎర్రగా కాలిన నిప్పు కణికలను ఎవరిపైనైనా విసరాలనుకుంటే ముందు మన చెయ్యి కాలుతుందన్న విషయం మర్చిపోకూడదు. కోపం భయం మధ్య సంబంధం చాలా సంక్లిష్టమైనది సహజమైనది. అది లింగవివక్షనూ వదిలిపెట్టలేదు. తత్వవేత్త మార్తా నస్బామ్ 'యాంగర్ అండ్ ఫర్గివ్‌నెస్'లో రాసినట్లుగా 'మగ' అనే లేబుల్ వేయబడిన శిశువు ఏడుపు సాధారణంగా కోపంగా వున్నట్లు అర్థం చేసుకుంటారు. కానీ ఏడుస్తున్న ఆడపిల్ల 'భయం'తో ఏడుస్తున్నట్లుగా పరిగణించబడుతుంది. ఇక్కడ ఏడుస్తున్న చర్య ఒక్కటే. వివరణ మాత్రం లింగపరమైనది. కోపంగా వున్న స్త్రీ ఉన్మాదంగా వుంటుంది. ఆమెలో ఏదో తప్పు వుంది. అదే కోపంగా వున్న పురుషుడు వీరుడు. ఈ వివక్ష సమాజ దృక్కోణంలోనే కాదు, కోపం వ్యక్తీకరణలోనూ వేళ్లూనుకుంది. కోపం, పగ, ద్వేషం వంటి వాటిని బలమైన అంశాలుగా సినిమాల్లో, కథలు, పురాణాల్లో చూస్తాం. అన్యాయాన్ని సరిచేయడం, న్యాయాన్ని పరిరక్షించడం ఒక భాగం. అయితే, పగ తీర్చుకోవడం అనేది ధైర్యానికి సూచిక అనుకుంటారుగానీ, వాస్తవానికది భయానికి ప్రతీక. తన సోదరికి జరిగిన అవమానానికి ప్రతీకారం తీర్చుకోవాలన్న రావణుడి ప్రయత్నం లంక నాశనానికి కారణమైంది. 'ప్రతి మనిషిలోనూ 160 రకాల భయాలుంటాయి' అంటాడు మనస్తత్వ శాస్త్ర పితామహుడు సిగ్మండ్ ఫ్రాయిడ్. ఏదోక విషయంలో అతిగా భయపడేవాళ్లే ఎక్కువ కోప్పడతారన్నది నిరూపితమైన అంశం. ఔరంగజేబు అప్పుడెప్పుడో ఏదో చేశాడని, ఇప్పుడు పగ తీర్చుకోవాలనుకోవడం, ఆతని సమాధి తవ్వేయాలనుకోవడం అంటే భయం వల్ల కాక మరేమిటి? దేశ జనాభాలో మైనారిటీగా వున్న ముస్లిం, మైనారిటీల పట్ల అంత భయం ఎందుకు? చేతగానితనాన్ని, అసమర్థతని కప్పిపుచ్చుకోడానికి ప్రజల దృష్టి మళ్లించడానికి భయంతో చేస్తున్న ఎదురుదాడి తప్ప మరోటి కాదు. నెల్సన్ మండేలా తన జీవితమంతా నిర్బంధంలోనే గడిపారు. ఆయన బయటికి వచ్చిన తర్వాత దీనికి కారణమైన వారిపై తప్పుడు కేసులు పెట్టి, పగ తీర్చుకునే ప్రయత్నం చేయలేదు. దానికి ప్రత్యామ్నాయంగా ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడం, దాని బలోపేతం చేయడంపై దృష్టి పెట్టారు. అందువల్లే ఆయన ప్రపంచ ప్రఖ్యాతి పొందారు. నోబెల్ శాంతి పురస్కారం అందుకున్నారు. గాంధీ హిందూ మతానికి ఏదో ద్రోహం చేశాడన్న పేరుతో గాడ్సే ఆయన్ని కాల్చి చంపాడు. నిజానికి మత ఘర్షణల చిచ్చు నుంచి భారతదేశాన్ని కాపాడినందుకు ఆయనంటే వాళ్లకి భయం. కోపం, పగ, ద్వేషం నుంచి మానవత్వ విలువలు పెరగవు. కోపం మానవత్వాన్ని హరిస్తుంది. విచక్షణ మందగిస్తుంది. అప్పుడిక మనిషి పశుప్రాయుడే. ఇదొక ఆటవిక లక్షణం మాత్రమే. ఈ తరహా జంతు లక్షణాలను గొప్పగా చిత్రీకరించుకొని సినిమాల్లోనే కాకుండా జీవితంలో కూడా ఆ కోపం ప్రదర్శించకపోతే నువ్వేదో చేతగాని వాడనుకుంటారేమోనన్న భయం. కోపం యొక్క గుండె తరచుగా ప్రతీకారాన్ని కోరుకుంటుంది' అంటారు నస్బామ్. ఈ మానవ బలహీనతను తమ రాజకీయ ప్రయోజనాలకు రెచ్చగొట్టి వాడుకోజూసే వారిలో మానవత్వం వుంటుందా? వారిని నాగరికులుగా పరిగణించగలమా?

# ఎన్ఈపీని వెనక్కి తీసుకోవాలి

### విద్య కాషాయీకీరణ ఆపాలి

### యునైటెడ్ స్టూడెంట్ పార్లమెంట్ మార్చ్

### యూనివర్సిటీల్లో వీసీలను బీజేపీ నేరుగా నియంత్రిస్తుంది : రాహుల్ గాంధీ



న్యూఢిల్లీ- కేంద్రంలోని మోడీ సర్కారు తీసుకొచ్చిన వివాదాస్పద జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ), విద్యను నిరంతరం కాషాయీకరణ చేయడాన్ని వ్యతిరేకిస్తూ వేలాది మంది విద్యార్థులు కందం తొక్కారు. కేంద్ర ప్రభుత్వ విద్యా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సోమవారం నాడిక్కడ జంతర్ మంతర్ వద్ద ఇండియా బ్లాక్ విద్యార్థి సంఘాలు యునైటెడ్ స్టూడెంట్ పార్లమెంట్ మార్చ్‌ను నిర్వహించాయి. ఈ సందర్భంగా విద్యార్థులు, పోలీసుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. విద్యార్థులు బారికేడ్ పైకి ఎక్కి నిరసన తెలిపారు. ఎఈపీ, యూజీసీ ముసాయిదా, ప్రశ్నాపత్రాల లీక్ కుంభకోణం, వెనుకబడిన తరగతుల విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, విశ్వవిద్యాలయ సంఘాల ఎన్నికలు, నిరుద్యోగ సమస్య వంటి వివిధ అంశాలపై ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఎన్ఎస్‌యూఐ, ఎంఎస్ఎఫ్ సహా దాదాపు ఏడు విద్యార్థి సంఘాలు ఆందోళనలో పాల్గొన్నాయి. విద్య రంగంలో ప్రయివేటీకరణ-మతతత్వ బంధానికి వ్యతిరేకంగా నినదించారు. దేశవ్యాప్తంగా విశ్వవిద్యాలయాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న విద్యార్థులు ఈ మార్చ్‌లో అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పాఠ్యాంశాల్లో పెరుగుతున్న ఆర్ఎస్ఎస్ సైద్ధాంతిక చొరబాటు, విద్య వాణిజ్యకరణ, విద్య నుంచి అణగారిన వర్గాలను బహిష్కరించడం, జాదవ్‌పూర్, జామియా, పాండిచ్చేరి, హెచ్‌సీయూ నుంచి జేఎన్‌యూ వరకు క్యాంపస్ ప్రజాస్వామ్యం లేకపోవడం వంటి వాటికి వ్యతిరేకంగా విద్యార్థులు తమ గళాలను వినిపించారు. ప్రజాస్వామ్య, సమ్మిళిత విద్యపై ఈ దాడులను సవాలు చేయాలనే విద్యార్థి ఉద్యమం ధృఢ సంకల్పాన్ని ఈ మార్చ్ నొక్కి చెప్పింది. సీపీఐ(ఎం) ఎంపీలు అమ్రారామ్, వి.శివదాసన్, సీపీఐ ఎంపీ సంతోశ్ కుమార్, సీపీఐఎంఎల్ ఎంపీ సుదామ ప్రసాద్, సీపీఐ(ఎం) మాజీ ఎంపీ నీలోత్పల్ బసు తదితరులు కూడా మాట్లాడి విద్యార్థులు ఉద్యమానికి మద్దతు పలికారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నేతలు వారికి వినతి పత్రాలు సమర్పించారు

### యూనివర్సిటీల్లో వీసీలను బీజేపీ నేరుగా నియంత్రిస్తుంది: రాహుల్ గాంధీ

ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ మాట్లాడుతూ "విశ్వవిద్యాలయాలలో వీసీలను బీజేపీ నేరుగా నియంత్రిస్తుంది. దేశ భవిష్యత్తును, విద్యా రంగాన్ని నాశనం చేయడానికి ఆర్ఎస్ఎస్ ప్రయత్నిస్తోంది" అని విమర్శించారు. విద్యావ్యవస్థ పూర్తిగా ఆర్ఎస్ఎస్ అధీనంలోకి వెళ్లిపోతే దేశం నాశనమవుతుందని విమర్శించారు. ఆయా పార్టీల సిద్ధాంతాలు, విధానాల విషయంలో 'ఇండియా బ్లాక్' భాగస్వామ పార్టీల మధ్య సల్ప తేడాలు ఉండవచ్చనీ, కానీ దేశ విద్యా వ్యవస్థ విషయంలో ఎప్పుడూ రాజీపడలేదని అన్నారు. "దేశ భవిష్యత్తు, విద్యా వ్యవస్థను ఒక సంస్థ నాశనం చేయాలని చూస్తోంది. ఆ సంస్థ పేరు ఆర్ఎస్ఎస్. విద్యావ్యవస్థ వారి చేతుల్లోకి వెళ్తే దేశం నాశనమవుతుంది. ఎవరికీ ఉపాధి అవకాశాలు రావు" అని అన్నారు. దేశంలో యూనివర్సిటీల వైస్ ఛాన్సలర్లపై ఆర్ఎస్ఎస్ అధిపత్యం చెలాయిస్తోందనీ, రాబోయే రోజుల్లో రాష్ట్ర యూనివర్సిటీల వీసీలను కూడా ఆర్ఎస్ఎస్ సిఫారసుతోనే నియమిస్తారని అన్నారు. దీనిని మనం ఆపాలనీ, ఈ విషయాలన్నీ విద్యార్థుల ముందుకు విద్యార్థి సంఘాలు తీసుకువెళ్లాలని సూచించారు. ప్రధాని మోడీ గత వారం పార్లమెంట్‌లో మహాకుంభ మేళాను ప్రస్తావనకు తెచ్చారనీ, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం గురించి కూడా ఆయన మాట్లాడి ఉంటే బాగుండేదని రాహుల్ గాంధీ అన్నారు. విద్యా వ్యవస్థపై కూడా ఒక్క ముక్క కూడా మాట్లాడలేదని అన్నారు. దేశంలోని వనరులన్నింటినీ అదానీ, అంబానీలకు, విద్యా సంస్థలన్నింటినీ ఆర్ఎస్ఎస్‌కు అప్పగించడమే వారి మోడల్ అని విమర్శించారు. యూనివర్సిటీలు, కాలేజీల్లో టీచర్లు, సిబ్బంది నియామకాలకు సంబంధించిన యూజీసీ డ్రాఫ్ట్ రెగ్యులేషన్స్ కేవలం ఒకే చరిత్ర, ఒకే సంప్రదాయం, ఒకే భాషను బలవతంగా రుద్దాలనే ఆర్ఎస్ఎస్ ఎజెండాను ముందుకు తీసుకువెళ్లే ప్రయత్నంగా ఆయన పేర్కొన్నారు. ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విపి సాను, మయూఖ్ బిశ్వాస్ మాట్లాడుతూ జాతీయ విద్యా విధానంతో విశ్వవిద్యాలయాలను కాషాయీకరణ చేసే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. ప్రభుత్వ విద్యపై పెరుగుతున్న దాడికి వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాల అవసరాన్ని నొక్కి చెప్పారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీకి వినతి పత్రం అందజేశారు. నాణ్యమైన, శాస్త్రీయమైన లౌకిక విద్య కోసం పోరాటంలో ఎస్ఎఫ్ఐ ఎల్లప్పుడూ ముందంజలో ఉంటుందని, ప్రభుత్వ విద్యపై దాడులు తీవ్రతరం కావడంతో పోరాటం మరింత బలపడాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వరుణ్ చౌదరి (ఎన్ఎస్‌యూఐ), ప్రసేన్‌జిత్ (ఏఐఎస్ఏ), దినేశ్ సీరంగరాజ్ (ఏఐఎస్ఎఫ్), నౌఫాల్ ఎండి సఫియుల్లా (పీఎస్‌యూ), టిస్ ముంబయిలో సస్పెండ్ అయిన పీహెచ్‌డీ స్కాలర్, ఎస్ఎఫ్ఐ సీఈసీ సభ్యుడు రామదాస్ ప్రిని శివానందతో పాటు ఎస్ఎఫ్ఐ నేతలు దినిత్ డెంటా, నితీష్ నారాయణన్, ఎస్ఎఫ్ఐ ఢిల్లీ అధ్యక్ష, కార్యదర్శులు సూరజ్, ఐషీఘోష్, సమాజ్‌వాది ఛాత్ర సభ, సీఆర్‌జేడీ, ఎంఎస్ఎఫ్ సంఘాల నేతలు పాల్గొన్నారు.